

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 11-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 134 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి పూర్తి; నక్షత్రం: స్వాతి పూర్తి; వర్జ్యం: మ. 12.03-1.50, దుర్ముహూర్తం: సా.4.58-5.48; అమృతఘడియలు: రా.10.44-12.31; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బంగ్లా సీజే రాజీనామా

ప్రధాన న్యాయమూర్తి ఒబైదుల్ హసన్ కేంద్రంగా ఢాకాలో విద్యార్థుల ఆందోళన

సుప్రీంకోర్టును చుట్టుముట్టి నిరసన

గంట వ్యవధిలో రాజీనామాకు పట్టు

షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర

తాత్కాలిక సీజేగా అప్ఫుఖుల్ నియామకం

2

న్యాయవ్యవస్థ.. అంతేనా?

మన దేశంలో అన్ని వ్యవస్థలూ కుప్పకూలి పోయాయన్నది మెజారిటీ ప్రజల భావన. ఇతర వ్యవస్థల్లో న్యాయం దక్కనప్పుడు ఎవరైనా న్యాయ వ్యవస్థ తలుపు తడతారు. అక్కడ కూడా వెంటనే న్యాయం దక్కుతుందన్న భరోసాగానీ, అసలు న్యాయం లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేకుండా పోయింది. మిగతా వ్యవస్థలతో పోల్చితే న్యాయ వ్యవస్థ కొంచం మెరుగ్గా ఉన్నప్పటికీ.. ఆ వ్యవస్థపై కూడా ప్రజలకు నమ్మకం పోతోంది. వివిధ సందర్భాలలో సుప్రీం కోర్టు చేసే వ్యాఖ్యలకూ, అది ఇచ్చే ఆదేశాలకూ పొంతన ఉండటం లేదు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టును తప్పుపట్టిన సుప్రీంకోర్టు.. హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను మాత్రం రద్దు చేయలేదు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?



కొత్త పలుకు

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తే పాలక పక్షాలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. బంగ్లాదేశ్ పరిణామాలనే తీసుకుందాం. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా ఏడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి ఆమె తండ్రి ముజిబుర్ రెహమాన్ కారణం. బంగ్లా ప్రజలు ఆయనను జాతిపితగా గౌరవించి నెత్తిన పెట్టుకున్నారు. అదే ప్రజలు ఇప్పుడు ఆయన విగ్రహాలను పగలగొడుతున్నారు.

రిజర్వేషన్ల విషయంలో హసీనా నిర్ణయాన్ని పాక్షికంగా సమర్థించిన బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాస భవనంపై కూడా ప్రజలు దాడి చేశారు. పాలకులు మాత్రమే కాదు- న్యాయ వ్యవస్థ కూడా ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే తీర్పులు ఇవ్వాలని బంగ్లా పరిణామాలు చెబుతున్నాయా? అలా అని గుంపుస్వామ్యానికి తల ఒగ్గితే రాజ్యాంగంలోని నిబంధనల విషయమేమిటి అన్న ప్రశ్న వస్తుంది. ఇలాంటి సంక్లిష్ట సమస్య ఎదురవకూడదంటే ప్రభుత్వాలు మాత్రమే కాదు- వ్యవస్థలు కూడా ప్రజల్లో తమపై నమ్మకం పోకుండా వ్యవహరించాలి. మన దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారు. పాలక పక్షాల చేతిలో అవి కీలుబొమ్మలుగా మారిపోయాయి. తాజాగా న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ప్రజా ప్రతినిధులపై దాఖలయ్యే అవినీతి కేసులలో విచారణ ఏడాదిలోగా పూర్తి కావాలని సుప్రీంకోర్టు పలు సందర్భాలలో అభిప్రాయపడింది. మరి జరుగుతున్నదేమిటి? ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉన్నారు. అయినా దర్యాప్తు సంస్థల విచారణ పూర్తి కాలేదు.

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై కోర్టు విచారణలో జాప్యం జరుగుతున్న తీరు కేస్ స్టడీ అవుతుంది. జగన్ కేసులు విచారణకు రాకుండానే న్యాయమూర్తులు బదిలీ అవుతున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఏమీ చేయలేదా? వివిధ సందర్భాలలో ఎవరికి వారు తమ తప్పు లేదని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. పొలిటికల్ బాసుల కనుసన్నల్లో పని చేయడానికి వ్యవస్థలు అలవాటుపడ్డాయి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఇదే పరిస్థితి. ఇలా అయితే ప్రజల్లో తిరుగుబాటు రాదా? తమపై ప్రజల్లో నమ్మకం చచ్చిపోకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు స్థాయిలో అప్పుడప్పుడు ప్రజలకు ఉపశమనం లభించే విధంగా తీర్పులు వస్తున్నాయి కానీ నిందితులైన రాజకీయ నాయకులు మాత్రం అందలం ఎక్కుతూనే ఉన్నారు. బంగ్లాదేశ్ వంటి పరిణామాలు మన దేశంలో జరగకపోవచ్చునుగానీ, నిజాయితీపరులు, ప్రజాస్వామ్య ప్రియులు, కష్టపడి సంపాదించి పన్నులు కడుతున్న వారిలో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అది ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా పెల్లుబకవచ్చు.

4

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కారకుడైన కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి ఎందుకొచ్చింది? ఆయన కూడా తనను 'తెలంగాణ పిత'గా పిలిపించుకున్నారు. తొమ్మిదిన్నరేళ్లు తిరిగే సరికి అదే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను తిరస్కరించారు.

దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు నిజాయితీతో సక్రమంగా పని చేసినా చేయక పోయినా ఎన్నికల్లో ప్రజలు మాత్రం ఓటు అనే ఆయుధంతో నిరంకుశంగా వ్యవహరించే వారిని శిక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ ఔన్నత్యాన్ని కాపాడుకోవడమా? లేదా? అన్నది దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ తేల్చుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థ అయినా ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి. పాలకులకు కాదు. ఈ సూత్రాన్ని పాటిస్తే ప్రజల్లో అసహనానికి, అసంతృప్తికి తావుండదు.



కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, యూనివర్సిటీ ప్రతినిధులు, అధికారులు

తెలంగాణకు స్టాన్‌ఫర్డ్!

బయో డిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యం

లైఫ్ సైన్సెస్, స్కిల్ యూనివర్సిటీల్లో భాగస్వామ్యం

సీఎం రేవంత్‌కు లేఖ అందించిన యూనివర్సిటీ బృందం

గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సీఎం

సాంకేతిక సేవల విస్తృతి, ఏఐ సిటీ నిర్మాణం, స్కిల్ వర్సిటీ ఏర్పాటు తదితర ప్రాజెక్టుల్లో భాగస్వామ్యంపైన చర్చలు

హైదరాబాద్‌లో జొయిటిస్, మోనార్క్‌ట్రాక్టర్స్ విస్తరణ

అమెరికాలో సీఎంతో భేటీ అయిన కంపెనీల ప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వ విద్యాలయం సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో బయో డిజైన్ శాటిలైట్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి కనరబరుస్తూ అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ అందజేసింది. శనివారం స్టాన్‌ఫర్డ్ వర్సిటీని సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. బైర్స్ సెంటర్ ఫర్ బయో డిజైన్ విభాగంలోని

మిగతా 13వ పేజీలో...

మళ్లీ రేవంత్‌తో భేటీ!

తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లు విధ్వంసం జరిగిందని ఆవేదన

13

జల విద్యుత్ కేంద్రాలకు మరమ్మతులేవి?

అధికారుల నిర్లక్ష్యంతో నష్టం.. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

13

ఒడిశా, ఏపీ, తెలంగాణ..

అనుసంధానం

కొత్త లైన్ పూర్తయితే భద్రాచలం మీదుగా రైలు

ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌కు బాటలు

173 కిలోమీటర్లు.. అంచనా వ్యయం రూ.4,109 కోట్లు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి.. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

కొత్త రైల్వే ప్రాజెక్టుతో తెలుగు రాష్ట్రాలకు ఎంతో మేలు

విశాఖ జోన్‌పై ఏపీ సీఎంతో చర్చిస్తున్నాం: అశ్వినీ వైష్ణవ్





న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన మల్కన్‌గిరి-పాండురంగాపురం రైల్వే లైన్‌తో ఒడిశా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అనుసంధానం కానున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. భద్రాచలం మీదుగా రైళ్లు నడవడమే కాకుండా, ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొత్తం 173.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రైల్వే లైన్‌కు రూ.4,109 కోట్ల మేర ఖర్చయ్యే అవకాశం ఉందని వివరించారు. భద్రాచలం మీదుగా రైల్వే లైన్ కలను ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెబుతున్నట్లు శనివారం ఓ ప్రకటనలో

మిగతా 12వ పేజీలో...

కేటీఆర్‌ను జైలుకు పంపకపోతే

యుద్ధమే

12

ఆయన అరాచకాలెన్నో.. నన్ను, రేవంత్‌నూ వేధించారు

సీఎంపై నమ్మకం, గౌరవముంది.. కేటీఆర్‌ను లోపలేస్తారు

ఆ నమ్మకం పోతే రాష్ట్రంలో రాజకీయ యుద్ధం తప్పదు: బండి

హిండెన్‌బర్గ్ మరో బాంబ్





అదానీ విదేశీ కంపెనీల్లో సెబీ చీఫ్‌కు వాటాలు

బెర్ముడా, మారిషస్‌లలో రహస్య పెట్టుబడులు

ఇందుకు అదానీ సోదరుడు వినోద్ సాయం

పెట్టుబడుల తర్వాతే సెబీలో మాధవి చేరిక

ఏడాదిన్నర కిందట అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్.. తాజాగా మరో బాంబు పేల్చింది. ఈసారి నేరుగా సెబీ చీఫ్ మాధవి పురి బచ్‌పైనే ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలను కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన బెర్ముడా, మారిషస్ ఫండ్లలో మాధవి, ఆమె భర్త ధవల్ బచ్‌కు రహస్య వాటాలు ఉన్నాయని పేర్కొంది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఇండియా ఇన్ఫోలైన్ ద్వారా 2015 జూన్ 5న సింగపూర్‌లో ఈ ఖాతా తెరిచారని తెలిపింది. ఈ మేరకు శనివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన బ్లాగ్‌లో ఆరోపించింది. ఓ ప్రజా వేగు అందించిన పత్రాల ఆధారంగా ఈ ఆరోపణలు చేసింది. మాధవి దంపతులు 2015లో అదానీ విదేశీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టగా.. ఆ తర్వాత అంటే 2017లో మాధవి బచ్ సెబీలో శాశ్వత డైరెక్టర్ పదవి చేపట్టారు. అనంతరం 2022 మార్చిలో సెబీ చీఫ్‌గా నియమితులయ్యారు. అదానీ గ్రూప్ అక్రమ నిధుల మళ్లింపు వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సెబీ ఇప్పటికే సుప్రీం కోర్టుకు తెలిపిన విషయం తెలిసిందే. దాంతో, సెబీ చీఫ్‌పైనే హిండెన్‌బర్గ్ ఆరోపణలు ఎక్కుపెట్టింది. ఈ వ్యవహారంపై మరోసారి రాజకీయంగా రగడ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

9

ఆ మందులతో కాలం చెల్లినట్లే!

రోగుల ప్రాణాలతో వైద్య శాఖ చెలగాటం

గడువు ముగిసిన ఔషధాలపై నిర్లక్ష్యం

సకాలంలో వాటిని వెనక్కి పంపని వైనం

ఎక్స్‌పైరీ మందులతో రూ.390 కోట్ల నష్టం

తాజాగా నిర్మల్ జిల్లాల్లో కాలం చెల్లిన సెలైన్‌ను రోగికి ఇచ్చిన ఆస్పత్రి సిబ్బంది!

13



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గడువు ముగిసిన మందుల వాడకంపై

కలెక్టర్ సీరియస్

ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రి ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్సుపై సస్పెన్షన్ వేటు

13



సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీలో ఉత్తమ్, పొంగులేటి, దామోదర

వచ్చే ఏడాది నుంచి రేషన్ సన్నబియ్యం

చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ

కుటుంబ వివరాలతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు

కొత్త రేషన్ కార్డులపై ప్రజాభిప్రాయ సేకరణ

గ్రామాల్లో రూ.లక్షన్నర, పట్టణాల్లో 2 లక్షల ఆదాయ పరిమితి

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నుంచి చౌక ధర దుకాణాల ద్వారా సన్నం బియ్యం పంపిణీ చేయాలని.. కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీ విధి విధానాలపై నియమించిన మంత్రివర్గ

మిగతా 13వ పేజీలో...

బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ రాజీనామా

» షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర


జస్టిస్ ఒబైదుల్ హసన్

ఢాకా/వాషింగ్టన్, ఆగస్టు 10: బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, 65 ఏళ్ల జస్టిస్ ఒబైదుల్ హసన్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం సాయంత్రం దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్‌తో భేటీ అయిన ఆయన పలు అంశాలపై చర్చించిన తర్వాత తన రాజీనామా పత్రాన్ని ఆయనకు సమర్పించారు. ఆయన స్థానంలో బంగ్లా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా అప్పిలేట్ డివిజన్ న్యాయమూర్తి జస్టిస్ మొహమ్మద్ అష్ఫఖుల్ ఇస్లాం నియమితులయ్యారు. దీనికి ముందు శనివారం ఉదయం జస్టిస్ హసన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ విషయం తెలిసిన విద్యార్థులు.. ఈ భేటీకి తాత్కాలిక ప్రభుత్వ అనుమతి లేదని, న్యాయవ్యవస్థ కుట్ర చేస్తోందని భావించి.. ఆందోళనకు పిలుపునిచ్చారు. జస్టిస్ హసన్ సహా ఇతర న్యాయమూర్తులు కేవలం గంట వ్యవధిలో రాజీనామా చేయాలని అల్టిమేటమ్ జారీ చేయడంతోపాటు విద్యార్థి సంఘాల నాయకులు అనూహ్యంగా ఆందోళనకు దిగారు. క్షణాల వ్యవధిలో వందలాదిగా పోగైన విద్యార్థులు సుప్రీంకోర్టును చుట్టుముట్టి హసన్ రాజీనామా చేసి వెళ్లిపోవాలని నినాదాలతో హోరెత్తించారు. దీంతో జస్టిస్ హసన్ తన సమావేశాన్ని వాయిదా వేశారు. అయినప్పటికీ విద్యార్థులు శాంతించకపోవడంతో రాజీనామాకు అంగీకరించారు. కాగా, గత ఏడాది ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ హసన్ షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర పడ్డారు. బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రవూఫ్ తలుక్దెర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ఈ పదవికి ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి రాజీనామాను అంగీకరించలేదని ఆర్థిక శాఖ సలహాదారు సలేహుద్దీన్ అహ్మద్ తెలిపారు. కాగా, బంగ్లా పోలీసు సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశంలో పరిస్థితి సర్దుమణిగే వరకు విధుల్లో చేరేది లేదని తేల్చి చెప్పాయి. మరోవైపు దేశవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయని హిందూ సంఘాలు ఆరోపించాయి. ఈ నెల 5 నుంచి ఇప్పటి వరకు 52 జిల్లాల్లో 205 దాడులు జరిగినట్టు తెలిపాయి. తమకు రక్షణ కల్పించాలని మైనారిటీలు కోరుతున్నట్టు సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ దాడులకు నిరసనగా వేలాది మంది బంగ్లాదేశ్ హిందువులు ఢాకాతో పాటు పలు నగరాల్లో భారీ ప్రదర్శనలు జరిపారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్ కల్పించాలని కోరారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అమెరికా జోక్యం చేసుకోవాలని భారతీయ అమెరికన్ చట్ట సభ సభ్యులు రాజా కృష్ణమూర్తి, శ్రీ తానేదార్‌లు విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌కు లేఖ రాశారు.

లోకం తీరు



50 గ్రాముల రాయికి రూ.850 కోట్ల ధర!

» బిహార్‌లో 'కాలిఫోర్నియం' రాయి స్వాధీనం

పట్నా, ఆగస్టు 10: రేడియోధార్మిక పదార్థమైన కాలిఫోర్నియం రాయిని స్మగ్లింగ్ చేస్తుండగా బిహార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 50గ్రాముల రాయి విలువ రూ.850 కోట్లు పలుకుతుందని అంచనా. గుజరాత్ నుంచి మోటారు సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు దీనిని తీసుకొస్తున్నారనే కచ్చితమైన సమాచారంతో గోపాల్‌గంజ్ జిల్లా పోలీసులు.. బల్త్‌హరి చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి నాలుగు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాలిఫోర్నియం ఒక్కో గ్రాము ధర రూ.17 కోట్లు పలుకుతుందని, ఇందుకు సంబంధించి వారి వద్ద ఉన్న టెస్ట్ రిపోర్టులను కూడా స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో ఉపయోగిస్తారు. మరోవైపు, రాజస్థాన్‌లోని అనూప్‌ఘర్ జిల్లాలో పాకిస్థాన్ సరిహద్దు వద్ద హెరాయిన్ ప్యాకెట్‌ను మోసుకొని వస్తున్న డ్రోన్‌ను బీఎస్ఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

హిందూమహాసముద్రంలో 3 చైనా నిఘా నౌకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: చైనా మళ్లీ హిందూమహాసముద్ర ప్రాంతం(ఐఓఆర్)లోకి 3 నిఘా నౌకలను పంపింది. భవిష్యత్తులో చైనా జలాంతర్గాములు ఐఓఆర్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన కీలక సమాచారాన్ని ఈ నిఘా నౌకలు సేకరిస్తున్నట్టు తెలిసింది. జియాంగ్ యాంగ్ హాంగ్-03, ఝియాంగ్ షాన్ డా క్సూ యింగ్ వాంగ్-7 నౌకలు ఐఓఆర్‌లో కార్యకలాపాలను నిర్వహిస్తున్న దృశ్యాలను డామియన్ సిమోన్స్ అనే వ్యక్తి 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత నావికాదళం ఆ నౌకలపై ఓ కన్నేసి ఉంచింది. ఐఓఆర్‌లోని భారత తీర ప్రాంతంతోపాటు మాల్దీవులు, శ్రీలంక వంటి పొరుగుదేశాల ఈఈజడ్(ప్రత్యేక ఆర్థిక జోన్)లలోకి చైనా తరచుగా ఈ నిఘా నౌకలను పంపుతోంది.

ఢిల్లీలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాది అరెస్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ఐఎస్ఐఎస్ ఉగ్రవాది దేశ రాజధానిలో పట్టుబడటం కలకలం రేపింది. ఈ నెల 8న రాత్రి 11 గంటల సమయంలో ఢిల్లీలోని గంగాబక్ష్ మార్గ్ సమీపంలో సంచరిస్తున్న వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ అలీని ఢిల్లీ స్పెషల్ పోలీసులు అరెస్టు చేశారు. ఐఎస్ఐఎస్ పుణె మాడ్యూల్‌లో సభ్యుడైన ఢిల్లీలోని దర్యాగంజ్ ప్రాంతానికి చెందిన రిజ్వాన్ కొంతకాలంగా పరారీలో ఉన్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినందుకు గాను అతనిపై ఎన్ఐఏ రూ.3లక్షల రివార్డు ప్రకటించింది.

ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్, ఆగస్టు 10: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన భీకర కాల్పుల్లో ఇద్దరు భారత సైనికులు అమరులయ్యారు. మరో నలుగురు గాయపడ్డారు. విశ్వసనీయ సమాచారంతో శనివారం అనంత్‌నాగ్ జిల్లాలోని అహ్లాన్ గగర్‌మండు అడవుల్లో ఉగ్రవాదుల కోసం సైనికులు గాలింపు చర్యలు చేపట్టారు. అడవిలో నక్కిన ఉగ్రవాదులు సైనికులపై కాల్పులు జరపడంతో ఆరుగురు సైనికులతో పాటు మరో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు సైనికులు కన్నుమూసినట్లు అధికారులు తెలిపారు.

కమలా హారిస్ ఓ 'బిచ్'.. నోరుపారేసుకున్న ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 11: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తన ప్రత్యర్థి, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై నోరు పారేసుకుంటున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరింత దిగజారారు. ఒక ప్రైవేటు సమావేశంలో ఆమెను 'బిచ్' అని దూషించినట్టు 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. ఇప్పటికే బహిరంగ సభల్లో ఆమెను 'అసమర్థురాలు, తెలివితక్కువ మహిళ' అని తిట్టిన ట్రంప్.. తన నోటికి అదుపు లేదని నిరూపించుకున్నారు. ఎన్నికల రేసులో కమలా హారిస్ కంటే ట్రంప్ వెనుకబడుతున్నారన్న వార్తలతో ఆయన దుర్భాషలాడడం పెరిగిపోయింది. ఇంతకుముందు పలువురు మహిళలను కూడా నీచులు, మూర్ఖులు అని ట్రంప్ దూషించారు. వారిలో రాజకీయ ప్రత్యర్థులు, కఠిన ప్రశ్నలు అడిగిన మహిళా జర్నలిస్టులు ఉన్నారు.



అంతరిక్షంలో చైనా వ్యర్థాలు

» లాంగ్ మార్చ్ 6ఏ రాకెట్ నుంచి విడుదల

» భారీ మేఘంలా భూమి చుట్టూ తిరుగుతుండటంతో ఆందోళన

న్యూయార్క్, ఆగస్టు 10: చైనా రాకెట్ నుంచి వెలువడిన వ్యర్థాలు అంతరిక్షంలో భారీ మేఘంలా భూమిచుట్టూ తిరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. చైనా పంపిన లాంగ్ మార్చ్ 6ఏ రాకెట్ ఈనెల 6వ తేదీన 18 ఉపగ్రహాలను భూ దిగువ కక్ష(ఎల్ఈవో)లో సుమారు 800 కిలోమీటర్ల ఎత్తున ప్రవేశపెట్టింది. ఆ తర్వాత కొద్దిసేపటికే రాకెట్ పైభాగంలో పేలుడు సంభవించి వెలువడిన శిథిలాలు భారీ మేఘంలా భూమిచుట్టూ తిరుగుతున్నాయని అమెరికాకు చెందిన స్పేస్ కమాండ్(యూఎస్‌స్పేస్‌కాం) తెలిపింది. అందులో సుమారు 300 వరకు ట్రాకెబుల్(కనీసం 4 అంగుళాల వ్యాసం ఉన్నవి) శిథిలాలు ఉన్నట్టు ఆ సంస్థ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే, వాటి వల్ల తక్షణ ముప్పు ఏమీ లేదని తెలిపింది. అయితే, భవిష్యత్తులో పంపే అంతరిక్ష వాహక నౌకలకు ఈ శిథిలాలతో ముప్పు ఉండొచ్చని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. సెకనుకు 7.5 కిలోమీటర్లు, గంటకు 27 వేల కిలోమీటర్ల వేగంతో కదిలే అంతరిక్షవాహక నౌకలకు ఈ శిథిలాలు తగిలితే ఆందోళనకర పరిస్థితి తలెత్తుతుందని వివరించింది.

గాజాపై మరో భీకర దాడి!

పాఠశాలలోని శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ క్షిపణులు!.. దాదాపు వందమంది మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

» అది బడి కాదు.. హమాస్ కమాండ్ సెంటర్: ఇజ్రాయెల్


శరణార్థి శిబిరంపై దాడిలో చనిపోయినవారి మృతదేహాలు, పాఠశాలలో భీతావహ దృశ్యాలను చూసి భయంతో ఏడుస్తున్న ఓ చిన్నారి

గాజా, ఆగస్టు 10: మరో యుద్ధం అంచున ఉన్న పశ్చిమాసియాలో మరో భీకర దాడి..! సెంట్రల్ గాజాలోని తబీన్ పాఠశాలపై శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ వరుసగా మూడు క్షిపణులను ప్రయోగించింది. హమాస్‌పై పది నెలలుగా టెల్ అవీవ్ సాగిస్తున్న యుద్ధంలో ఇదొక అతి పెద్ద ఘటనగా అభివర్ణిస్తున్నారు. ఇందులో వందమంది వరకు మృతిచెందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హెజ్బొల్లా, ఇరాన్ నుంచి తీవ్రస్థాయి హెచ్చరికలు ఎదుర్కొంటున్న సమయంలో ఇజ్రాయెల్ భారీ దాడికి పాల్పడడం ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా భావిస్తున్నారు. తబీన్ పాఠశాల 6 వేలమంది తలదాచుకుంటున్న శరణార్థి శిబిరమని హమాస్ పేర్కొంటుండగా, అది సీనియర్ కమాండర్లు సహా 20 మంది ఉగ్రవాదులు నక్కిన హమాస్ కమాండ్ సెంటర్ అని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ పాఠశాల మసీదు పక్కనే ఉందని తెలిపింది. మసీదు, తరగతి గదులు ఒకే భవనంలో ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ కెమెరామెన్ వెల్లడించారు. ఇజ్రాయెల్ క్షిపణి తరగతి గదుల మీదుగా మసీదులోకి చొచ్చుకెళ్లి పేలిపోయిందని పేర్కొన్నారు. కాగా, దాడి జరిగిన ప్రాంతమంతా రక్తసిక్తమై పరిస్థితి భీతావహంగా ఉంది. భారీ భవనం గోడలు నేలమట్టమై శరీరాలు ఛిద్రమయ్యాయి. వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. తమ వద్దకు 70 మృతదేహాలు, మరో పదిమంది శరీర భాగాలు వచ్చాయని అల్ అహిల్ ఆస్పత్రి డైరెక్టర్ ఫదెల్ నయీం తెలిపారు. 47 మందికి తీవ్రగాయాలైనట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. కాగా, తెల్లవారక ముందే.. స్కూల్‌లోని మసీదులో ప్రార్థనలు చేస్తుండగా ఎలాంటి హెచ్చరికలు లేకుండానే ఇజ్రాయెల్ దాడికి దిగిందని అబు అనాస్ అనే స్థానికుడు తెలిపాడు. కొందరు నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారని వాపోయాడు. మృతుల్లో అధికులు మహిళలు, పిల్లలు ఉన్నారని కథనాలు వస్తున్నాయి. సోమవారం ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. నెల రోజుల్లో 17 పాఠశాలలపైన ఇజ్రాయెల్ దాడులు చేసింది. గత 15 రోజుల్లోనే ఏడు దాడులకు పాల్పడింది. వీటిలో అధిక శాతం శరణార్థి శిబిరాలేనని.. మొత్తం 163 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ఇది ఏమాత్రం సమర్థనీయం కాదని ఈయూ విదేశీ వ్యవహారాల అధిపతి జోసెప్ బొరెల్ ఖండించారు.

డ్రోన్ దాడిలో 200 మందికి పైగా రోహింగ్యాల మృతి

మయన్మార్ నుంచి పారిపోతుండగా ఘటన

బ్యాంకాక్, ఆగస్టు 10 : మయన్మార్‌ను వీడి పారిపోతున్న రోహింగ్యాలపై జరిగిన డ్రోన్ దాడిలో 200 మందికిపైగా మృతి చెందారు. మృతి చెందిన వారిలో పిల్లలతో సహా వెళుతోన్న కుటుంబాలు ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. మయన్మార్‌లోని రఖినే రాష్ట్రం నుంచి పక్కనున్న బంగ్లాదేశ్‌లోకి వెళ్లేందుకు వీరు సరిహద్దులో వేచివుండగా ఈ దాడి జరిగింది. చనిపోయినవారిలో ఒక నిండు గర్భిణి, ఆమె రెండేళ్ల కుమార్తె కూడా ఉన్నారు. ఆ మహిళ భర్త మాట్లాడుతూ... నది తీరంలో తామంతా నిలబడి ఉండగా డ్రోన్ల దాడి ప్రారంభమయ్యిందని చెప్పాడు. మయన్మార్ సైనిక జుంటాకు తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతోన్న పోరాటంలో ఇటీవల సాధారణ పౌరులపై జరిగిన అతి పెద్ద దాడి ఇది. అయితే దాడికి మీరు కారణమంటే... మీరే కారణమని సైన్యం, తిరుగుబాటుదారులు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

ఏప్రిల్ నుంచి భారతీయులను మిలటరీలో చేర్చుకోవట్లేదు

» ఇప్పటికే చేర్చుకున్నవారిని త్వరలోనే విడుదల చేస్తాం: రష్యా ఎంబసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ఉక్రెయిన్‌తో యుద్ధం కోసం రష్యా తన సైన్యంలో భారతీయులను నియమించుకోవడాన్ని భారత ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీలోని రష్యా ఎంబసీ స్పందించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి భారతీయులను అలాగే ఇతర దేశాలకు చెందిన వ్యక్తులను తమ మిలటరీలో నియమించుకోవట్లేదని తెలిపింది. అలాగే ఇప్పటివరకు తమ మిలటరీశాఖల్లో స్వచ్ఛందంగా చేరిన ఇతర దేశస్థులను త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ప్రాణాలను కోల్పోయిన సైనికులకు ఒప్పందం ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లిస్తామని తెలిపింది. కాగా, రష్యా మొత్తం 91 మంది భారతీయులను తన సైన్యంలో నియమించుకుందని, వారిలో 8 మంది యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారని, 14 మందిని విడుదల చేసిందని, విడుదల కోసం ఇంకా 69 మంది ఎదురుచూస్తున్నారని జైశంకర్ చెప్పారు.

రష్యా సైనికులపైకి బ్యాడ్ రోబో డాగ్స్

కీవ్, ఆగస్టు 10: రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ పాశ్చాత్య దేశాల ఆయుధాలతో పోరాడుతూనే.. మరోవైపు ప్రాణనష్టం తగ్గించేందుకు 'బ్యాడ్ రోబో డాగ్స్'ను బరిలో దింపనుంది. ఉక్రెయిన్ త్వరలోనే తమ సైనికులకు ముందు వరసలో వీటిని మోహరించనుంది. రష్యా సైనికుల కదలికలను పసిగట్టడంతో పాటు మందుపాతరలను ఇవి గుర్తించనున్నట్టు కీవ్ వర్గాలు తెలిపాయి. ఉక్రెయిన్ ఇటీవల యుద్ధంలో 'బ్యాడ్ వన్' మోడల్ రోబో డాగ్‌ను బరిలో దించింది. ఇది విజయవంతం కావడంతో మరిన్ని రోబో డాగ్‌లను యుద్ధంలో మోహరించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది.

ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం?

» నోటీసు ఇచ్చే యోచనలో ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: రాజ్యసభ చైర్మన్‌గా జగదీప్ ధన్‌ఖడ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విపక్షాలు ఆయన్ను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తొలగించడం కోసం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు రాజ్యసభలో నోటీసు ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రాజ్యసభ పక్ష నేత జేపీ నడ్డాకు సమాచారం ఇచ్చినట్లు ఇండియా కూటమి ఎంపీ ఒకరు తెలిపారు. అయితే ఈ నోటీసును ఎప్పుడు సమర్పించాలనే దానిపై ఇంకా ఏకాభిప్రాయం రాలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా నోటీసు ఇచ్చే ప్రతిపాదనపై ఇప్పటికే 87 మంది ఎంపీలు సంతకాలు చేసినట్లు తెలిసింది.

కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా టీవీ సోమనాథన్ నియామకం



న్యూఢిల్లీ, ఆగస్టు 10: కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ శనివారం నియమితులయ్యారు. రాజీవ్ గౌబా స్థానంలో ఈయన నియామకం జరిగింది. సోమనాథన్ 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఈయన కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ నెల 30నుంచి రెండేళ్ల కాలానికి క్యాబినెట్ సెక్రటరీ పదవిలో టీవీ సోమనాథన్ కొనసాగనున్నారు. ఈమేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. సోమనాథన్ ఇంతకు ముందు పీఎం ఆఫీసులో అదనపు, జాయింట్ కార్యదర్శిగా పని చేశారు.

కేరళకు అండగా ఉంటాం

పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం.. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని హామీ

» విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

» పునరావాస ప్రణాళికపై సమీక్ష


వయనాడ్‌లో ఓ చిన్నారిని పరామర్శిస్తున్న మోదీ

వయనాడ్, ఆగస్టు 10: కొండచరియలు విరిగిపడి వరదలు పోటెత్తటంతో అతలాకుతలమైన కేరళకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తులో కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి అండగా ఉంటామన్నారు. కేరళలో ప్రధాని మోదీ శనివారం ఏరియల్ సర్వే జరిపారు. చూరల్‌మల, ముండక్కై, పంచరిమట్టం తదితర ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని వీక్షించారు. అనంతరం వయనాడ్‌లోని కాల్పెట్టాలో దిగి రోడ్డు మార్గంలో చూరల్‌మలకు వెళ్లారు. అక్కడ సహాయకచర్యల్లో భాగంగా ఆర్మీ నిర్మించిన 190 అడుగుల బెయిలీ బ్రిడ్జిపై నడిచి పరిసరాల్లో సంభవించిన నష్టాన్ని పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటైన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కోల్పోయిన కుటుంబ సభ్యులను, జరిగిన నష్టాన్ని తల్చుకొని కన్నీరుమున్నీరైన పలువురిని ప్రధాని మోదీ ఓదార్చారు. గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కూడా మోదీ పలకరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాధితులకు పునరావాసం కల్పించే ప్రణాళికపై మాట్లాడారు. కేరళలో విపత్తు సంభవించిన నాటి నుంచి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నానని, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ ఖాన్, సీఎం విజయన్, కేంద్రమంత్రి సురేష్‌గోపి తదితరులు ప్రధాని పర్యటనలో పాల్గొన్నారు.

మణిపూర్‌ను కూడా మోదీ సందర్శించాలి

ప్రధాని కేరళ పర్యటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'కేరళలో దారుణమైన విషాదం సంభవించింది. నాన్-బయలాజికల్ ప్రధాని వయనాడ్‌కు వెళ్లటం మంచిదే. దీని తర్వాత ఆయన యుద్ధాన్ని మరోసారి నిలిపివేయటానికి ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు. అయితే, గత 15 నెలలుగా తీవ్రమైన బాధ, దుఃఖంలో ఉన్న మణిపూర్ వెళ్లటానికి కూడా ఆయనకు సమయం దొరుకుతుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. జాతీయ విపత్తుగా ప్రకటించటానికి సంబంధించి ప్రత్యేకంగా ఎటువంటి నిబంధనలు లేవని పేర్కొన్నాయి. ఈ మేరకు 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్రమంత్రి ఎం.రామచంద్రన్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానాన్ని గుర్తు చేశాయి. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయ పునరావాసాల బాధ్యత ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంటుందని, అవసరాల మేరకు కేంద్రం సాయమందిస్తుందని నాడు మంత్రి చెప్పారు.

పశ్చిమబెంగాల్‌లో

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం

ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కాలేజీలో ఘటన

» అనుమానితుడి అరెస్టు

» ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరపాలని సీఎం మమత ఆదేశం


ఆర్‌జీ కర్ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్ల ఆందోళన

కోల్‌కతా, ఆగస్టు 10: కోల్‌కతాలో దారుణం చోటుచేసుకుంది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో పని చేసే ఓ పీజీటీ(పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ) వైద్యురాలిపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. పీజీ సెకండియర్ చదువుతున్న ఆమె.. గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రిలోని మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు ప్రాథమిక శవపరీక్షలో నిర్ధారణ అయింది. మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు తేలింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య ఆమె హత్యకు గురై ఉండొచ్చని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసుకు సంబంధం ఉందన్న అనుమానంతో ఇప్పటికే ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అతను బయటి వ్యక్తి అని, ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో స్వేచ్ఛగా తిరిగినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజీ, విరిగిపోయిన బ్లూటూత్ పరికరం(ఇయర్‌బడ్) ఆధారంగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో వాస్తవాలను దాచిపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మృతురాలి తండ్రి ఆరోపించారు. పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తిని శనివారం కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి 14 రోజుల పోలీస్ రిమాండ్‌కు అనుమతి ఇచ్చారు. ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశామని కోల్‌కతా పోలీస్ కమిషనర్ విన్సెంట్ చెప్పారు.

అవసరమైతే ఉరి శిక్ష వేయిస్తాం: మమత

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. అవసరమైతే హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి కూడా తమ ప్రభుత్వం వెనకాడదన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చిన ఆమె, తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఈ కేసు విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే, వైద్యురాలి హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది.

దేశంలో మొట్టమొదటి

రైస్ ఏటీఎం

» ప్రారంభించిన ఒడిసా ప్రభుత్వం

» ఒక్కసారి 25 కిలోల బియ్యం వచ్చేలా రూపకల్పన



భువనేశ్వర్, ఆగస్టు 10: దేశంలోనే మొట్టమొదటి రైస్ ఏటీఎం'ను ఒడిసా ప్రభుత్వం ప్రారంభించింది. భువనేశ్వర్‌లోని మంచేశ్వర్‌లో ఓ గోదాములో ఏర్పాటు చేసిన ఈ ఏటీఎంను ఆ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కృష్ణాచంద్ర పాత్ర ప్రారంభించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలోకి ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందుకే ఈ మెషిన్‌ను రూపొందించారు. రేషన్‌కార్డు ఉన్న వ్యక్తులు ఈ ఏటీఎం ద్వారా బియ్యాన్ని పొందవచ్చు. మెషిన్ టచ్ స్క్రీన్ డిస్‌ప్లేపై కార్డు నెంబర్‌ను ఎంటర్ చేసి, వినియోగదారుడి వేలిముద్రను వేయాలి. అనంతరం మెషిన్‌లోంచి బియ్యం విత్‌డ్రా అవుతాయి. ఒక్కసారి 25 కిలోల బియ్యం వచ్చేలా రూపకల్పన చేశారు. ఈ విధానం ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతానికి భువనేశ్వర్‌లో ప్రారంభించిన ఈతరహా ఏటీఎంలను తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాలకు విస్తరించనున్నారు. అనంతరం 'ఒకే దేశం- ఒకే రేషన్ కార్డు' కింద వివిధ రాష్ట్రాల్లో అమలు చేయనున్నారు.

సమాజంలో పత్రికలదే విశ్వసనీయత

» కొవిడ్ అనంతరం మీడియాలో సంక్లిష్ట పరిస్థితి

» బుక్‌బ్రహ్మ చర్చాగోష్టిలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్



బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో పత్రికలదే విశ్వసనీయత అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో భాగంగా రెండోరోజు శనివారం ఐదు వేదికల ద్వారా బెంగళూరు కోరమంగళలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియంలో సాహితీవేత్తలు, రచయితలు, భాషాభిమానులతో సందడి నెలకొంది. 'మీడియాలో సాహిత్య ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్టిని 'ది హిందూ' ఎడిటర్ భాగ్యశ్రీ సుబ్బణ్ణ పర్యవేక్షించారు. కె.శ్రీనివాస్, డెక్కన్ హెరాల్డ్ ఎడిటర్ రామకృష్ణ, ప్రిజమ్ బుక్స్ నుంచి సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మేగజైన్లు ఎక్కువ సాహిత్యంతోనే సాగేవని, కొవిడ్ తర్వాత అవి బాగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. పత్రికల్లోనూ 50 శాతం స్థలాభావం ఏర్పడిందన్నారు. తెలుగులో 19వ శతాబ్దంలోనే మ్యాగజైన్ల ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆధ్యాత్మికం, సామాజిక అంశాలపై కథనాలు ఉండేవని తెలిపారు. 'ఆంధ్రపత్రిక' సాహిత్యంతోనే సుదీర్ఘకాలం కొనసాగిందని పేర్కొన్నారు. 1920లో భారతి, గోల్కొండ లాంటి మేగజైన్లు ప్రాచుర్యంలో ఉండేవని గుర్తుచేశారు. 1960లో ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలో 'ఆంధ్రజ్యోతి' ప్రారంభమైందని, ఆయన సాహిత్యానికి నిరంతరం ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం 'వివిధ' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో సాహిత్యానికి ప్రాధాన్యం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. అన్ని తెలుగు పత్రికలు సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని వెల్లడించారు. కొవిడ్ తర్వాత మీడియా సంక్లిష్ట పరిస్థితికి వచ్చిందన్న శ్రీనివాస్.. మేగజైన్లలో మంచి కథనాలు వచ్చేవని తెలిపారు. సంక్షిప్త కథనాలతో డిజిటల్ రూపంలో ప్రాచుర్యంలోకి వచ్చినా అవి పబ్లిష్ కావన్నారు. దినపత్రికలకు విశ్వసనీయత ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా లేదా డిజిటల్ మీడియాలో అప్పటికప్పుడు సమాచారం చేరినా పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు ఎడిటింగ్ ఉంటుందని, తద్వారా ప్రామాణికత, విశ్వసనీయత సాధ్యమవుతాయని వివరించారు. అందుకే ప్రజలు పత్రికలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మాతృభాషలో ఎప్పటికీ మార్పు ఉండదని, మరో 20-30 ఏళ్లపాటు పత్రికలకు ప్రాధాన్యం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో దళిత కిచెన్ వంటి అంశంపై కథనాలు పబ్లిష్ చేసే విషయమై పరిశీలిస్తామన్నారు. సుధీర్ మాట్లాడుతూ కేరళలో ఏటా 700-800 పుస్తకాలు ఇప్పటికీ పబ్లిష్ అవుతున్నాయన్నారు. సాహిత్య పర్యవేక్షణలో నాణ్యత ముఖ్యమని అన్నారు. ఏఐ టెక్నాలజీ సాహిత్యంలోనూ ప్రవేశిస్తోందని తెలిపారు.



దీక్షలో మాట్లాడుతున్న బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కేటాయించాలి

» సత్యాగ్రహ దీక్షలో బీసీ సంఘాల నేతల డిమాండ్

కవాడిగూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేసేలా బీసీలంతా ఐక్య పోరాటాలు చేయాలని పలు పార్టీల నేతలు, సంస్థల నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా చౌక్ దగ్గర బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీల సత్యాగ్రహ దీక్ష జరిగింది. దీక్షలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ల సాధన కోసం అవసరమైతే తన ఎమ్మెల్సీ పదవిని వదులుకుంటానని చెప్పారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

డార్క్ వెబ్‌లో డ్రగ్స్ దందా!

» స్పీడ్ పోస్ట్‌లో డెలివరీ.. క్రిప్టోలో చెల్లింపులు
» అసోం నుంచి ఖమ్మం వచ్చిన డ్రగ్స్ పార్సిల్
» టీజీ న్యాబ్ సాంకేతిక బృందం నిరంతర నిఘాతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
» హైదరాబాద్ నుంచి న్యూజిలాండ్‌కు డ్రగ్స్
» 60 లక్షల సరుకు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

హైదరాబాద్/ఖమ్మం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు నిఘా పెరగడం వల్ల బహిరంగ మార్కెట్‌లో మత్తుపదార్థాలు చేతులు మారే పరిస్థితి లేకపోవడంతో ముఠాలు డార్క్‌వెబ్‌ను అడ్డాగా మార్చుకుంటున్నాయి. కొరియర్, స్పీడ్ పోస్ట్‌లో సరుకును నేరుగా కావాల్సిన చోటుకు డెలివరీ చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీ రూపంలో చెల్లింపులు జరిగిపోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గంలో జరుగుతున్న ఈ దందాపైనా టీజీ న్యాబ్ దృష్టి సారించింది. ప్రత్యేకంగా టెక్నికల్ వింగ్‌ను రంగంలోకి దింపింది. డార్క్‌వెబ్, ఇతర సామాజిక మాధ్యమాలపై నిరంతర ట్రాకింగ్‌తో డ్రగ్స్ దందా బయటపడింది.



ఇంటి ముందు మాటువేసి...

ఖమ్మం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మత్తుకు బానిసయ్యాడు. డార్క్‌వెబ్‌లో డ్రగ్స్ ఆర్డర్ చేసి క్రిప్టో కరెన్సీ రూపంలో నగదు చెల్లించాడు. విక్రేత అసోంలోని సిల్చుఖరి నుంచి డ్రగ్స్‌ను ఖమ్మంకు స్పీడ్ పోస్ట్ చేశాడు. డార్క్‌వెబ్‌పై నిఘా కొనసాగిస్తున్న ట్యీబ్ సాంకేతిక బృందం ఈ విషయం గుర్తించింది. హైదరాబాద్ నుంచి ఖమ్మం పోలీసులకు సమాచారం అందించి స్పీడ్ పోస్ట్ పార్సిల్‌ను నిరంతరం ట్రాక్ చేశారు. గత నెల 31న ఆర్డర్ చేయగా.. సరుకు గత గురువారం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంటికి డెలివరీ అయింది. అప్పటికే ఇంటి ముందు మాటువేసిన పోలీసులు డ్రగ్స్‌తో వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిల్ తీసుకుంటుండగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డ్రగ్స్‌కు బానిసైన ఆ టెకీకి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోవైపు డార్క్‌వెబ్‌లో డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన ముఠా లింక్‌ను గుర్తించే పనిలో ఉన్నట్లు టీజీ న్యాబ్ అధికారులు తెలిపారు.

సమాచారమివ్వండి: టీజీ న్యాబ్ డైరెక్టర్

గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే టీజీ న్యాబ్ టోల్ ఫ్రీ నెంబరు 1908కు లేదా 87126 71111 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. tsnabhohyd@tspolice.gov.in ఈ-మెయిల్ లోనూ సమాచారం పంపవచ్చన్నారు.

హైదరాబాద్ టూ న్యూజిలాండ్..

ఇప్పటివరకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా జరుగుతుండగా తాజాగా హైదరాబాద్ నుంచి ఇతర దేశాలకు డ్రగ్స్ ఎగుమతి అవుతున్న విషయం బయటపడింది. హైదరాబాద్ నుంచి న్యూజిలాండ్‌కు డ్రగ్స్ (ఎఫిడ్రిన్) కొరియర్ చేస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) జోనల్ యూనిట్ అధికారులకు పక్కా సమాచారం అందింది. డ్రగ్స్ కొరియర్ చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.60 లక్షల విలువైన పౌడి రూపంలో ఉన్న 3 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డీఆర్ఐ అధికారుల నుంచి అవసరమైన సమాచారం సేకరించే పనిలో న్యాబ్ అధికారులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ వద్దు

» దీనిపై పార్లమెంటులో చట్టం చేయండి
» కేంద్రానికి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : ఎస్సీ రిజర్వేషన్ అమలులో క్రీమీలేయర్‌ను పాటించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోవాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. క్రీమీలేయర్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను నిరాకరించే భావనను ఖండించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పులో క్రీమీలేయర్ ప్రస్తావన ఉన్న భాగాలను తొలగిస్తూ పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణను పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవచ్చునని ఈ నెల మొదట్లో సుప్రీంకోర్టులోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలోని ఆరుగురు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే. ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఈ ఆరుగురిలో ఒకరైన జస్టిస్ బీఆర్ గవాయ్ కోరారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ సూచనను ఖండిస్తున్నాయి. క్రీమీలేయర్‌ను అమలు చేయరాదని ఇప్పటికే కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే శనివారం స్పందించారు. "క్రీమీలేయర్ అమలు ద్వారా ఎవరు ప్రయోజనం పొందాలని అనుకుంటున్నారు? దీనివల్ల ఇటు అస్పృశ్యుల ప్రయోజనాలు దెబ్బతింటే, అటు వేలాది సంవత్సరాలుగా అన్ని హక్కులు, అధికారులు అనుభవించిన వారికి మేలు కలుగుతుంది. దీన్ని నేను ఖండిస్తున్నాను" అని ఖర్గే అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వల్ల కలిగే ఇబ్బంది గురించి న్యాయమూర్తులు దృష్టి పెట్టనట్టు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అస్పృశ్యత ఉన్నంతకాలం రిజర్వేషన్లు ఉంటాయి, ఉండాల్సిందేనని, కాంగ్రెస్ దానికోసం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్లను రద్దుచేయాలనే తలంపుతో బీజేపీ ఉన్నదని ఆయన ఆరోపించారు.

'శ్రీమంతుడు' నాగ్ అశ్విన్..

స్వగ్రామం ఐతోల్‌లో రూ.60 లక్షలతో పాఠశాలలో తరగతుల నిర్మాణం

» తల్లిదండ్రులతో ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖ దర్శకుడు
» భవిష్యత్‌లోనూ ఊరి అభివృద్ధికి అండగా ఉంటానని హామీ

తాడూరు, ఆగస్టు 10: కల్కి సినిమాతో దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్.. శ్రీమంతుడు సినిమా హీరో మహేష్‌బాబు తరహాలో స్వగ్రామం అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిధిలోని స్వగ్రామం ఐతోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.60 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించారు. శనివారం వాటి ప్రారంభోత్సవ సభకు నాగ్ అశ్విన్, ఆయన తల్లిదండ్రులు డాక్టర్ జయంతి, డాక్టర్ జయరాంరెడ్డిలతో పాటు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. తమ తల్లిదండ్రులు వైద్యులైనా.. తనను సినిమా పరిశ్రమ వైపు నడిపించినందుకుగాను నాగ్ అశ్విన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని తల్లిదండ్రులు తనకు నేర్పించారని, ప్రతి ఒక్కరూ దీనిని అవలంబిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. ఇప్పటికే ఐతోల్ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. మున్ముందు కూడా కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉంటానని ప్రకటించారు. ఎస్‌వీఎస్ ఆస్పత్రి వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, రాంరెడ్డి మాట్లాడుతూ ఐతోల్‌ను మండల కేంద్రంగా ప్రకటిస్తే కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన నాలుగు ఎకరాల భూమిని తమ రెండు కుటుంబాల నుంచి ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థుల కోరిక మేరకు ఐతోల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులు గడించిన నాగ్ అశ్విన్ స్వగ్రామం అభివృద్ధి పట్ల అంకితభావంతో ఉండటం అభినందనీయమని కొనియాడారు.


తరగతి గదులను ప్రారంభిస్తున్న నాగ్ అశ్విన్, చిత్రంలో ఎమ్మెల్యే కూచకుళ్ల, కలెక్టర్ సంతోష్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

న్యాయవ్యవస్థ.. అంతేనా?

'ఢిల్లీ మద్యం కేసులో విచారణ పూర్తి చేయకుండా నిందితులను ఇంకెంత కాలం జైలులో ఉంచుతారు?' ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిలు మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి. 'ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై దాఖలైన అవినీతి కేసుల విచారణలో ఇంత జాప్యం ఎందుకు? విచారణకు, డిశ్చార్జ్ పిటిషన్లకు సంబంధంలేదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చినా అదే సాకు చెప్పటం ఏమిటి?' తాజాగా సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అసహనం ఇది. ఈ రెండు సందర్భాలలోనూ దర్యాప్తు సంస్థలనే సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఢిల్లీ మద్యం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్నది దర్యాప్తు సంస్థల ఆరోపణ. జగన్‌రెడ్డి కేసులలో 35 వేల కోట్ల ప్రజాధనం లూటీ జరిగిందని ఇవే దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. మద్యం కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉండగా, 35 వేల కోట్ల రూపాయల అవినీతి కేసులో జగన్‌రెడ్డి 16 నెలలు మాత్రమే జైల్లో ఉండి బెయిల్ పొందారు. పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్న జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కూడా కొనసాగారు. మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంకా జైల్లోనే ఉన్నారు. ఈ వైరుధ్యాలకు కారణం ఎవరు? సిసోడియా, జగన్‌రెడ్డి కేసులలో సుప్రీంకోర్టుకు కనిపించిన అభ్యంతరం కింది కోర్టులకు ఎందుకు కనిపించలేదు? న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు ఈ దేశంలో ఎంత మంది వెళ్లగలరు? వెళ్లినా న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ఉంటుందా? అదీ లేదు. మన దేశంలో అన్ని వ్యవస్థలూ కుప్పకూలి పోయాయన్నది మెజారిటీ ప్రజల భావన. ఇతర వ్యవస్థల్లో న్యాయం దక్కనప్పుడు ఎవరైనా న్యాయ వ్యవస్థ తలుపు తడతారు. అక్కడ కూడా వెంటనే న్యాయం దక్కుతుందన్న భరోసాగానీ, అసలు న్యాయం లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేకుండా పోయింది. మిగతా వ్యవస్థలతో పోల్చితే న్యాయ వ్యవస్థ కొంచెం మెరుగ్గా ఉన్నప్పటికీ... ఆ వ్యవస్థపై కూడా ప్రజలకు నమ్మకం పోతోంది. వివిధ సందర్భాలలో సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్యలకూ, అది ఇచ్చే ఆదేశాలకూ పొంతన ఉండటం లేదు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టును తప్పుపట్టిన సుప్రీంకోర్టు... హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను మాత్రం రద్దు చేయలేదు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తే పాలక పక్షాలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఎన్నికల్లో గెలిచామని చెప్పి విర్రవీగుతూ ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటూ ఉండటం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. బంగ్లాదేశ్ పరిణామాలనే తీసుకుందాం. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా ఏడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి ఆమె తండ్రి ముజిబుర్ రెహమాన్ కారణం. బంగ్లా ప్రజలు ఆయనను జాతిపితగా గౌరవించి నెత్తిన పెట్టుకున్నారు. అదే ప్రజలు ఇప్పుడు ఆయన విగ్రహాలను పగలగొడుతున్నారు. ఆయన కూతురు హసీనా దేశం విడిచి పారిపోవలసి వచ్చింది. రిజర్వేషన్ల విషయంలో హసీనా నిర్ణయాన్ని పాక్షికంగా సమర్థించిన బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాస భవనంపై కూడా ప్రజలు దాడి చేశారు. పాలకులు మాత్రమే కాదు— న్యాయ వ్యవస్థ కూడా ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే తీర్పులు ఇవ్వాలని బంగ్లా పరిణామాలు చెబుతున్నాయా? అలా అని గుంపుస్వామ్యానికి తల ఒగ్గితే రాజ్యాంగంలోని నిబంధనల విషయమేమిటి అన్న ప్రశ్న వస్తుంది. ఇలాంటి సంక్లిష్ట సమస్య ఎదురవకూడదంటే ప్రభుత్వాలు మాత్రమే కాదు— వ్యవస్థలు కూడా ప్రజల్లో తమపై నమ్మకం పోకుండా వ్యవహరించాలి. లేనిపక్షంలో ఏదో ఒకరోజు ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుంది.

> జగన్‌రెడ్డికి హైదరాబాద్, బెంగళూరు, ఇడుపులపాయలో ప్యాలెస్‌లు ఉన్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్యాలెస్‌లకు వెళ్లినా వెళ్లకపోయినా భద్రత కల్పించేవారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఆయన తనకు అదే స్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నారు. చంద్రబాబుకు నక్సలైట్ల నుంచి ముప్పు ఉంది. జగన్‌రెడ్డికి ఆ ముప్పు లేదే! అయినా వెయ్యి మందితో భద్రత కావాలని ఆయన ఎందుకు కోరుతున్నారు? ఆయనకు అంత మంది శత్రువులు ఉన్నారా? ఉంటేగింటే ఎందుకున్నారు? ఐదేళ్ల పాటు ప్రజారంజక పాలన అందించానని చెప్పుకొంటున్న ఆయనకు శత్రువులు ఉండకూడదు కదా? ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత ఉండిందో అంత భద్రత కావాలని కోరుతున్నారంటే ఆయన ప్రజారంజక పాలన కాకుండా ప్రజాకంటక పాలన అందించారని భావించడం తప్పు కాదనుకుంటా!

దారి తప్పిన దర్యాప్తులు...

మన దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారు. పాలక పక్షాల చేతిలో అవి కీలుబొమ్మలుగా మారిపోయాయి. తాజాగా న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ప్రజా ప్రతినిధులపై దాఖలయ్యే అవినీతి కేసులలో విచారణ ఏడాదిలోగా పూర్తి కావాలని సుప్రీంకోర్టు పలు సందర్భాలలో అభిప్రాయపడింది. మరి జరుగుతున్నదేమిటి? ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉన్నారు. అయినా దర్యాప్తు సంస్థల విచారణ పూర్తి కాలేదు. దర్యాప్తు పూర్తయిన తర్వాత కోర్టు విచారణలో సిసోడియా నిర్దోషి అని తేలితే ఆయన 17 నెలల పాటు జైల్లో ఉన్నందుకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎప్పుడు బయటకు వస్తారో తెలియదు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై కోర్టు విచారణలో జాప్యం జరుగుతున్న తీరు కేస్ స్టడీ అవుతుంది. ఈ కేసులలో నిందితులందరూ హైకోర్టులో డిశ్చార్జి పిటిషన్లు వేస్తున్నందువల్ల కోర్టు ట్రయల్‌లో జాప్యం జరుగుతోందని సీబీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వాదనను తోసిపుచ్చింది. డిశ్చార్జి పిటిషన్‌కు, కోర్టు ట్రయల్‌కు సంబంధం లేదని గతంలోనే తీర్పు ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. సీబీఐ వంటి సంస్థల తరఫున సుప్రీంకోర్టులో వాదించే సొలిసిటర్ జనరల్ లేదా ఆ సంస్థ న్యాయవాదులకు ఈ విషయం తెలియదా? అయినా జాప్యం జరుగుతూనే ఉంది. అవరోధాలు తొలగి విచారణ ప్రారంభం అవుతుందని అనుకుంటున్న సందర్భాలలో సంబంధిత న్యాయమూర్తి బదిలీ అవుతున్నారని కూడా సీబీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. నిజమే, జగన్ కేసులు విచారణకు రాకుండానే న్యాయమూర్తులు బదిలీ అవుతున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఏమీ చేయలేదా? వివిధ సందర్భాలలో ఎవరికి వారు తమ తప్పు లేదని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. ఈ కారణంగానే వ్యవస్థలపై ప్రజల్లో అపనమ్మకం ప్రబలుతోంది. పొలిటికల్ బాసుల కనుసన్నల్లో పనిచేయడానికి వ్యవస్థలు అలవాటుపడ్డాయి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఇదే పరిస్థితి. ఇలా అయితే ప్రజల్లో తిరుగుబాటు రాదా? పాలకులుగా అవతరించే ప్రజా ప్రతినిధుల విషయంలో అయినా తప్పు చేశారా? లేదా? అన్నది వెనువెంటనే తేల్చకపోతే జరిగే అనర్థాలకు బాధ్యులు ఎవరు? జగన్‌రెడ్డి వ్యవహారాన్నే తీసుకుందాం! ఆయన పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్నారు. భవిష్యత్తులో న్యాయస్థానం ఆయనను దోషిగా ప్రకటిస్తే... అతను ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఒక రాష్ట్రాన్ని పాలించే అవకాశం కల్పించిన పాపం ఎవరిది అవుతుంది? గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో చెడినందునే జగన్‌పై కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్నవారితో సత్సంబంధాలు ఉన్నందునే తనపై దాఖలైన కేసులలో విచారణ కూడా జరగకుండా జగన్ తప్పించుకోగలుగుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిన మాట నిజం కాదా? మధ్యలో దర్యాప్తు సంస్థలకు, న్యాయస్థానాలకు పాత్ర లేదా? ఈ రెండు వ్యవస్థల ప్రత్యక్ష, పరోక్ష సహకారం లేని పక్షంలో ఇది సాధ్యమా? డిశ్చార్జి పిటిషన్లను సాకుగా చూపడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఆ విషయం కింది కోర్టులకు తెలియదా? సుప్రీంకోర్టు మాదిరిగా కింది కోర్టులు కూడా ఆలోచించి ఉంటే జగన్ కేసులలో ఈ పాటికి విచారణ కూడా పూర్తయ్యేది కదా? ఈ చిక్కు ముడులు ఎవరు విప్పాలి? తమపై ప్రజల్లో నమ్మకం చచ్చిపోకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు స్థాయిలో అప్పుడప్పుడు ప్రజలకు ఉపశమనం లభించే విధంగా తీర్పులు వస్తున్నాయి కానీ నిందితులైన రాజకీయ నాయకులు మాత్రం అందలం ఎక్కుతూనే ఉన్నారు. దర్యాప్తు సంస్థలపై కనీస నమ్మకం లేనందున కేసులు ఉన్న వారికి కూడా ప్రజలు అధికారం కట్టబెడుతున్నారు. చివరకు, ఎవరు మాత్రం అవినీతిపరులు కాదు— అని సరిపెట్టుకొనే పరిస్థితులు ఈ దేశంలో నెలకొన్నాయి.


భారత్‌లోనూ జరుగుతుందా?

బంగ్లాదేశ్ వంటి పరిణామాలు మన దేశంలో జరగకపోవచ్చును గానీ, నిజాయితీపరులు, ప్రజాస్వామ్య ప్రియులు, కష్టపడి సంపాదించి పన్నులు కడుతున్న వారిలో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అది ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా పెల్లుబకవచ్చు. అంతులేని ప్రజాభిమానంతో అధికారంలోకి వచ్చిన నాయకులపై కూడా అనతి కాలంలోనే ప్రజాగ్రహం పెల్లుబకడాన్ని చూస్తున్నాం. 2019 ఎన్నికల్లో 51 శాతం ఓట్లతో 151 సీట్లు గెలుచుకున్న జగన్మోహన్‌రెడ్డికి తాజా ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కారకుడైన కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి ఎందుకొచ్చింది? ఆయన కూడా తనను 'తెలంగాణ పిత'గా పిలిపించుకున్నారు. తొమ్మిదిన్నరేళ్లు తిరిగే సరికి అదే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను తిరస్కరించారు. దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు నిజాయితీతో సక్రమంగా పని చేసినా చేయకపోయినా ఎన్నికల్లో ప్రజలు మాత్రం ఓటు అనే ఆయుధంతో నిరంకుశంగా వ్యవహరించే వారిని శిక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ ఔన్నత్యాన్ని కాపాడుకోవడమా? లేదా? అన్నది దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ తేల్చుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థ అయినా ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి. పాలకులకు కాదు. ఈ సూత్రాన్ని పాటిస్తే ప్రజల్లో అసహనానికి, అసంతృప్తికి తావుండదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేసులలో ఇప్పటికైనా విచారణ ప్రారంభమవుతుందని ఆశిద్దాం! డజనుకు పైగా అవినీతి కేసుల భారాన్ని మోస్తూ అతను నీతీ నిజాయితీల గురించి మాట్లాడుతుంటే వినడానికి ఎబ్బెట్టుగా ఉంటోంది. విచారణకు సహకరించి నిర్దోషిగా రుజువు చేసుకుంటే ఆయనకే మంచిది కదా! ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించి కేంద్ర ప్రభుత్వం కూడా తగు విధంగా వ్యవహరించడం మంచిది. మూడో పర్యాయం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ తమకు ఈసారి సొంతంగా మెజారిటీ ఎందుకు లభించలేదో ఆత్మపరిశీలన చేసుకోవాలి. దేశంలోని అన్ని వ్యవస్థలూ లొంగిపోయినప్పటికీ ప్రజలు మాత్రం లొంగిపోలేదు. అందుకే ఆ పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. ప్రజలు ఎప్పుడూ అలసిపోరు.

> డజనుకు పైగా అవినీతి కేసుల భారాన్ని మోస్తూ నీతీ నిజాయితీల గురించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతుంటే వినడానికి ఎబ్బెట్టుగా ఉంటోంది. విచారణకు సహకరించి నిర్దోషిగా రుజువు చేసుకుంటే ఆయనకే మంచిది కదా!

జగన్ (అ)భద్రత!

ఆ విషయం అలా ఉంచితే, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్పించిన భద్రతను కొనసాగించాలంటూ హైకోర్టును కోరడం వింతగా ఉంది. ఇంకా నయం, ముఖ్యమంత్రి హోదాను కూడా కొనసాగించాలని ఆయన కోర్టును కోరలేదు. ఇప్పటికే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏ రాజకీయ పార్టీని ఎక్కడ ఉంచాలో కోర్టులు కాదు— ప్రజలు నిర్ణయిస్తారు. తెలుగునాట ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉండేవి. ఇప్పుడు కారణాలు ఏవైనా ఆ పార్టీలు గత చరిత్రకు వర్తమానంలో ఆనవాళ్లుగా మిగిలాయి. తెలంగాణలో సీపీఐకి శాసనసభలో కనీసం ప్రాతినిధ్యం ఉంది. సీపీఎంకు ఉభయ రాష్ట్రాలలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. తమకు గత వైభవం కల్పించాలని ఆ పార్టీ న్యాయస్థానం గడప తొక్కడం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, ప్రతిపక్ష హోదా ఇప్పించాలని జగన్మోహన్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరడం కూడా అంతే హాస్యాస్పదంగా ఉంది. ఇది చాలదన్నట్టు ఆయన ఇప్పుడు దాదాపు వెయ్యి మందితో తనకు భద్రత కల్పించాలని కోర్టు మెట్లు ఎక్కారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంతమందితో భద్రత ఏర్పాటు చేసుకున్నారా? ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు కూడా అంత మంది భద్రతగా ఉన్నారా? ఉంటే మాత్రం అభ్యంతరకరమే! ఈ దేశంలో ఎన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇంత మందితో భద్రత ఏర్పాటు చేశారు? అంత అవసరం ఏమిటి? ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు చిన్న రాష్ట్రమే. పొరుగున ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఇంత భద్రత లేదే? వివాహాది శుభకార్యాలు, లేదా మరేదైనా ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లినా ఆయనకు ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్లు రక్షణగా ఉంటారు. స్టాలిన్ కూడా సాదాసీదాగా ఇతరులతో పాటు కలసి కూర్చుంటారు. తెలుగునాట ఈ ఆర్భాటం ఏమిటి? జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 980 మందితో రక్షణ కల్పించుకున్నారని తెలిసి పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు నాయకులకు హైదరాబాద్‌లో ఇళ్లూవాకిళ్లు ఉన్నాయి. ఈ కారణంగా హైదరాబాద్‌లో ఉన్న ఇళ్లలో కూడా ముఖ్యమంత్రులుగా ఉన్నవాళ్లు రక్షణ కల్పించుకుంటున్నారు. జగన్‌రెడ్డికి హైదరాబాద్, బెంగళూరు, ఇడుపులపాయలో ప్యాలెస్‌లు ఉన్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్యాలెస్‌లకు వెళ్లినా వెళ్లకపోయినా భద్రత కల్పించేవారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఆయన తనకు అదే స్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నారు. చంద్రబాబుకు నక్సలైట్ల నుంచి ముప్పు ఉంది. జగన్‌రెడ్డికి ఆ ముప్పు లేదే! అయినా వెయ్యి మందితో భద్రత కావాలని ఆయన ఎందుకు కోరుతున్నారు? ఆయనకు అంత మంది శత్రువులు ఉన్నారా? ఉంటేగింటే ఎందుకున్నారు? ఐదేళ్లపాటు ప్రజారంజక పాలన అందించానని చెప్పుకొంటున్న ఆయనకు శత్రువులు ఉండకూడదు కదా? ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత ఉండిందో అంత భద్రత కావాలని కోరుతున్నారంటే ఆయన ప్రజారంజక పాలన కాకుండా ప్రజాకంటక పాలన అందించారని భావించడం తప్పు కాదనుకుంటా! ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో కలిసిపోయిన జగన్... ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు దూరమయ్యారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అడుగు బయట పెడితే పరదాలు కట్టించుకున్నారు. పోలీసు రక్షణ వలయంలో బతికారు. చివరకు అధికారానికి దూరమయ్యారు. రక్షణ కోసం కాకుండా, కేవలం అధికార దర్పానికి చిహ్నంగా అప్పట్లో ఆయన అంత మందితో రక్షణ వలయం ఏర్పాటు చేసుకున్నట్టున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనల సందర్భంగా కూడా కనిపించనంత హడావిడి జగన్‌రెడ్డి పర్యటనల్లో కనిపించేది. తాడేపల్లి ప్యాలెస్‌లో ఏం జరుగుతుందో నరమానవులకు కనిపించనంత ఎత్తుల్లో కంచె ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రస్తుత ప్రజాభవన్ వద్ద ఇదే స్థాయిలో ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నారు. వివిధ దేశాలలో నియంతలుగా పేరొందినవారు మాత్రమే ఇలాంటి రక్షణ ఏర్పాట్లు చేసుకోవడం చూశాం. ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో ఒక చిన్న రాష్ట్రం. ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తికి వెయ్యి మందితో భద్రత కల్పించడం విడ్డూరమే. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కూడా కాదు. మాజీ ముఖ్యమంత్రి మాత్రమే. ఒక మాజీ ముఖ్యమంత్రికి నిబంధనల ప్రకారం ఎంత రక్షణ కల్పించాలో అంతే కల్పిస్తారు. అంతకు మించి కావాలనుకుంటే అందుకు అయ్యే ఖర్చును అతడే భరించడం న్యాయం. అయినా ఆయన ఇప్పటికే వందల మంది ప్రైవేట్ భద్రతా సిబ్బందిని నియమించుకున్నారు. తెలుగునాట భద్రత అన్నది ఒక హోదాగా మారింది. ఇతర రాష్ట్రాలలో శాసనసభ్యులు అందరికీ అంగరక్షకులు కూడా ఉండరు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అంతకు ముందు కూడా ముఖ్యమంత్రులుగా పని చేసిన వారికి ఒక పైలట్, ఒక ఎస్కార్ట్ కారు మాత్రమే ఉండేవి. డజన్ల కొద్దీ వాహనాలతో భారీ కాన్వాయ్ ఉండేది కాదు. ఏది ఏమైనా ఇప్పుడు జగన్ చేసిన విజ్ఞప్తి న్యాయస్థానం పరిశీలనలో ఉంది. కోర్టు ఏమి చెబుతుందో చూద్దాం!



akbar

అలా వదిలేస్తారా...?

కాగా, చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలే అయింది. ఇంతలోనే జగన్‌రెడ్డిలో అసహనం పెరిగిపోతోంది. తన పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలైందన్న విమర్శలు వచ్చినందున ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆయన విమర్శిస్తున్నారు. శాంతిభద్రతలు కుప్పకూలి పోయాయని గగ్గోలు పెడుతున్నారు. తనకు ఎదురైన అనుభవాలు ప్రత్యర్థులకు కూడా ఎదురవాలని ఆయన ఆశిస్తున్నారు. అవినీతి కేసులలో తాను పదహారు నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చినందున తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబు కూడా జైలుకు వెళ్లాలని జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోరుకున్నారు. అందుకే తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో చంద్రబాబును దాదాపు రెండు నెలల పాటు జైలుకు పంపించారు. ఆ బాటలోనే అప్పుడు రాజారెడ్డి రాజ్యాంగం అన్నారని ఇప్పుడు రెడ్ బుక్ రాజ్యాంగం అని అంటున్నారు. అంతేకాదు, రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయని, పెట్టుబడులకు భద్రత ఉండదని, తెలంగాణ వైపు చూడండని తన మద్దతుదారులతో సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా జగన్ అండ్ కో ప్రచారం చేయడం వింతగా ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని కోరే దాకా వెళ్లారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి చంద్రబాబు అధికారం చేపట్టినప్పటికీ మెతక వైఖరినే అవలంబిస్తున్నారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను వేధించిన వారిపై కనీసం చర్యలు తీసుకోవడం లేదని తెలుగు తమ్ముళ్లు ఆవేశంతో ఊగిపోతున్నారు. గడచిన కొద్ది రోజులుగా జగన్ రోత మీడియాలో వస్తున్న వార్తలను గతంలో ఇతర పత్రికలు ప్రచురించి ఉంటే కేసులు పెట్టి ఉండేవారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని ప్రచారం చేస్తున్న వారిపై కూడా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరును ఎవరో దుండగులు తొలగిస్తే దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఆ దుశ్చర్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రధాన కారణమంటూ సదరు రోత పత్రికలో వార్తలు వండి వార్చారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు మరింత మండిపడుతున్నారు. కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతం మంచిది కాదని చంద్రబాబు భావిస్తున్నట్టుగా ఉంది. అయితే, ఈ ధోరణి తెలుగుదేశం కార్యకర్తల్లో నిరాశా నిస్పృహలకు కారణం అవుతోంది. శుక్రవారం నాటి విజయవాడ సంఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే... ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచేందుకు జగన్ అండ్ కో ఎంతకైనా తెగిస్తారని అర్థమవుతోంది. 2014–19 మధ్య కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పితాలు ప్రచారం చేసి జగన్ అండ్ కో లబ్ధి పొందింది. ఇప్పుడు కూడా అవే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2019లో చంద్రబాబు ఓడిపోయి జగన్‌రెడ్డి అధికారం చేపట్టడంతో దాదాపు రెండేళ్లపాటు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు బయటకు రావాలంటేనే భయపడ్డారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచే వైసీపీ శ్రేణులు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి చికాకులు సృష్టిస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా జగన్‌రెడ్డి ప్రత్యక్షమవుతున్నారు. దీన్ని తేలికగా తీసుకుంటే అధికార పక్షమే నష్టపోతుంది. చిన్న పాముపైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారంపై వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ తప్పుడు ప్రచారాలను కట్టడి చేయని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్‌రెడ్డి పేరు తొలగించడానికి కారకులైన వారి వెనుక చంద్రబాబు, లోకేశ్ ఉన్నారా? లేరా? అన్నది తేల్చాలి. వారి ప్రమేయం లేని పక్షంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. కక్ష సాధింపులు వాంఛనీయం కాదుగానీ... అసత్య ప్రచారాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే వారిపైన, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు కూడా తీసుకోని పక్షంలో అది అసమర్థత అవుతుంది. గతంలో చంద్రబాబు ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకుంది. జగన్ అండ్ కో విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మరింత అప్రమత్తత ప్రదర్శించాలి. లేనిపక్షంలో ఎదురయ్యే పరిణామాలకు సిద్ధం కావాలి!

> ఢిల్లీ మద్యం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్నది దర్యాప్తు సంస్థల ఆరోపణ. జగన్‌రెడ్డి కేసులలో 35 వేల కోట్ల ప్రజాధనం లూటీ జరిగిందని ఇవే దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. మద్యం కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉండగా, 35 వేల కోట్ల రూపాయల అవినీతి కేసులో జగన్‌రెడ్డి 16 నెలలు మాత్రమే జైల్లో ఉండి బెయిల్ పొందారు. పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్న జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కూడా కొనసాగారు. మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంకా జైల్లోనే ఉన్నారు. ఈ వైరుధ్యాలకు కారణం ఎవరు? సిసోడియా, జగన్‌రెడ్డి కేసులలో సుప్రీంకోర్టుకు కనిపించిన అభ్యంతరం కింది కోర్టులకు ఎందుకు కనిపించలేదు? న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు ఈ దేశంలో ఎంత మంది వెళ్లగలరు? వెళ్లినా న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ఉంటుందా? అదీ లేదు.

> విజయవాడ సంఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే... ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచేందుకు జగన్ అండ్ కో ఎంతకైనా తెగిస్తారని అర్థమవుతోంది. 2014–19 మధ్య కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పితాలు ప్రచారం చేసి జగన్ అండ్ కో లబ్ధి పొందింది. ఇప్పుడు కూడా అవే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్‌రెడ్డి పేరు తొలగించడానికి కారకులైన వారి వెనుక చంద్రబాబు, లోకేశ్ ఉన్నారా? లేరా? అన్నది తేల్చాలి. వారి ప్రమేయం లేని పక్షంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. కక్ష సాధింపులు వాంఛనీయం కాదుగానీ... అసత్య ప్రచారాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే వారిపైన, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు కూడా తీసుకోని పక్షంలో అది అసమర్థత అవుతుంది. గతంలో చంద్రబాబు ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకుంది. జగన్ అండ్ కో విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మరింత అప్రమత్తత ప్రదర్శించాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అపురూప కథలు ఆమెవి..!

> సుజాతాదేవి బాలసాహిత్యంలో ఎంత కృషి చేసిందో, కథారచనలోనూ అంతటి కృషి చేసింది. సుజాత స్వీకరించిన పలు కథాంశాలను అప్పట్లో రచయిత్రులే కాక రచయితలు కూడా సాహిత్యంలోకి తీసుకురాలేదు. సాహిత్య విలువలు, సామాజిక బాధ్యత తెలిసిన ఆమె ఏ ప్రక్రియ చేపట్టినా నిబద్ధతతో ప్రతిభావంతంగా రాసింది. మేము ప్రచురించి ఇచ్చిన 'ఆటలో అరటిపండు' పుస్తకానికే సుజాతాదేవికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం రావటంతో మాకే వచ్చినంతగా సంబరపడ్డాం నేను, వీర్రాజుగారు.

డి. సుజాతాదేవి 'పేరు వింటే సాహిత్య రంగంలో కొందరు 'ఆమె బాల సాహిత్య రచయిత్రి' అంటారు. మరికొందరు 'గేయం రాస్తుంది' అంటారు. తమ రచనలు తప్ప ఇతరుల రచనలు చదివే అలవాటు లేని వాళ్ళు 'ఎవరామె? ఏమిటి రాసింది? ఎప్పుడూ పేరు విన్నట్లు లేదే?' అని ఆశ్చర్యంతో చూసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఆమె మాట మలయానిలయం, పాట తేనెల సోన, గేయం వెన్నెల వాక. మరి కథో? సమాజం మారుమూలలలోకి దృష్టి సారించి పరిశీలించి నివ్వెరపోయేలా రాసిన అపురూప కథలు ఆమెవి. నేలమీద సాము చేయని, నిబద్ధతతో కూడిన కథలు. బాలల నేస్తం, స్నేహపూరితరూపం ఆమె. ఆగస్ట్ నాలుగు స్నేహితుల దినోత్సవం రోజున అల్జీమర్స్‌తో బాధపడుతూ కన్నుమూసింది నా స్నేహితురాలు సుజాత!

1970లో సాహిత్య రంగంలోకి అడుగుపెట్టి సుజాత మూడు కథాసంపుటాలు, మూడు పాటల పుస్తకాలు, ఒక గేయకావ్యం, మూడు నవలలు, ఒక వ్యాసాల పుస్తకం, ప్రముఖులతో చేసిన ముఖాముఖీల సంకలనంతో పాటు రెండు పాటలు కేసెట్లు వెలువరించారని చాలా మందికి తెలియదు. NCERT వాళ్ళ పురస్కారం, బాలల నవలకి జాతీయ పురస్కారం, బాలల లఘుచిత్రానికి ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్నారన్న విషయం అనేక మందికి తెలియదు. బహుశా 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారనే విషయం కొందరికైనా తెలిసే ఉంటుంది అనుకుంటాను మరి.

సుమారు యాభై ఏళ్ళక్రితం సుజాతతో నా పరిచయం రాను రాను స్నేహబంధంగా గాఢమైంది. అనేక సభలలో సమావేశాల్లో కలిసిన మేము తర్వాత తర్వాత మూడునాలుగేళ్ళ క్రితం వరకూ ఫోనులో సాహిత్యం గురించి చర్చలూ, ఒక్కొకప్పుడు ఫోనులోనే పాటలూ, కథలూ రాగరంజితంగా మాట్లాడుకునేవారం.

నా పదవీ విరమణ అయ్యాక వీర్రాజుగారూ, నేనూ మొదట ఒక అవార్డు మొదలుపెట్టాలనుకున్నాం. తర్వాత అవార్డు కంటే ఉత్తమంగా ఎవరైనా ఏదైనా కారణం చేత పుస్తకాలు వేసుకోని రచయితల ఒక పుస్తకం 500 కాపీలు వేసి వాళ్ళకే ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఆ కోవలో మొట్టమొదటగా అంతకుముందు ఈనాడు పత్రికలో ధారావాహికంగా వచ్చిన డి. సుజాతాదేవి 'ఆటలో అరటి పండు' పిల్లల కథల్ని పుస్తక రూపంలో వేసి సుజాతకు ఇచ్చాం.

సుజాత ఆంధ్ర మహిళా సభ లిటరసీ హౌస్‌లో ఉద్యోగంలో చేరిన రోజుల్లోనూ, బ్రౌన్ అకాడమీలో పని చేసినపుడూ కూడా తరుచూ మేము ముగ్గురం కలిసే వాళ్లం. ఒక్కొక్కప్పుడు అత్తలూరి విజయలక్ష్మీ, భార్గవీరావూ కలిసేవారు. కొత్తగా రాసుకున్న కవితో కథో చదువుకునే వాళ్ళం, పాటలు పాడుకునేవాళ్ళం. అయితే అందరం కలిసి ఒక గొలుసు కథ రాయాలనుకున్న మా ప్రయత్నం మాత్రం కార్యరూపం దాల్చలేదు.

అకస్మాత్తుగా ఒక రోజు రాంకోఠీ కిమ్స్ హాస్పిటల్‌లో హార్ట్ ఆపరేషన్ జరిగిందని తెలిసి నేను హాస్పిటల్‌లో కలిసాను. వాళ్ళ అమ్మాయి ఆమె చేత ఉద్యోగం రాజీనామా చేయించి నల్గొండలో తన దగ్గరకు తీసుకువెళ్ళిపోతున్నదని తెలిసి నేను బాధపడ్డాను. నల్గొండ వెళ్ళిపోయాక ఆమె అప్పుడప్పుడు సభల కోసమో, ఏదైనా అవసరార్థమో హైదరాబాదు వచ్చినపుడల్లా కలుస్తూనే ఉన్నాను. సుజాత పెద్దమ్మాయి కొడుకు పెళ్లిలో జానకీ బాలతో సహా మేము ముగ్గురం కలిసి కబుర్లు చెప్పుకున్నాం. మాడభూషి రంగాచార్యులు స్మారక పురస్కారం సుజాతాదేవి రాసిన 'చేపలు' కథల సంపుటికి వచ్చినప్పుడూ, మాడభూషి రంగాచార్యుల పురస్కారాల పదేళ్ళ వేడుక సందర్భంగా కూడా మేము కలుసుకున్నాం. అప్పుడే అనుకుంటాను వీర్రాజుగారిని ఇంటర్వ్యూ చేస్తానని వచ్చి రోజంతా మా యింట్లో గడిపింది. ఇలా ఎంతమంది ప్రముఖులనో ఇంటర్వ్యూలను చేసి 'ముఖేముఖే సరస్వతి' పేరుతో సుజాత సంకలనంగా వేసింది.




సుజాతాదేవి బాలసాహిత్యంలో ఎంత కృషి చేసిందో, కథారచనలోనూ అంతటి కృషి చేసింది. ఆమె రాసిన 'చేపలు' కథ, సవరాలు కట్టి జీవించే వారి కథ 'ఎటు చూస్తే అటు', వెట్టిచాకిరీ చేసే బాబ్జీ కథ 'మలుపు', షాపుల ముందు వూడ్చే పనివారి జీవితం 'ఇంతేలే', ఆర్థికంగా వెసులుబాటులేని జీవితాల కథ 'వృత్తం'... ఇలా ఏ కథ తీసుకున్నా సుజాత స్వీకరించిన పలు కథాంశాలను అప్పట్లో రచయిత్రులే కాక రచయితలు కూడా సాహిత్యంలోకి తీసుకురాలేదు. సాహిత్య విలువలు, సామాజిక బాధ్యత తెలిసిన ఆమె ఏ ప్రక్రియ చేపట్టినా నిబద్ధతతో ప్రతిభావంతంగా రాసింది. మేము ప్రచురించి ఇచ్చిన 'ఆటలో అరటిపండు' పుస్తకానికే సుజాతాదేవికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం రావటంతో మాకే వచ్చినంతగా సంబరపడ్డాము నేను, వీర్రాజుగారు.

రెండు మూడేళ్ళుగా సుజాత ఫోన్లు చేస్తున్నా ఆమె మాటలు కొంత అసంబద్ధంగా ఉండటం గమనించి ఆమె పిల్లలతో మాట్లాడాను. 'అల్జీమర్' లక్షణాలు అప్పట్లోనే గమనించాను. కాని నేను సాహిత్యం గురించి, పాత రచయిత్రుల గురించి మాట్లాడినప్పుడు మామూలుగానే తన అభిప్రాయాలు చెప్తూనే వుంది. భగవద్గీత అంశాలను పాటలుగా రాస్తున్నానని ఫోన్ చేసినపుడు పాడి వినిపించేది. ఫోను చేసినపుడల్లా ఆమెతో మొత్తం పాటలు తొందరగా రాయటం పూర్తి చేసి పుస్తకంగానో, కేసెట్ గానో చేయమని ప్రోత్సహిస్తూ మాట్లాడేదాన్ని. అప్పటికి అదే ప్రయత్నంలో ఉన్నానని చెప్తుండేది.

2022 మార్చిలో వీర్రాజు గారి పెయింటింగ్స్ దామెర్ల కళానికేతన్‌కి వితరణ చేసిన సందర్భంలో వెళ్ళినప్పుడు కమల వాళ్ళ అమ్మ సుజాతని మేమున్న హోటల్‌కు తీసుకువచ్చింది. సుజాత నన్ను గుర్తుపట్టి మాట్లాడిందికాని మధ్య మధ్యలో మౌనంలోకి జారిపోవటం చూసి నేను దిగులుపడ్డాను. అదే నేను ఆమెను ఆఖరుసారి చూడటం. ఆ చిన్నినవ్వుతో.. ఆ చిలిపి నవ్వుతో.. ఇంక నన్ను అలా పలకరించేవారు ఎవరు సుజాతా...!

■ శీలా సుభద్రాదేవి



సజీవ శిల్పం

Sunday SPECIAL

కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం

'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు..' అని ఓ సినీ గేయ రచయిత అలనాటి తెలుగువారి శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్పారు. మొక్కవోని దీక్షతో శిలను శిల్పంగా మలిచి.. ప్రపంచానికి అందించేందుకు శిల్పులు చేసిన కృషికి యునెస్కో గుర్తింపు పొందిన మన రామప్ప శిల్ప సౌందర్యమే నిదర్శనం. అంతేకాదు అనేక చరిత్రాత్మక కట్టడాలను నిర్మించిన కాకతీయుల కాలంలో శిల్పం నాట్యమాడగా.. శిల నుంచి స్వరాగాలు పలికాయట. అలాంటి అద్భుత శిలా సంపద, కళాఖండాలపై కాలక్రమంలో ప్రకృతితో పాటు దుండగులు జరిపిన దాడులతో చాలా చోట్ల ధ్వంసమైంది. రాష్ట్రంలోని ముఖ్యంగా ఓరుగల్లులోని పురాతన దేవాలయాలు, ప్రదేశాలను సందర్శిస్తే.. కొన్ని శిల్పాలు దెబ్బతిన్నట్టు.. లేదంటే వాటి అసలు ఆకృతిని కోల్పోయినట్టు అర్థమవుతుంది. అలాంటి శిల్పాల పాత రూపం చెక్కుచెదరకుండా అసలు అకృతిని ఇచ్చేందుకు చరిత్ర పరిశోధకులు శిల్పాల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారు. చారిత్రక సంపదను యథాతథంగా ఆవిష్కరింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్





- దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ
- వారసత్వ కట్టడాల్లో 4వేలకుపైగా కళాఖండాలు.. వీటిలో 100 శిల్పాలకు జీవం
- రామప్ప, వరంగల్ కోట తదితర ప్రాంతాల నుంచి సేకరణ
- చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో అడుగులు
- కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు
- జగదల్పూర్ రాజీమహల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు

7

ఎంజీఎం ఘటనపై ప్రభుత్వం సీరియస్



- సీఎం కార్యాలయం నుంచి ఆరా
- ఘటన నిగ్గు తేల్చేందుకు ఐదు పోలీసు బృందాల ఏర్పాటు
- ఆసుపత్రిలో 40 సీసీ కెమెరాల ఏర్పాటు
- పది కుక్కలను పట్టి తరలించిన బల్దియా సిబ్బంది

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం ఓ నవజాత శిశువు మృతదేహాన్ని ఓ శునకం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ వార్డు వద్దకు తీసుకొచ్చిన సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఘటనకు గల కారణాలపై సీఎం కార్యాలయ అధికారులు ఆరా తీశారు. అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా వరంగల్ కలెక్టర్ సత్యశారద, జిల్లా వైద్య శాఖ, ఎంజీఎం ఆసుపత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇకపై ఎంజీఎం ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతంకానీయొద్దని, వెంటనే పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అప్రమత్తమైన కలెక్టర్ సత్యశారద.. వెంటనే ఎంజీఎం ఆస్పత్రిలో రూ.5లక్షల వ్యయంతో 40సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే రంగంలోకి దిగిన బల్దియా సిబ్బంది.. శనివారం ఉదయం ఎంజీఎం ప్రాంగణంలో సంచరిస్తున్న పది కుక్క లను పట్టి అక్కడి నుంచి తరలించారు. ఇక ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ ఎస్ఎన్‌సీయూ, పిల్లల వార్డును శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

ఐదు పోలీసు బృందాల ఏర్పాటు

మృతిచెందిన నవజాత శిశువుకు సంబంధించిన వారి ఆచూకీని కనుగొనేందుకు పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామని మట్టెవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఈ బృందాలు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులను సందర్శించి వివరాలు సేకరిస్తాయన్నారు. గత రెండు రోజులుగా ఎవరైనా శిశువు మృతి చెందారా అన్న అంశంపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. కుక్క తీసుకొచ్చిన నవజాత శిశువు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారని, మూడు రోజుల వరకు బంధువుల ఆచూకీ లభించకపోతే తదుపరి కార్యక్రమాలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

ఎంజీఎం సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

పసికందును కుక్క నోటకరుచుకొచ్చిన సంఘటనపై బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఎంజీఎం సెంటరులో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పసిపాప మృతి ఘటన చాలా బాధాకరమని, ఎంజీఎంలో మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ సంఘటన ఎంజీఎంలోనే జరిగినా.. ఇది ఎంజీఎం ఆస్పత్రిలో జరగలేదని దాట వేస్తున్న సూపరింటెండెంట్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా వెంటనే సౌకర్యాలు కల్పించి సేవలు ప్రారంభించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్లు కుందారపు రాజేందర్, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జిలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంజీఎం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

పసికందు ఘటన కలిచివేసింది : మంత్రి సురేఖ

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో పసికందుపై వీధి కుక్కల దాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీఎం ప్రాంగణంలో ఈ ఘటన జరగడం అత్యంత బాధాకరమని, పసికందును ఎక్కడి నుంచి కుక్కలు తీసుకొచ్చాయో విచారించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి ఘటనలు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా చుట్టుపక్కల సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

రెండు ప్రాణాలను బలిగొన్న టిప్పర్

- బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరి మృతి
- మల్లికుదుర్లలో విషాదం

ధర్మసాగర్, ఆగస్టు 10: టిప్పర్ అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన ధర్మసాగర్ మండలం జానకీపురం ఎస్సీ కాలనీ వద్ద శనివారం జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వేలేరు మండలం మల్లికుదుర్లకు చెందిన గురిజాల మల్లారెడ్డి (56), అదే గ్రామానికి చెందిన సారంపెల్లి అమరేందర్‌రెడ్డి (40)లు ద్విచక్ర వాహనంపై మల్లికుదుర్ల నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో ధర్మసాగర్ వైపు బయలు దేరారు. ఈ క్రమంలో ధర్మసాగర్ మండలం జానకీపురం ఎస్సీ కాలనీ వద్దకు రాగానే ధర్మసాగర్ వైపు నుంచి మల్లికుదుర్ల వైపు అతివేగంతో వస్తున్న టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో మల్లారెడ్డి, అమరేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో మల్లికుదుర్లలో విషాదం నెలకొంది. మల్లారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉండగా, అమరేందర్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలను పోస్టుమార్టంకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన మల్లారెడ్డి (ఇన్‌సెట్‌లో ఫైల్)


మృతి చెందిన అమరేందర్ రెడ్డి (ఇన్‌సెట్‌లో ఫైల్)


ఇందిరా పార్కులో నిర్వహించిన బీసీ సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న వినయ్‌భాస్కర్

తెలంగాణ తరహాలో బీసీ ఉద్యమం

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 10: తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమం తరహాలోనే బీసీ ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ కుల సంఘాలు కలిసి రావాలని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో బీసీ సత్యాగ్రహదీక్షలో వినయ్‌భాస్కర్ పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. బీసీల కులగణన, అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంగు అశోక్‌యాదవ్, చెన్నం మధు, పులి రజినీకాంత్, కుసుమ లక్ష్మీనారాయణ, జానకి రాములు, కుచన సునీల్, తాడిశెట్టి క్రాంతికుమార్ నార్లగిరి రమేష్, కనకరాజు, గండ్రకోట రాకేష్, వాసు, వివేక్ పాల్గొన్నారు.

లాడ్జిల్లో సీపీ ఆకస్మిక తనిఖీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 10: హనుమకొండ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని లాడ్జిల్లో శనివారం అర్ధరాత్రి సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు చేసిన సందర్భాల్లో చాలామంది నేరస్థులు లాడ్జిల్లో తలదాచుకొని పోలీసులకు దొరికిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో సీపీ ఆకస్మిక తనిఖీ లాడ్జి నిర్వాహకుల్లో అలజడి రేగింది. లాడ్జిల్లోకి వచ్చే వ్యక్తులు ఎలాంటి గుర్తింపు పత్రాలు చూపిస్తున్నారు? ఎలాంటి వ్యక్తులు వస్తున్నారు..? దేనికోసం లాడ్జిల్లో ఆశ్రయం పొందుతున్నారు? అనే అంశాలతోపాటు సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా? అని ఆరా తీశారు. సీపీ వెంట హనుమకొండ ఏసీపీ దేవేందర్, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


లాడ్జిలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

చదివింది ఒకటి.. సర్టిఫికెట్ మరొకటి..

- ఇదీ.. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నిర్వాకం
- అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం..

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. విద్యార్థులు చదివింది ఓ కోర్సు అయితే.. అధికారులు మాత్రం వారికి వేరొక సర్టిఫికెట్ ఇస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తోచక విద్యార్థులు అయోమయంలో పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా అధికారులు మాత్రం అస్సలు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు పూర్తి చేసిన కోర్సుకు సంబంధించి సర్టిఫికెట్లు అందజేయాల్సిన కళాశాల వర్గాలు అందుకు భిన్నంగా మరోలా సర్టిఫికేట్లు జారీ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే విద్యార్థులు సంబంధిత కోర్సు పూర్తి చేసినట్లు మరో సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

బీకామ్ కంప్యూటర్స్‌కు బీకామ్ సర్టిఫికెట్లు

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడేళ్లుగా బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు బీకామ్ డిగ్రీ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ఈ కోర్సులో సుమారు 80 మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులైనట్లు తెలుస్తోంది. అయితే వారందరికీ బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ అని ఉండాల్సిన సర్టిఫికెట్లలో బీకామ్ డిగ్రీ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లను అధికారులు జారీ చేశారు. ఈ క్రమంలో ఓవిద్యార్థి సెప్టెంబర్‌లో విదేశాలకు పైచదువుల కోసం వెళుతుండగా పాసైన సర్టిఫికెట్ తీసుకుని అవాక్కయ్యాడు. తాను బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డిగ్రీ పూర్తి చేయగా తనకు మాత్రం బీకామ్ డిగ్రీ పాసైన సర్టిఫికెట్ జారీ చేశారు. దీంతో సదరు విద్యార్థి ప్రిన్సిపాల్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో కోర్సు పూర్తిచేసినట్లు తాను మరో లెటర్ ఇస్తానని చెప్పినట్లు విద్యార్థి చెబుతున్నారు. అయితే అలా ఇస్తే సర్టిఫికెట్‌తో ఎలాంటి ఉపయోగం లేదని అంటున్నాడు.



నాలుగైదు రోజుల్లో జారీ చేస్తాం..

విద్యార్థులకు జారీ చేసిన కోర్సు కాని సర్టిఫికెట్లపై ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతిని వివరణ కోరగా.. బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్ పూర్తి చేసిన వారికి బీకామ్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు తన దృష్టికి వచ్చిందని, సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని చెప్పారు. కమిటీ తీర్మానం చేసి నాలుగైదు రోజుల్లో అందరికీ సరైన సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

పోలీసు అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తా..

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో చిన్నారి



కొత్తగూడలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి భోజనం చేస్తున్న చిన్నారి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 10 : చదువుకుని పోలీసును అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తానని ఓ చిన్నారి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో తెలిపింది. దీంతో.. నీ చదువుకు పోలీసులు సహకరిస్తారని ఎస్పీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం నిర్వహించిన గుడుంబా బాధితులకు చేయూత కార్యక్రమానికి గంగారం మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఓ వితంతువు తన చిన్నారితో హాజరుకాగా.. ఎస్పీ ఆ చిన్నారితో మాట్లాడారు. పెద్దయ్యాక ఎం అవుతావని ప్రశ్నించారు. చిన్నతనంలో గుడుంబాకు బానిసై నాన్న చనిపోయాడని ఆర్థికభారంతో చదువుకోలేక పోతున్నానని, లేకుంటే చదువుకుని పోలీస్ అయ్యేదాన్ని అని ఆచిన్నారి బదులిచ్చింది. స్పందించిన ఎస్పీనువ్వు చదువుకునేందుకు పోలీసులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. తన పక్కనే కూర్చొబెట్టుకుని భోజనం చేశారు. గుడుంబాతో నాలాంటి పిల్లల చదువు దూరమై భిక్షాటన చేస్తున్నారని ఎస్పీతో చెబుతూ విలపించింది,

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మాట్లాడుతున్న కోటూరి మానవతారాయ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ సంస్థల దోపిడీ నుంచి రక్షించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికారి ప్రతినిధి కోటూరి మానవతారాయ్ అన్నారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని స్కాలర్స్ హాస్టల్ వద్ద నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతారాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్ష 45 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా అవుట్ సోర్సింగ్ సంస్థల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు చెల్లిస్తూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ సంస్థలను తక్షణమే రద్దు చేసి చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో అందరూ స్వర్ణయుగం రేవంత్‌రెడ్డి పాలనను భావిస్తున్నారని అన్నారు. జీవో 29 మాజీ సీఎం కేసీఆర్ తెచ్చి ఇప్పుడు మెడికల్ సీట్ల విషయంలో టీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందని దుయ్యబట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు లాభం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సురాసి కృష్ణ, కేయూ పరిశోధక విద్యార్థులు తాళ్లపల్లి నరేశ్‌గౌడ్, గుండేటి సుమన్, వర్సిటీ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జి అభిరామ రమేశ్, పల్లె శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా ఇండిపెండెంట్ డే స్పెషల్ రైలు

కాజీపేట, ఆగస్టు 10: ఇండిపెండెంట్ డేను పురస్కరించుకుని కాజీపేట మీదుగా(07069/07070) హైదరాబాద్ - సంత్రగాచి - హైదరాబాద్ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈనెల 14, 15 తేదీల్లో నడిపించనున్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.30 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్, జనగాం, కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బుర్హంపూర్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, జైపూర్, కీయోంజార్, భద్రక్, బలసోర్, కరఖ్‌పూర్ స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

25న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10: రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హనుకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 19 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ క్రీడాకారులను సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స'జీవ' శిల్పం!

● కాకతీయల నాటి కళాసంపదకు పునరుజ్జీవం ● దెబ్బతిన్న శిల్పాల అకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ ● కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతీ కట్టడం ఓ అద్భుతమే. అందులో ప్రతీ దేవాలయాల నిర్మాణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతే శిల్పం. ఎన్నో ఏళ్ల శ్రమించి శిల్పులు శిలలకు జీవం పోసేలా నిర్మాణం చేశారు. అందులో రామప్ప శిల్ప సౌందర్యం యునెస్కోను కట్టి పడేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తించింది. కేవలం రామప్పలోని శిల్ప నైపుణ్యతతో పాటు నీటిలో తేలియాడే ఇటుకల తయారీ యునెస్కోను మైమరిపింపజేసింది. ఆలయం చుట్టూ గోడలపై ఉన్న నాట్యకారిణులు, ఏనుగులు, మదనికల విగ్రహాలు రామప్ప ప్రత్యేకత. నల్ల గ్రానైట్ రాయిపై చెక్కిన నాగిని, మద్నిక శిల్పాలు, రంగమండప స్తంభాలు, యాలి, గజకేసరి శిల్పాలు అలనాటి కళకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచి యునెస్కో గుర్తింపునకు దోహదపడ్డాయి. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి శిల్ప సౌందర్యమే భక్తులను ఆకట్టుకుంటుంది. రామప్పతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, గణపేశ్వరాలయం.. ఇలా అనేక ప్రాంతాల్లో కాకతీయుల కట్టడాలున్నాయి. వీటిలో చాలా వరకు ప్రకృతి వైపరీత్యాలతో పాటు హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు దెబ్బతిన్నాయి. కొన్ని శిల్పాలు వాటి అకృతిని పూర్తిగా కోల్పోయాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని కాపాడేందుకు చరిత్ర పరిశోధకులు టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) అనే పేరుతో అంతరించి పోతున్న చరిత్రకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు.

శిల్పాలకు పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో కళావైభవం ఎంత వర్ధిల్లిందో.. శిల్ప సౌందర్యం కూడా అంతే ఆకర్షించింది. అయితే కాకతీయులు నిర్మించిన అనేక ఆలయాల్లోని శిల్పాలు దుండగుల దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటి అసలు రూపాన్ని కోల్పోయాయి. చరిత్రకు మౌనసాక్ష్యాలుగా నిలిచాయి. టార్చ్ ఆధ్వర్యంలో కాకతీయ రాజులు పరిపాలించిప్పుడు రూపొందించిన వందకు పైగా ప్రసిద్ధ శిల్పాలను గుర్తించి వాటికి మునుపటి రూపాన్ని తీసుకొచ్చేందుకు గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో దాదాపు 1,600 ప్రదేశాలలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈవారసత్వ కట్టడాల్లో 4,000కుపైగా శిల్పాలున్నాయి. ఈ ప్రాజెక్టులో అరవింద్, ఈమని శివనాగిరెడ్డి (రిటైర్డ్ ఆర్కియాలజిసిస్ట్), ఏలూరి శేషబ్రహ్మం (ప్రముఖ కళాకారుడు), రఘువీర్ (స్తపతి), రక్షిత్(కళాకారుడు), హిమాన్షి(నృత్యకారిణి) దాదాపు 100పాడైపోయిన శిల్పాలను సేకరించి స్కెచింగ్ చేసి శిల్పాలను తయారు చేయడం ప్రారంభించింది. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, చంద్రవల్లి దేవాలయాలు, నాగులపాడు, కూసుమంచి, ధంతేశ్వరి నుంచి అనేక విగ్రహాల నమునాలను సేకరించారు. పునరుజ్జీవ ప్రాజెక్టు కాకతీయ రాజవంశం కాలం నాటి దెబ్బతిన్న శిల్పాలను పునర్నించడం లక్ష్యంగా పెట్టుకుంది. శిల్పాలు దెబ్బతినకుండా ఉంటే ఎలా ఉంటుందో ఊహించాల్సి ఉంటుంది. ఆ కళాఖండాలను గీసి.. సిమెంట్‌లో చెక్కాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు 30శిల్పాలను పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో ఒక్కో శిల్పం చెక్కడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టేది. కాకతీయ శిల్పాలు తమ జీవితాంతం వేలాది శిల్పాలను రూపొందించారు. కాకతీయ కట్టడాలపై జరిగిన దాడులలో ఇటువంటి అద్భుతమైన కళాఖండాలు నాశనమయ్యాయి. శిథిలావస్థకు చేరిన శిల్పాల అసలు స్వరూపంపై ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. వీటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉన్నవి కూడా కనుమరుగవుతాయని చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

శిల్పవైభవం భవిష్యత్తు తరాలకు తెలిసేలా

చరిత్రను గుర్తు పెట్టుకోవడానికి శాసనాలు, నాణేలు, పుస్తకాలు, జానపద కథలు లాంటి రాతపూర్వక ఆధారాలు ఉంటాయి. శిల్పాల ద్వారా చరిత్రను చూపించవచ్చని, దెబ్బతిన్న శిల్పాలు అప్పట్లో ఎలా ఉండేవో.. వాటి అసలు అకృతిని ప్రజలకు చూపించాలని లక్ష్యంగా శిల్ప పునరుజ్జీవం కోసం చరిత్ర పరిశోధకులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కాకతీయులతో పాటు అనేక మంది రాజులు నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి అనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఓరుగల్లు శిల్పావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రామప్ప, వరంగల్ కోటలోని అనేక శిల్పాలను గుర్తించారు. వీటి అసలు అకృతి ఉట్టిపడేలా సిమెంట్‌తో విగ్రహాలను తయారు చేస్తారు.





ఈ శిల్పాలకే పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో నిర్మించిన విగ్రహాలు అనేకం ధ్వంసమయ్యాయి. వీటిలో కొన్నింటి అసలు అకృతితో పునరుజ్జీవం కల్పించేందుకు టార్చ్ బృందం ఎంపిక చేసింది. వీటిలో రామప్ప ఆలయంలో వందలాది నృత్య శిల్పాలు న్నాయి. పేరిణి, కోలాటంతో పాటు ఇతర శిల్పాలు, నాలుగు కాళ్లతో శివప్రియ నృత్య భంగిమ ఉంది. రంగమండపానికి ఆగ్నేయం వైపు చెక్కిన ఈ శిల్పంలో ముగ్గురు మహిళలు నాలుగు కాళ్లతో నాట్యం చేస్తున్నారు. ఈ శిల్పానికి పునరుజ్జీవం కల్పిస్తున్నారు. అలాగే రామప్ప ఆలయంలోని రంగ మంటపంపైన ఉన్న కపాలి రాతిపై మధ్యలో నటరాజ, అష్ట దిక్పాలకులతో కూడిన కళాకృతి ఉంది. దీన్ని కూడా పునరుజ్జీవం కల్పించనున్నారు. వరంగల్ కోటలోని శంభు దేవాలయంలో అరుదైన ముఖలింగంతో ఉంది. నాలుగు దిక్కులకు నాలుగు ముఖాలు చెక్కి ఉంటుంది. వారిని సద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన అని పిలుస్తారు. ఈ లింగాన్ని కూడా నమునా తయారు చేస్తున్నారు. పాలంపేటలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూట ఆలయ ధ్వజస్థంభం కాల క్రమేణా అరిగిపోయింది. దీనికి కూడా పునరుజ్జీవం తేనున్నారు. వీటితో పాటు 100 శిల్పాలకు జీవం పోయనున్నారు.



శిల్పాలను తయారుచేస్తున్న స్తపతి రఘువీర్



కాకతీయ శిల్ప వైభవాన్ని కాపాడేందుకే..

అరవింద్, టార్చ్, ప్రధాన కార్యదర్శి

కాకతీయుల కాలంలో నిర్మించిన శిల్పాలను పునఃనిర్మించటంతో పాటు సాంస్కృతిక వైభవం, వారసత్వం, కళలను కాపాడేందుకు శిల్పాల పునరుజ్జీవ ప్రక్రియను చేపట్టాం. వారసత్వ కట్టడాల్లో దెబ్బతిన్న 100 శిల్పాలను గుర్తించాం. వీటిలో 30కి పైగా శిల్పాలను పునరుద్ధరించాం. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఈ శిల్పాలను ప్రదర్శనకు ఉంచుతాం. ఛత్తీస్‌గడ్, జగదల్‌పూర్‌లోని కాకతీయుల వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్‌లో ప్రదర్శించనున్నాం. ఈ మహల్‌ను త్వరలోనే మ్యూజియంగా మార్చి భవిషత్ తరాలకు కాకతీయుల శిల్ప వైభవం, చరిత్రను అందేలా చూస్తున్నాం.





యథావిధిగా నడుస్తున్న రైళ్లు

శాతవాహన, గోల్కొండ, కృష్ణా, పుష్‌పుల్‌తో సహా అన్ని రన్నింగ్

ఈ నెల 5 నుంచి పోయిన రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజీపేట, ఆగస్టు 10: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ పశ్చిమ క్యాబిన్ మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి నిలిచిపోయిన శాతవాహన, గోల్కొండ, కాజీపేట- డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లతో సహా వరంగల్ రాకుండా దారి మళ్లించిన పలు రైళ్లు శనివారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్- విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు -సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, కాజీపేట- డోర్నకల్- విజయవాడ, విజయవాడ- డోర్నకల్ - కాజీపేట పుష్‌పుల్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. వరంగల్ రాకుండా దారిమళ్లించిన ఆదిలాబాద్ -తిరుపతి -ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి - సికింద్రాబాద్ పద్మావతి, హైదరాబాద్ -చెన్నై సెంట్రల్- హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -గూడూరు -సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ శనివారం నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం తిరుపతి నుంచి ఆదిలాబాద్ బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, ఖమ్మం మీదుగా సాయంత్రం 6.10గంటలకు వరంగల్‌కు చేరుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరింది. దీంతో 5 రోజుల పాటు విజయవాడ, హైదరాబాద్ వైపు రైళ్ల రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఊరట లభించింది.

సంగెం పీహెచ్‌సీలో అయోమయానికి తెర

ఒకరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే పోస్టులో ఇద్దరిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం అనే కథనం ఈ నెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. వరంగల్ జిల్లా సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌గా ఎం.హనుమనాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. మరో పది రోజులకు ఇదే స్థానంలో సదానందంను నియమిస్తున్నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సదానందంను గీసుగొండకు బదిలీ చేసినట్లు తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.





బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రూ.15లక్షల విలువైన బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 10: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం వెంకటాపూర్‌లో ఒక రైస్ మిల్లులో నిల్వ చేసిన రూ.15లక్షల 60వేల విలువైన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రైస్‌మిల్ యజమాని ఆడెపు దయాకర్ పీడీఎస్ రైస్‌ను నిల్వ చేసినట్లు సమాచారం అందుకుని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని దయాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం జఫర్‌గఢ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

న్యాయవాది సిద్ధార్థ లూత్రను
సన్మానించిన ఎమ్మార్పీఎస్ నేతలు



ఢిల్లీలో న్యాయవాది లూత్రను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు

కాళోజీ జంక్షన్, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించి తీర్పు వెలువరించేలా కేసును వాదించిన న్యాయవాది సిద్ధార్థ లూత్రను రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వాదించడానికి రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ న్యాయవాది అయిన సిద్ధార్థ లూత్రను నియమించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని ఆయన కార్యాలయానికి వెళ్లి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేతలు కలిశారు. ఆయనను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌లు ఉన్నారు.

భీమారంలో స్వచ్ఛదనం - పచ్చదనం

రాంనగర్, ఆగస్టు 10: నగరంలోని 55వ డివిజన్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామంలోని శ్యామల చెరువు కట్టపై గౌడ సంఘం నేతలతో కలిసి కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు తాటి, ఈత మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బూర సారంగపాణి, మార్క రాజు, సంగాల చిట్టిబాబు, ముచ్చ వెంకటస్వామి గౌడ సంఘం నేతలు బూర రాజేందర్, చింత శ్రీనివాస్, బూర వెంకటస్వామి, దేశిని వీరస్వామి, బూర సురేందర్, అటికం శ్రీకాంత్, నరేందర్, అటికం సుభాష్, రామ్మూర్తి, రాంరాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డిలో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ

హసన్‌పర్తి, ఆగస్టు 10: మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మహేంద్, కోఆర్డినేటర్లు ఆర్.శశికుమార్, కె.రవికిరణ్, ఏవో వేణు గోపాలస్వామి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ధర్మసాగర్, ఆగస్టు 10: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రహర్షిత్ అన్నారు. శనివారం వేలేరు మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రినిపాల్ అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాల్సిన నేటి యువత డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కౌమార దశలో కొత్త ఆనందాలను వెతుక్కోవడం కోసం క్రమంగా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ కాస్త వ్యసనంగా మారి సంఘ విద్రోశక్తులుగా తయారవుతున్నారని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులచే సీఐ ప్రతిజ్ఞ చేయించారు.

ఎంఈవో పోస్టులు టీచర్లకే కేటాయించాలి

జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కాసం ప్రభాకర్

వడ్డెపల్లి, ఆగస్టు 10: మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో) పోస్టులు గవర్నమెంట్ టీచర్లకే కేటాయించాలని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో మాదిరిగా తెలంగాణలో కూడా ఎంఈవోలను ఎంఈవో-1, ఎంఈవో -2లుగా క్రియేటీవ్ చేసి ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు వేర్వేరుగా పదోన్నతులు కల్పిస్తే ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒక్క అర్బన్ పరిధిలో మాత్రమే ఎంఈవో పదోన్నతులు ఇస్తామంటే ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈవోలుగా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. దశాబ్దకాలంగా విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో టీజీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రవి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు టి.ప్రకాష్, గుజ్జ వెంకటేశం, పరమేశ్వర్, రాజేంద్రం, కిరణ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కాజీపేట, ఆగస్టు 10: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణిస్తారని కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి అన్నారు. కాజీపేట సెయింట్ గ్యాబ్రియేల్ స్కూల్ ప్రైమరీ సెక్షన్‌లో శనివారం ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ ఆఫ్ స్కూల్ క్యాబినెట్ వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సమష్టిగా పనిచేయడం నేర్చుకుంటే సమస్యలు పరిష్కరించే సామర్థ్యం, బాధ్యత పెరుగుతుందన్నా రు. భవిష్యత్‌లో మంచి నాయకులను అందించేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.గౌతమ్, ఎస్సై లవణ్‌కుమార్, ప్రి న్సిపాల్ ఆంథోని పొలిశెట్టి, బ్రదర్ స్లీవారెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎం.రఘునాథ్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థి క్యాబినెట్ సభ్యులను అభినందించారు.

విజయ దండోరా యాత్రను విజయవంతం చేయండి

ధర్మసాగర్, ఆగస్టు 10: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించే విజయ దండోరా యాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ మాదిగ అన్నారు. శనివారం ధర్మసాగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించి రాజ్యాంగ ఫలాలను మోసుకొస్తున్న మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికేందుకు మాదిగలు, ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రారంభమై హైదరాబాద్ వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని మాదిగలు, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మంద రాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ మాదిగ, శివ, శాంతిసాగర్ పాల్గొన్నారు.

మెడికల్ షాపులో చోరీ

కాజీపేట, ఆగస్టు 10: మెడికల్ షాపులో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. కాజీపేట పోలీసులు తెలిపిన ప్రకారం.. కాజీపేట సిద్ధార్థనగర్ మెయిన్‌రోడ్‌లోని శ్రీసంతోష్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి తాళం పగటగొట్టి చోరీ చేశారు. ఈ ఘటనలో క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.వెయ్యి నగదు చోరీ చేశాడు. షాపు యజమాని ఆకుల నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ ఘటన విజువల్స్ సీసీ కెమెరాలో రికార్డయ్యాయని, త్వరలో దుండగులను పట్టుకుంటామని తెలిపారు.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, దుర్గాప్రసాద్

కాళోజీ జంక్షన్, ఆగస్టు 10: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రావణ మాసం సందర్భంగా రుద్రాక్షలు ధరించడం వలన సకల ఐశ్వర్యాలు లభిస్తాయని అన్నారు. ప్రధానంగా శ్రావణ మాసంలో పంచముఖి రుద్రాక్ష ధరించడం వలన బ్రహ్మ శివరూపాలను దర్శించిన వారవుతామని పేర్కొన్నారు. నేపాల్ ఎగ్జిబిషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలతో పాటు స్ఫటిక, తులసి, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. జన్మ నక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాక్షలను ఇస్తామని చెప్పారు. ఈ ప్రదర్శన ఈనెల 19 వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేపాల్ రుద్రాక్షల డైరెక్టర్ జి.పద్మలత, ప్రముఖ న్యాయవాది వీరమల్ల వెంకటేశ్వర్‌రావు, ననుబాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం నిధి సేకరణ

ఐనవోలు, ఆగస్టు 10: ప్రకృతి వైపరీత్యంతో సర్వం కోల్పోయిన కేరళ వయనాడ్ బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యత అని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. వయనాడ్ బాధితుల కోసం సీపీఎం రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో నిధి సేకరణ చేపట్టారు. సేకరించిన నిధిని శనివారం ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఎస్సై సైతం తనవంతు ఆర్థిక సహాయం చేశారు.

లెక్కించిన నిధి రూ.8,260లను సీపీఎం జిల్లా పార్టీ కార్యదర్శి బోట్ల చక్రపాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొంకాల నారాయణరెడ్డి, మాదాసి యాకుబ్, కుంకాల కవిత, నాయకుడు మడిగె నాగరాజు, బొమ్మకంటి యాకయ్య, మాదాసి ప్రభాకర్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10: వ్యవసాయంలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఎస్సార్ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్సార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు ఎం.శ్రావ్య, సుచిత్‌కుమార్, విద్యార్థులు అంజలి, రీతూ, హర్షిత, సుష్మ, శృతి, అవంతీ తదితరులు రైతులకు స్వదేశీ పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని అధిక ఫలసాయంతో ఎలా చేయవచ్చునో వివరించారు. సేంద్రియ సేద్యం, జీవామృతం తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు శ్యామరావు, లింగారావు, రాజేశ్వర్‌రావు, మాధవ రావు, బుచ్చరంరావు, రమ తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో బొడ్రాయి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మడికొండ, ఆగస్టు 10: ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో నిర్వహించిన బొడ్రాయి (గ్రామదేవత) ప్రతిష్ఠాపన వేడుకల్లో శనివారం ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. బొడ్రాయిలు గ్రామాలకు మూల స్తంభాలుగా నిలుస్తాయన్నారు. ప్రతీ గ్రామం మధ్యలో ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించుకున్న బొడ్రాయి గ్రామ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో దేశ గురువులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులు స్వతహాగా మరమ్మతులు చేయొద్దు



రైతులకు విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పిస్తున్న డీఈ మల్లిఖార్జున్

హనుమకొండ టౌన్, ఆగస్టు 10: పొలాల దగ్గర రైతులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిన వైర్లకు మరమ్మతులు చేయొద్దని వరంగల్ డీఈ శంకేసి మల్లిఖార్జున్ సూచించారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మామునూర్ సెక్షన్‌లోని తిమ్మాపూర్‌లో పొలాల వద్ద రైతులకు విద్యుత్ సమస్యలపై అవగహన కల్పించారు. పొలాల వద్ద ఎలాంటి సమస్యలున్నా.. స్థానిక లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి తప్ప.. స్వతహాగా మరమ్మతులు చేయొద్దని సూచించారు.

విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా విద్యుత్‌శాఖ దృష్టికి తీసుకరావాలన్నారు. మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదాతో పాటు నష్టాలను నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శంభునిపేట ఏడీఈ సర్వేశ్వర్, ఏఈ సురేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టు యోగికి ప్రెస్‌క్లబ్‌లో ఘన నివాళి



ప్రెస్‌క్లబ్‌లో భౌతిక కాయాలకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

వడ్డెపల్లి, ఆగస్టు 10: హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు యోగి, ఆయన కూతురు ఆద్య భౌతికకాయాలకు జర్నలిస్టులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు యోగిరెడ్డి అలియాస్ యోగి, అతడి కూతురు ఆద్య మృతదేహాలకు ఎంజీఎం ఆస్పత్రిలో శనివారం ఉదయం పోస్టుమార్టం జరిగింది. అనంతరం జర్నలిస్టుల సందర్శనార్థం ఇరువురి భౌతిక కాయాలను ప్రత్యేక వాహనంలో ప్రెస్‌క్లబ్‌కు తీసుకొచ్చారు. పలువురు జర్నలిస్టులు యోగితో పాటు ఆద్య భౌతికకాయాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఎస్ఎంఆర్ స్కూల్ అధినేత వెలగందుల ముక్తీశ్వర్, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇద్దరి మృతికి సంతాప సూచికంగా ప్రెస్‌క్లబ్‌లో మౌనం పాటించారు.

● కాజీపేట: సీనియర్ జర్నలిస్టు యోగి మృతికి సంతాపంగా శనివారం కాజీపేట చౌరస్తాలో కాజీపేట మీడియా పాయింట్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. యోగి, చిన్నారి ఆద్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు యోగితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: జర్నలిస్టు యోగి, అతడి కూతురు ఆద్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యోగి జర్నలిస్టుగా తాను ఎంచుకున్న మార్గంలో అవిశ్రాంతంగా కృషి చేశారని పేర్కొన్నారు. యోగి జీవితం ఇలా అర్ధాంతరంగా ముగియడం బాధాకరమని తెలిపారు.ఒక మంచి విత్రుడిని కోల్పోయానని, అతని మరణం తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు.

ఏకశిల పార్కులో స్వచ్ఛభారత్



ఏకశిలా పార్కులో పరిసరాలను శుభ్రం చేస్తున్న వాకర్స్

బాలసముద్రం, ఆగస్టు 10: హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. 100మంది వాకర్స్ పాల్గొని పార్కులోని పరిసరాలను శుభ్రంచేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాకర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పచ్చిమట్ల ఎల్లాగౌడ్, దశరథ రామ్‌రెడ్డి, వంగ రాజిరెడ్డి, పడాల సోమయ్య, నుంచికాల రవీందర్‌రావు, మావురపు మల్లారెడ్డి, బోనాల వీరస్వామి, దేవా అరవింద్ బాబు, వేల్పుల సారంగపాణి, కుందారపు అరుణ, కామినేని సంధ్యారాణి, రమణారెడ్డి, బిల్లా రాజిరెడ్డి, వెలగం నర్సయ్య, బొల్లెపల్లి సారయ్య, మనోహర్, ఉపేందర్, సీమనాయక్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నాలో పాల్గొన్న బీసీ నేతలు జాజుల శ్రీనివాస్, అరెగంటి నాగరాజు తదితరులు

ఢిల్లీ ఓబీసీ మహాధర్నాకు కేయూ విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కుల గణన చేపట్టాలని ఢిల్లీ అమృతసర్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఓబీసీ మహాధర్నాకు కేయూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం ఓబీసీ మహాధర్నాలో అరెగంటి నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, బీసీల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీలంతా ఒక్కటై చట్టసభల్లో బీసీ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుధగాని మధు, శ్రీకాంత్, రాజ్‌కుమార్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్
రాష్ట్ర అధ్యక్షుడిగా గణపతిరెడ్డి



హసన్‌పర్తి, ఆగస్టు 10: తెలంగాణ రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన పాడి గణపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డిని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంక్రటాంనర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్‌తో పాటు పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుంది



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఆవారి శ్రీనివాస్ అన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని సంఘ కార్యాలయంలో సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆగస్టు 10, 1974న అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో అన్ని సంఘాలకంటే యూటీఎఫ్ ముందుంటుందన్నారు. అనేక ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బి. వెంకట్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు టి.కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, కోశాధికారి డి.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.దామోదర్, నాయకులు రఫూఫ్, కర్ణాకర్, మోజెస్, సత్యనారాయణ, శ్రీనివాస్, భాస్కర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: కేయూ క్యాంపస్‌లోని పాత డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల భవనంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో 10 రోజుల సీఏటీసీ-6వ శిక్షణ క్యాంపును కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామ్ దొర్రై శనివారం కొనసాగించారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు హాజరై ఎన్‌సీసీ క్యాడెట్ల సమావేశంలో మాట్లాడారు. త్రిబుల్ డ్రైవింగ్ నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపవద్దని చెప్పారు. మైనర్లకు డ్రైవింగ్‌కు ఇవ్వద్దని, ఇస్తే ఓనర్లకు శిక్ష తప్పదని చెప్పారు. రాంగ్ రూట్, సిగ్నల్ జంప్‌లకు నూతన చట్టల ప్రకారం శిక్ష పడుతోందని హెచ్చరించారు. క్యాంపును కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామ్ దొర్రై మాట్లాడుతూ.. క్యాంపు ఆగస్టు 14 వరకు సాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సుబేదారి మేజర్ సుహాస్కదం, లెఫ్టినెంట్ గణేశ్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ సబిత, ఫస్ట్ ఆఫీసర్ బాలురెడ్డి, థర్డ్ ఆఫీసర్ శాంతి, జీసీఐ సుజిత, సీతలు, సూపరింటెండెంట్ అరుణ, కుమారస్వామి, సతీశ్, మహేశ్, ఏడుకొండలు, సౌరస్య క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీగా ఎస్టీలకు అవకాశం కల్పించాలి

కేయూ క్యాంపస్, ఆగ స్టు 10: రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీలకు నూతన వైస్ చాన్స్‌లర్ల నియమిస్తున్నారని, ఈ దఫా ఎస్టీ వర్గాలకు చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ట్రైబల్ జేఏసీ జాయింట్ యాక్షన్ కమిటీ కేయూ అధ్యక్షుడు మానాల తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. శనివారం కేయూ న్యూ పీజీ హాస్టల్‌లో జరిగిన ట్రైబల్ స్టూడెంట్ సమావేశంలో తిరుపతి నాయక్ హాజరై మాట్లాడారు. కేయూలో ఇప్పటివరకు ఓసీ, బీసీ, ఎస్సీ వర్గాలకు వీసీలుగా పని చేసే అవకాశం వచ్చిందని ఎస్టీ వర్గాలకు ఇవ్వలేదని అన్నారు. ఈ దఫానైనా ఎస్టీ వర్గాలకు వీసీగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ గిరిజన సంఘం నాయకులు వినోద్ నాయక్, చరణ్ నాయక్, రాజు, లాల్‌సింగ్, నిఖిల్, బహదూర్, ప్రవీణ్, బాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత మృతికి సంతాపం

బాలసముద్రం, ఆగస్టు 10: సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా, కోశాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన డీఎస్ రామచంద్రరావు శనివారం మృతి చెందారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో రామచంద్రరావు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 10: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. గర్మిళ్లపల్లి ఆకేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా వనమాల కనపర్తి గ్రామ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంధ్యారాణికి ఉస్మానియా డాక్టరేట్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10: హనుమకొండలోని టైలర్ స్ట్రీట్‌కు చెందిన బొమ్మగాని సంధ్యారాణికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించించినట్లు ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీ చంద్రిక పర్యవేక్షణలో తయారీ కంపెనీల శ్రామిక శక్తి యొక్క ఉద్యోగ సంతృప్తిపై ఆటోమేషన్ ప్రభావం ఒక అధ్యయనం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రకటించారని తెలిపారు.

ఆదివారం



అలనాటి కథ

మనవాళ్లకు దక్కని గౌరవం

శేషేంద్రతో కలిసి నేను అనేక సాహితీ సమావేశాలకు వెళుతుండేదాన్ని. ఇలాంటి సమావేశాలకు విదేశీ రచయితలు వస్తే... సాధారణంగా అందరి దృష్టి వారిపైనే ఉండేది. మన దేశానికి చెందిన రచయితలకు ఒకింత తక్కువ గౌరవమే లభించేది. విదేశాలలో జరిగిన సమావేశాల్లో ఈ తరహా సమస్యలు ఎదురయ్యేవికావు. మన



దేశంలో నా ఈ అనుభవాలు... అనేక మందికి కూడా ఎదురయి ఉండవచ్చు.

మన దేశంలో ఇటీవల కాలంలో అతి ఎక్కువ మంది రచయితలు పాల్గొనే సాహితీ సమావేశం... 'జైపూర్ లిటరరీ ఫెస్టివల్'. దీనికి దేశవిదేశాల నుంచి రచయితలు వస్తూ ఉంటారు. దీనిని ప్రారంభించక ముందు... అంటే 1980ల్లో భోపాల్‌లో ఈ తరహా ప్రయత్నమే జరిగింది. దీనికి నిర్వాహకుడు ప్రముఖ రచయిత అశోక్ బాజ్‌పేయ్. ఆ సమావేశానికి అనేకమంది రచయితలతో పాటు శేషేంద్రను కూడా ఆహ్వానించారు. అక్కడకు వెళ్లిన దగ్గర నుంచి రకరకాలైన ఇబ్బందులు ఎదురయ్యాయి. మొదటగా మాకు కనీస వసతులు లేని ఒక రూమ్ కేటాయించారు. మా సమస్యను అశోక్ దృష్టికి తీసుకువచ్చాము. కానీ ప్రయోజనం లేకపోయింది. దీంతో మాకు కోపం వచ్చి, అక్కడ వేరే హోటల్‌కు వెళ్లాం. మా దురదృష్టమేమిటంటే అక్కడ కూడా రూమ్‌లు లేవు. తప్పని సరి పరిస్థితుల్లో అక్కడి మేనేజర్ రూమ్ పక్కనే ఉన్న చిన్న గదిలో ఆ రోజు రాత్రి సర్దుకోవాల్సి వచ్చింది.

ఆ మర్నాడు సమావేశం ప్రారంభమయింది. భారతీయ రచయితలకు సంబంధించిన కొన్ని సెషన్స్ ఉన్నా... వాటికి వెళ్లేవారు అతి కొద్ది మందే కనిపించారు. విదేశీ రచయితల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. ఆ రోజు రాత్రి అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అర్జున్‌సింగ్... రచయితలందరికీ ఒక విందు ఏర్పాటు చేశారు. ఆ విందుకు నేను, శేషేంద్ర కూడా వెళ్లాం. వెళ్లిన వెంటనే అక్కడ అర్జున్‌సింగ్ కనిపించారు. ఆయన పక్కనే ఉన్న ఒక నిర్వాహకుడు... 'ఈమె ఇందిరా ధన్‌రాజ్‌గిర్. ఆయన శేషేంద్ర' అని పరిచయం చేశాడు. అర్జున్‌సింగ్ వెంటనే... "హిందూ బెనారస్ యూనివర్సిటీలో నేను చదువుకున్నప్పుడు... ధన్‌రాజ్‌గిర్ హాస్టల్‌లోనే ఉండేవాడిని" అన్నారు. ఇలా కొంత సంభాషణ సాగింది. అర్జున్ సింగ్‌తో సంభాషణ తర్వాత అక్కడున్న నిర్వాహకులకు మాపై గౌరవం పెరిగినట్లు అనిపించింది. మమ్మల్ని విదేశీ ప్రతినిధులు కూర్చునే టేబుల్ దగ్గర కూర్చోబెట్టారు. నా పక్కనే ప్రముఖ ఆంగ్ల రచయిత సర్ స్పెన్సర్ భార్య కూర్చుంది. కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. ఈ లోపు అర్జున్‌సింగ్ రచయితల టేబుల్స్ దగ్గరకు వచ్చి పలకరించటం మొదలుపెట్టారు. అర్జున్ సింగ్‌తో పాటు ఆయన సిబ్బంది... వారితో కెమెరామెన్... ఇలా ఒక గుంపులా కదలటం మొదలుపెట్టారు. భారతీయ రచయితలందరూ ఆయనకు లేచి వినయంతో నమస్కారాలు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం నాకు చాలా ఇబ్బంది కలిగించింది. ఆ మర్నాడు ఉదయం... భారతీయ భాషలకు సంబంధించిన సెషన్స్ ఉన్నాయి. సమావేశ మందిరానికి వెళ్లిన వెంటనే అక్కడ మాకు ప్రముఖ కన్నడ రచయిత గోపాలకృష్ణ అడిగ కనిపించారు. మమ్మల్ని చూసిన వెంటనే ఆయన మా దగ్గరకు వచ్చి... "ఈ రోజు ఉదయం నన్ను ప్రధాని సన్మానిస్తారని చెప్పారు. దాంతో ఉదయాన్నే లేచి వచ్చేశా. అప్పటి నుంచి ఇప్పటిదాకా నాకు కాఫీ ఇచ్చేవారు కూడా లేరు. భారతీయ రచయితగా పుట్టడం కన్నా ఇంగ్లీషు రచయితగా పుడితే ఎక్కువ గౌరవం లభిస్తుందనిపిస్తోంది" అని నిరాశగా అన్నారు. ఆ మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి.

> భారతీయ భాషల్లో అద్భుతమైన సాహిత్యం ఉంది. గొప్ప సాహితీ కారులున్నారు. వీరిలో చాలామందికి ఇతర దేశాల్లో తగినంత పేరు రాలేదు. కారణం... వీరి రచనలు ఇంగ్లీషులోకి అనువాదం కాకపోవటమే. చాలా సందర్భాలలో ఇంగ్లీషు అనువాదాల ద్వారా పేరు వచ్చిన తర్వాతే మన రచయితలకు తగినంత గుర్తింపు లభిస్తోంది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఆయన రచయితగా సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆర్టిస్టుగా మారి, ఎన్నో విభిన్న పాత్రలు పోషించారు. మధ్యలో దర్శకుడు కూడా అయ్యారు. సరస్వతీ కటాక్షం పుష్కలంగా ఉన్న ఆ అదృష్టవంతుడి పేరు.. **తనికెళ్ల భరణి.** ఆయనకు ఇప్పుడు గౌరవ డాక్టరేట్ లభించడంతో నలభై ఏళ్ల సినీ జీవితానికి సార్థకత చేకూరినట్లయింది. ఈ నేపథ్యంలో తనికెళ్ల భరణితో 'నవ్య' ముచ్చట్లు.



సండే సెలబ్రిటీ

అక్షరమే నాకు అన్నం పెట్టింది

ఏ కళాకారుడికైనా ఇటువంటి పురస్కారాలు టానిక్‌లా పనిచేస్తూ ఉత్సాహాన్ని ఇస్తుంటాయి. అయితే డాక్టరేట్ కానీ, లోకనాయక సాహిత్య పురస్కారం కానీ నేను ఊహించనవి. సాహిత్య సేవ అనే పదానికి నేను వ్యతిరేకిని. ఎందుకంటే సాహిత్యానికి కానీ, కళకు కానీ నేనేమీ సేవ చేయలేదు. నాకు అన్నం పెట్టింది అక్షరమే! సాహిత్యాన్ని నమ్ముకుని రచయితగా కొనసాగుతున్నా. దాని ప్రభావమే ఈ డాక్టరేట్ అని నమ్ముతున్నా. అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

మీ కెరీర్‌లో 'ఆట కదరా శివా' అనిపించిన సందర్భాలున్నాయా?

సినిమాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏదన్నా ఉద్యోగం చేసుకుంటూ నాటకాలు ఆడితే చాలనుకున్నా. నా నాటకం చూసి ఓ నిర్మాత రచయితగా అవకాశం ఇవ్వడం ఒక ఆట. సినిమా వాతావరణం నచ్చక నేను వెనక్కి తిరిగి వచ్చేసి మళ్లీ ఉద్యోగం చేసుకోవడం మరో ఆట. నేను తొలిసారిగా రచన చేసిన 'కంచు కవచం' చిత్రంలో డైలాగులు బాగున్నాయని ఓ నిర్మాత భావించి మళ్లీ నన్ను పిలిపించడం ఇంకో ఆట. ఆ సినిమా అయ్యాక ఇక్కడ హిపోక్రసీ ఎక్కువ అని భావించి మళ్లీ వెనక్కి వచ్చేశాను. ఇదో ఇంకో ఆట. ఆ తర్వాత 'లేడీస్ టైలర్' సినిమాకు అవకాశం రావడం, నాకు పేరు రావడంతో ఇక మళ్లీ వెనక్కి తిరిగివచ్చే అవకాశం కలగలేదు. ఇదంతా నేను డిజైన్ చేసింది కాదు. అందుకే అంటుంటాను.. 'ఆట కదరా శివా' అని. ఊహించని అద్భుతం జరిగిందని అనుకోండి. అదీ ఆటే అనుకుంటాను. మా నాన్నగారు మరణించిన కొన్ని రోజులకు ఈవీవీ సత్యనారాయణగారి షూటింగ్‌కు వెళ్లాను. ఆయన నా దగ్గరకు వచ్చి భుజం మీద చెయ్యి వేసి 'ఆట కదరా శివా' అన్నారు. దానిలో ఎంత అర్థం ఉందో మీరే ఊహించండి. నా దృష్టిలో 'ఆట కదరా శివా' అనేది ఒక మాట కాదు.. జీవన మంత్రం.

నలభై ఏళ్ల కెరీర్.. ఎనిమిది వందల చిత్రాలు.. అందులో మూడొందలకు పైగా తండ్రి పాత్రలు.. మీకు రొటీన్‌గా అనిపించలేదా?

దర్శకుడు తేజ తీసిన 'చిత్రం'తో తండ్రి పాత్రలు మొదలయ్యాయి. వంద సినిమాల వరకూ తండ్రి పాత్రలు పరవాలేదనిపించాయి. ఆ తర్వాత కూడా ఆ తరహా పాత్రలే వస్తుండడంతో తండ్రి పాత్రలకే ఫిక్స్ చేసేస్తారేమోనని భయపడి ఇక నేను చెయ్యనయ్యా.. అని చెప్పడం ప్రారంభించాను. అలా ఈ ఏడాది పదకొండు మంది దర్శకులకు చెప్పేశా. వీళ్లలో తమిళ దర్శకుడు మణిరత్నంగారు కూడా ఉన్నారు. ఈ నెల 15న విడుదలవుతున్న 'మిస్టర్ బచ్చన్'లో మాత్రం రవితేజకు తండ్రిగా నటించా. అది రెగ్యులర్‌కు భిన్నమైన రోల్.

మీకు సినిమాలు తగ్గడానికి ఇది కూడా ఒక కారణమా?

అవును. మంచి పాత్రలు, డిఫరెంట్ క్యారెక్టర్లు వస్తే మాత్రమే చేద్దామని నిర్ణయించుకున్నాను. మా ఇంట్లో పెద్ద లైబ్రరీ ఉంది. పుస్తకాలు చదవడం నాకు వ్యసనం. వంట కూడా వచ్చు. సరదాగా అప్పుడప్పుడు వంట కూడా చేస్తుంటాను.

నటన తగ్గించుకొని సినిమాలకు రచన చేసే అవకాశం ఉందా?

నేను రచయితగా 52 చిత్రాలకు రాశాను. రచయితగా ఏమీ సంపాదించుకోలేదు. 'శివ'లో వేషం వెయ్యగానే 'ఇక మీరు పెన్ను మూసుకోవచ్చు' అని రాంగోపాల్ వర్మ చెప్పాడు. 'యమలీల'లో తోట రాముడు పాత్ర బాగా క్లిక్ అయింది. ఆ సినిమా తర్వాత ఒకే ఏడాదిలో 26 సినిమాల్లో నటించా. అప్పట్లో లేదు కానీ ఇప్పుడు రచయితలకు మంచి పారితోషికాలు ఇస్తున్నారు. పెద్ద సినిమాలకు రచన చేసే అవకాశం వస్తే నటుడిగా నాలుగైదు చిత్రాలు వదిలేసైనా రాస్తా. ఇప్పుడు దర్శకులే రచన కూడా చేస్తున్నారు కనుక అది జరగదని అనుకుంటున్నాను. 'కథ బ్రహ్మాండంగా ఉంది, మాటలు రాయడంవల్ల నాకు, ఆ సినిమాకూ ఉపయోగం' అనిపిస్తే తప్పకుండా రాస్తా.

> రంగస్థలం మీద ఒక ప్రయోగం చేయబోతున్నా. అంతకు ముందు ఎప్పుడో రాసిన 'గాలి.. హోరు.. మైదానం' నాటకంలో కొన్ని మార్పులు చేసి 'పంజరంలో ఎలుక' గా పేరు మార్చి ప్రదర్శించబోతున్నా. ఈ ఏడాది సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాను కనుక వచ్చే ఏడాది ఆ నాటకం ప్రదర్శిస్తా. లండన్‌లోని షేక్స్‌పియర్ గ్లోబల్ థియేటర్‌లో ఆ నాటకాన్ని ఆడాలని తెలుగు వాడిగా నా కోరిక. షేక్స్‌పియర్ స్వయంగా అక్కడ నాటకాలు వేశారు. గ్లోబల్ థియేటర్‌తో పాటు లండన్‌లో ఎక్కడెక్కడ ఆ నాటకాన్ని ప్రదర్శించవచ్చో నా మిత్రులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నెల రోజులు లండన్‌లోనే ఉండి కనీసం అర డజను ప్రదర్శనలు ఇవ్వాలని నా ఆలోచన.

'మిథునం' తర్వాత మీరు మెగాఫోన్ పట్టకపోవడానికి కారణం?

పడుతున్నా. ఆ వార్త 'ఆంధ్రజ్యోతి'కే మొదట చెబుతున్నా. నవంబరు నుంచి 'మిధునం' తరహాలో మరో మంచి చిత్రం తీయబోతున్నా.

మణిరత్నం దర్శకత్వంలో మీరు నటిస్తున్నారని తెలిసింది..!

అవును. వాస్తవానికి 'దళపతి' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అయితే అది తండ్రి పాత్ర. నా వయసుకు మించిన పాత్ర. విగ్గు పెట్టుకుని నటిస్తానని చెప్పినా మణిరత్నంగారు ఒప్పుకోలేదు. చివరకు ఆ వేషం అమ్రిష్‌పురి వేశారు. ఇటీవల వచ్చిన 'పొన్నియన్ సెల్వం' తెలుగు వెర్షన్‌కు నాతో డైలాగులు రాయించారు మణిరత్నంగారు. ఆ సినిమాలో జయరామ్ పోషించిన పాత్రకు నాతో డబ్బింగ్ చెప్పించారు. అప్పుడే ఆయన్ని అడిగాను.. 'మీ దర్శకత్వంలో నటించే అవకాశం ఇవ్వండి. అయితే తండ్రి పాత్ర మాత్రం ఇవ్వకండి ప్లీజ్' అని. ప్రస్తుతం కమల్‌గారితో ఆయన తీస్తున్న చిత్రంలో నాకు చాలా పెద్ద వేషం ఇచ్చారు. నెగెటివ్ టచ్ ఉన్న వేషం. ఇప్పటికి 30 రోజులు వర్క్ చేశాను. ఇంకో ఐదు రోజులు చేయాలి.

• వినాయకరావు

'దిక్సూచి' వెబ్ పేజీలో సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/SkrdIXQలో చదవండి.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డాటర్స్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
వరస్ట్ ఎక్స్ ఎవర్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
ఎమిలీ ఇన్ పారిస్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
ది యూనియన్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 16
లవ్ నెక్స్ డోర్	కొరియన్ సిరీస్	ఆగస్టు 17
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
డార్లింగ్	తెలుగు చిత్రం	ఆగస్టు 13
ది టైరాంట్	కొరియన్ సిరీస్	ఆగస్టు 14
అమెజాన్ ప్రైమ్		
నామ్ నమక్ నిషాన్	హిందీ చిత్రం	ఆగస్టు 14
జాక్‌పాట్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 15
కల్కి 2898 ఏ.డి.	తెలుగు చిత్రం	ఆగస్టు 15
సోనీ లివ్		
కౌన్ బనేగా క్రోర్‌పతి 16	రియాలిటీ షో	ఆగస్టు 12
చమక్	హిందీ సిరీస్	ఆగస్టు 16
జీ 5		
మనోరథంగల్	యాంథాలజీ ఫిల్మ్	ఆగస్టు 15
జియో సినిమా		
శేఖర్ హోమ్	హిందీ సిరీస్	ఆగస్టు 14
ఈటీవీ విన్		
వీరాంజనేయులు విహారయాత్ర	తెలుగు చిత్రం	ఆగస్టు 14
ఆహా...		
వీర మారి ఆఫీస్ 2	వెబ్‌సిరీస్	ఆగస్టు 15

బిజినెస్



ప్రముఖ జువెలర్ జోయాలుక్కాస్.. హైదరాబాద్, కొండాపూర్‌లోని షోరూమ్‌లో 'డైమండ్ జువెలరీ షో' ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ గ్రూప్ రీజినల్ మేనేజర్ ఆంటో థామస్, కొండాపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ అభిజిత్ సహా పలువురు కస్టమర్లు పాల్గొన్నారు.

అరబిందో ఫార్మా లాభంలో 61% వృద్ధి

క్యూ1లో రూ.919 కోట్లుగా నమోదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అన్ని మార్కెట్లలో అమ్మకాలు గణనీయంగా పెరగటంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 61.1 శాతం వృద్ధి చెంది రూ.919 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.571 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల ఆదాయం కూడా 10.5 శాతం వృద్ధితో రూ.6,851 కోట్ల నుంచి రూ.7,567 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో కంపెనీకి చెందిన అన్ని వ్యాపార విభాగాలు మంచి పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు. జూన్ త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత వృద్ధి లక్ష్యాలను అందుకోవచ్చని విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,310 ▲	64,450 ▲	88,100 ▲
ముంబై	69,663 ▲	63,811 ▲	80,263 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ

హైదరాబాద్	425	విజయవాడ	450
వరంగల్	427	గోదావరి	446
చిత్తూరు	493	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	93
కర్నూలు	80	నెల్లూరు	93
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్‌కు వాటాలు!

మరో బాంబు పేల్చిన హిండెన్‌బర్గ్



న్యూఢిల్లీ: ఏడాదిన్నర క్రితం అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్..తాజాగా మరో బాంబు పేల్చింది. అదానీ గ్రూప్ అక్రమంగా నిధుల మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ (బెర్ముడా, మారిషస్) ఫండ్లలో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌తో పాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు రహస్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ శనివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన బ్లాగ్‌లో ఆరోపించింది. ఓ ప్రజావేగు (విజిల్ బ్లోయర్) అందించిన పత్రాల ఆధారంగా ఈ ఆరోపణలు చేసింది. బుచ్ దంపతులు ఐపీఈ ప్లస్ ఫండ్ 1లో ఖాతాను 2015 జూన్ 5న సింగపూర్‌లో తెరిచారని, ఈ ఆఫ్‌షోర్ మారిషస్ ఫండ్‌ను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ.. ఇండియా ఇన్ఫోలైన్ (ఐఐఎఫ్ఎల్) ద్వారా తెరిచారని ప్రజావేగు పత్రాలను బట్టి తెలుస్తున్నదని హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయితే, మాధవి పురి బుచ్ సెబీలో చేరకముందు విషయమిది. ఎందుకంటే, బుచ్ 2017లో సెబీలో పర్మినెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలపై సెబీ, బుచ్ స్పందించలేదు. ఐఐఎఫ్ఎల్ ప్రిన్సిపల్ సంతకం చేసిన డిక్లరేషన్ ఆఫ్ ఫండ్స్ ప్రకారం.. విదేశీ ఫండ్లలో వీరి పెట్టుబడి జీతం ద్వారా సమకూరిందని పేర్కొనగా.. దంపతుల మొత్తం ఆస్తి కోటి డాలర్లు (సుమారు రూ.84 కోట్లు)గా ఉండవచ్చని అంచనా వేసింది. సెబీ చైర్‌పర్సన్‌గా తన నియంత్రణ పరిధిలోకి వచ్చే వేలాది మ్యూచువల్ ఫండ్లు ఉండగా.. తాను, తన భర్త మాత్రం అతి తక్కువ ఆస్తులతో కూడిన, హై రిస్క్ ప్రాంతాల్లో ఏర్పాటైన, అదానీ అక్రమ నిధుల మళ్లింపు కుంభకోణంతో సంబంధాలున్న మల్టీ లేయర్డ్ విదేశీ ఫండ్లలో పెట్టుబడి పెట్టారని ప్రజావేగు పత్రాలు తెలుపుతున్నాయంది. ఈ షెల్ కంపెనీల ద్వారానే వినోద్ అదానీ నిధులను మళ్లించి అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించినట్లు హిండెన్‌బర్గ్ గతంలోనే ఆరోపించింది.

ఇంకా చర్యలు తీసుకోనేలేదు..

అదానీ అక్రమాలపై తాము నివేదిక విడుదల చేసి 18 నెలలు అవుతున్నప్పటికీ, అదానీ బహిర్గతం చేయని మారిషస్, ఇతర విదేశీ షెల్ కంపెనీలపై చర్యలు చేపట్టేందుకు సెబీ ఏమాత్రం ఆసక్తి చూపకపోవడం విస్మయం కలిగించిందని హిండెన్‌బర్గ్ తన బ్లాగ్‌లో అభిప్రాయపడింది. అదానీ ఆఫ్‌షోర్ ఫండ్లకు ఎవరు నిధులు సమకూర్చారనే విషయాన్ని సెబీ తన దర్యాప్తు పత్రాల్లో ఖాళీగా ఉంచిందన్న సుప్రీంకోర్టు ఆర్డరు కాపీని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఒకవేళ ఈ విదేశీ ఫండ్ హోల్డర్లను గుర్తించాలనుకుంటే సెబీ చైర్‌పర్సన్‌కు తన ముఖమే తొలుత ప్రతిబింబించేదని తెలిపింది. తమ చీఫ్ గుట్టు విప్పే దర్యాప్తు జరిపేందుకు సెబీ ఇష్టపడకపోవడం తమకు ఆశ్చర్యం కలిగించలేదని హిండెన్‌బర్గ్ పేర్కొంది. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతో పాటు అనుచిత పద్ధతుల్లో గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని 2023 జనవరి 24న విడుదల చేసిన నివేదికలో హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీతో పాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. హిండెన్‌బర్గ్ నివేదికతో స్టాక్ మార్కెట్‌తో పాటు కార్పొరేట్ రంగమూ భారీ కుదుపునకు లోనైంది. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతోపాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

మాధవి పురి బుచ్ గురించి



ఫైనాన్షియల్ రంగంలో తనదైన ముద్ర వేసిన మాధవి 1966లో ముంబైలో జన్మించారు. ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్న మాధవి 1989లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో చేరి తన కెరీర్ ప్రారంభించారు. ఐసీఐసీఐలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఆమె 2009లో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తొలి మహిళా ఎండీ, సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత చైనా, షాంఘైలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కన్సల్టెంట్‌గా, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్‌కు సారథ్యం వహించారు. అనంతరం 2017లో సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 మార్చిలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎవరీ ధవల్ బుచ్: ఐఐటీ ఢిల్లీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ధవల్ బుచ్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్‌తో పాటు అల్వరెజ్ అండ్ మర్సల్‌కు సీనియర్ అడ్వైజర్‌గా సేవలందిస్తున్నారు. అలాగే, గ్లిడాన్ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. గతంలో బుచ్ యూనిలీవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు.

తెలంగాణలో అమరరాజా బ్యాటరీ ప్యాక్ ప్లాంట్ ప్రారంభం

సెల్ తయారీ ప్లాంట్‌కు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ అర్బన్: అమర రాజా గ్రూప్ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లిలో ఏర్పాటు చేస్తున్న బ్యాటరీ ప్యాక్ ప్లాంట్ ఫేజ్ 1ను శనివారం ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్ నిల్వ అవసరాలకు ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లను అసెంబ్లింగ్ చేయనుంది. ఫేజ్ 1 సామర్థ్యం 1.5 గిగావాట్లు కాగా, ప్లాంట్ పూర్తి సామర్థ్యాన్ని దశలవారీగా 5 గిగావాట్లకు విస్తరించనుంది. ఈ గిగా ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే సంస్థ బ్యాటరీ సెల్ తయారీ కోసం కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూపీ)కు శంకుస్థాపన చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికానికల్లా సెల్ తయారీ ప్లాంట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పారిశ్రామిక, ఆటోమోటివ్ బ్యాటరీల తయారీదారైన అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) పూర్తి అనుబంధ విభాగమైన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) ఈ గిగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తోంది. దివిటిపల్లిలో రూ.9,500 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ యూనిట్‌తో పాటు 16 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన లిథియం అయాన్ బ్యాటరీ సెల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయటం తమకు ఎంతో సంతోషంగా ఉందని అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈఎం) చైర్మన్, ఎండీ జయదేవ్ గల్లా అన్నారు. కాగా అమర రాజా గ్రూప్ గతంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

పియాజియోతో ఒప్పందం: అమర రాజా ఈ కార్యక్రమంలోనే పియాజియోతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కూడా కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పియాజియో వెహికిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి అమర రాజా లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ), లిథియం అయాన్ సెల్స్ అభివృద్ధి, సరఫరాతో పాటు పియాజియో త్రిచక్ర వాహనాలకు చార్జర్లు అందించనుంది. ద్విచక్ర వాహనాల కోసం బ్యాటరీ సెల్స్, బ్యాటరీ ప్యాక్‌లను అభివృద్ధి చేయనుంది. అమర రాజా ఈ మధ్యనే ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ ఏథర్‌తోనూ ఒప్పందం కుదుర్చుకుంది. అమర రాజా ఇప్పటికే పియాజియో ఇండియాకు 50,000 ఎన్ఎంసీ లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లను, ఈవీ చార్జర్లను సరఫరా చేసింది. అంతేకాదు, అమర రాజా ఇటీవలి కాలంలో గోషన్ ఇనోబ్యాట్ బ్యాటరీస్‌తోనూ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. కాగా, నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసీ) టెక్నాలజీ కోసం జియాంగ్సు హైస్టార్ బ్యాటరీ మాన్యుఫాక్చరింగ్ కంపెనీతోనూ అమర రాజా ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది.

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ ప్రోత్సాహం

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహం అందిస్తోందని జయదేవ్ అన్నారు. రాష్ట్రంలో ఈ గిగా కారిడార్ ఏర్పాటుకు గత ప్రభుత్వం తమకు కొన్ని పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఆఫర్ చేసిందని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వాటికి కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడు కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయని, ప్రస్తుతం తాము వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలిపారు.

బ్యాంకులూ డిపాజిట్లు పెంచండి

- ప్రజల నుంచి నిధుల సమీకరణకు కొత్త మార్గాలను అన్వేషించండి
- కీలక కార్యకలాపాలపై దృష్టిసారించండి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: బ్యాంకులు డిపాజిట్ల సమీకరణ, రుణ వితరణ వంటి కీలక కార్యకలాపాలపై దృష్టిసారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్బోధించారు. కుటుంబ పొదుపు ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాలు, సాధనాల్లోకి మళ్లుతున్న తరుణంలో ప్రజల నుంచి డిపాజిట్లను ఆకర్షించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని బ్యాంకులకు సూచించారు. ఆర్‌బీఐ కేంద్రం బోర్డుతో శనివారం నిర్వహించిన సంప్రదాయక పోస్ట్ బడ్జెట్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి మీడియాతో మాట్లాడారు. "బ్యాంకులు తమ కీలక వ్యాపార కార్యకలాపాలపై దృష్టిసారించాలని ఆర్‌బీఐతోపాటు కేంద్రం కోరుతున్నాయి. డిపాజిట్ల సమీకరణ, ఆ తర్వాత రుణ వితరణలో దూకుడుగా ఉండాలి" అని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు, రుణాల వృద్ధి మధ్య అంతరం పెరిగిపోయింది. రుణాల వృద్ధికి అనుగుణంగా డిపాజిట్లు పెరగడం లేదు. కాబట్టి, డిపాజిట్ల సేకరణకు ప్రాధాన్యమివ్వాలి. వడ్డీ రేట్ల నిర్వహణ విషయంలో ఆర్‌బీఐ ఇప్పటికే బ్యాంకులకు కొంత స్వేచ్ఛ ఇచ్చింది. తద్వారా బ్యాంకులు డిపాజిట్ రేట్లను మరింత ఆకర్షణీయంగా మార్చాలి. కొత్త ఆర్థిక సాధనాల ద్వారా నిధులు సమీకరించాలన్నారు. బ్యాంకులు సోమరితనాన్ని వీడి, బల్క్ డిపాజిట్లకు బదులు చిన్న పొదుపుదారుల నుంచి డిపాజిట్లు రాబట్టడంపై దృష్టిసారించాలని సీతారామన్ సూచించారు. అది చాలా కష్టమైన పనే అయినప్పటికీ, అదే మిమ్మల్ని పోషిస్తుందన్నారు. ప్రస్తుతం రుణ వృద్ధితో పోలిస్తే డిపాజిట్ల వృద్ధి 3-4 శాతం తక్కువగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఈ అంశాన్ని ఎత్తిచూపడమే తమ ఉద్దేశమని, బ్యాంక్ యాజమాన్యాలకు ఇది ముందుచూపుతో చేసిన హెచ్చరికని ఆయన పేర్కొన్నారు. ఎందుకంటే, అంతరం పెరుగుతూ పోతే, బ్యాంకింగ్ రంగానికిది వ్యవస్థాగత సమస్యగా పరిణమించే ముప్పు ఉందన్నారు. బ్యాంకులు వినూత్న ఆర్థిక పథకాలు, సేవల ద్వారా డిపాజిట్ల సమీకరణను పెంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తమ శాఖలను విస్తృతంగా వినియోగించుకోవాలని ఈ వారం ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటించిన సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సూచించారు.



ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఊయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'

నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ భోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీజే. మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.



'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.














వినేశ్ కేసు..13న తీర్పు



న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్ కేసు తీర్పుపై సస్పెన్స్ మరో రెండు రోజులు కొనసాగనుంది. తనపై అనర్హత వేటును భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (సీఏఎస్)లో సవాలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ ఎదుట శుక్రవారం వాదనలు జరిగాయి. వినేశ్ తరపున ఫ్రెంచ్ లాయర్లు, భారత ఒలింపిక్ సంఘం తరపున హరీశ్ సాల్వే, విధుష్పత్ సింఘానియా, అలాగే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. కాగా..సీఏఎస్ శనివారం తన తీర్పు వెలువరిస్తుందని భావించారు. అయితే ఒలింపిక్స్ ముగిశాక తీర్పు వెల్లడించాలని అడ్‌హాక్ కమిటీ నిర్ణయించినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తెలిపింది. ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు ఆర్బిట్రేటర్ జస్టిస్ అనాబెల్ బెనెట్ తీర్పు వెలువరించనున్నట్టు పేర్కొంది.



వినేశ్‌కు ఒలింపిక్ విజేత ఓదార్పు

నాది '50 గ్రాముల' బాధ

పారిస్: అందివచ్చిన పతకం చేజారడం ఎంత బాధాకరమో తనకు తెలుసునని ఒలింపిక్ చాంపియన్, జపాన్ రెజ్లర్ రీ హిగూచీ భారత స్టార్ వినేశ్ ఫొగట్‌ను ఓదార్చాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల 57కి. ఫ్రీస్టయిల్ రెజ్లింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన 28 ఏళ్ల రీ..రియో విశ్వక్రీడల్లో ఇదే విభాగంలో రజత పతకం నెగ్గాడు. అయితే టోక్యో గేమ్స్‌లో నిర్ణీత బరువుకంటే 50 గ్రాములు అదనంగా ఉండడంతో అనర్హతకు గురయ్యాడు. 'నీ బాధను అర్థం చేసుకోగలను. నాదేమో 50 గ్రాముల బాధ. నీ చుట్టూ ఉన్నవారు ఏమనుకుంటున్నారో అని ఆందోళన చెందవద్దు. జీవితం సాగుతూనే ఉంటుంది. ఎదురు దెబ్బలను తట్టుకొని లేచి నిలవడం ఎంతో గొప్పగా ఉంటుంది. తగిన విశ్రాంతి తీసుకో' అని వినేశ్‌కు హిగూచీ సూచించాడు.

10 గంటలు 4.6 కిలోలు

'ఆపరేషన్ వెయిట్ లాస్'

పతక పోరుకు ముందు బరువు తగ్గిన అమన్



పారిస్: కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉండడంతో వినేశ్ ఫొగట్ పతకం కోల్పోయింది. దాంతో ఆమెతోపాటు యావత్ దేశం తీవ్ర ఆవేదనలో కూరుకుపోయింది. ఈనేపథ్యంలో మరో భారత రెజ్లర్‌కు అలాంటి దుస్థితి ఎదురుకాకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈక్రమంలో అమన్ సెహ్రావత్ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించింది. పురుషుల 57 కిలోల విభాగంలో రీ హిగుచీ (జపాన్)తో సెమీఫైనల్లో అమన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన ఈ బౌట్ అనంతరం సాయంత్రం 6.30 సమయానికి సెహ్రావత్ 61 కిలోల 5 గ్రాముల బరువున్నాడు. దాంతో శుక్రవారం జరిగే కాంస్య పతక పోరు సమయానికి.. అమన్ 10 గంటల్లో 4 కిలోల 5 గ్రాముల బరువు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే..ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా కోచ్‌లు జగ్‌మందర్ సింగ్, వీరేందర్ దహియా 'ఆపరేషన్ వెయిట్ లాస్' మిషన్ చేపట్టారు. అది ఫలించి రెండోరోజు బరువు తూచే సమయానికి సెహ్రావత్ ఏకంగా 4.6 కిలోలు తగ్గి 56.9 కిలోలకు చేరడంతో మొత్తం భారత బృందం ఊపిరి పీల్చుకుంది. ఇక..బరువు తగ్గేందుకు అమన్ ఎలా శ్రమించాడంటే.. కోచ్‌ల సూచన మేరకు తొలుత గంటన్నరపాటు మ్యాట్‌పై కసరత్తులు చేశాడు. ప్రత్యర్థితో తలపడేటప్పుడు తీసుకొనే పొజిషన్లను ఇందులో ప్రాక్టీస్ చేశాడు. తర్వాత గంటపాటు వేడినీటితో స్నానం చేశాడు. అనంతరం జిమ్‌లో 60 నిమిషాలు నిరంతరాయంగా ట్రెడ్‌మిల్ చేశాడు. ఆపై 30 నిమిషాలు అమన్‌కు కోచ్‌లు విశ్రాంతి ఇచ్చారు. తర్వాత..సెషన్‌కు ఐదు నిమిషాల చొప్పున ఐదు సెషన్లపాటు ఆవిరి స్నానం చేయించారు. చివరి ఆవిరి సెషన్ తర్వాత అమన్ బరువు తూస్తే 900 గ్రాములు ఎక్కువగా ఉన్నాడు. దాంతో అతడికి మసాజ్ చేయడంతోపాటు తేలికపాటి జాగింగ్ చేయించారు. అనంతరం సెషన్‌కు 15 నిమిషాల చొప్పున ఐదు సెషన్లు రన్నింగ్ చేయించారు. ఉదయం 4.30కల్లా సెహ్రావత్ బరువు 56.9 కిలోలకు దిగొచ్చింది. అంటే నిర్దేశిత 57 కిలోలకంటే 100 గ్రాములు తక్కువన్నమాట. అప్పటికి కానీ భారత బృందం స్థిమితపడలేదు. ఇన్ని కసరత్తుల నడుమ సెహ్రావత్‌కు గోరు వెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి ఇచ్చారు. అలాగే కొద్దిగా కాఫీ తాగించారు. గురువారం రాత్రంతా అతడు నిద్రపోలేదు. 'అతడి బరువును ప్రతి గంటకూ పరిశీలించాం. ఆ రాత్రేకాదు శుక్రవారం ఉదయం కూడా అమన్ నిద్రపోలేదు' అని కోచ్ దహియా వెల్లడించాడు. 'బరువు తగ్గించడం సాధారణంగా జరిగే ప్రక్రియ. మాకిది అలవాటే. కానీ వినేశ్ ఘటన నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాం' అని దహియా తెలిపాడు. మొత్తంగా తాను, కోచ్‌లు పడిన కష్టాన్ని ప్రతిఫలిస్తూ అమన్ కాంస్య పతకంతో అదరగొట్టాడు.



అయ్యో.. రీతిక

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల ప్రదర్శన ముగిసింది. పది పతకాల లక్ష్యంతో బరిలోకి దిగినా..ఆఖరుకు ఆరింటితోనే సరిపెట్టుకుంది. చివరి రోజు పోటీల్లో పతక ఆశలతో బరిలోకి దిగిన రెజ్లర్ రీతిక హుడా మహిళల 76కేజీ ఫ్రీస్టయిల్ క్వార్టర్స్‌లో ఓడింది. అయితే ప్రీక్వార్టర్స్‌లో ప్రత్యర్థిపై 12-2 తేడాతో నెగ్గిన ఆమె భారత్ నుంచి ఈ విభాగంలో క్వార్టర్స్‌లో ప్రవేశించిన తొలి రెజ్లర్‌గానూ అదుర్స్ అనిపించుకుంది. కానీ, కీలక బౌట్‌లో టాప్ సీడ్ ఐపెరిని ఎంతగా నిలువరించినా అదృష్టం వరించలేదు. ఇక రెపిచేజ్‌పై ఆశలు పెట్టుకున్నా.. సెమీస్‌లో ఐపెరి ఓడడంతో రీతికకు చాన్స్ దక్కలేదు. అటు గోల్ఫర్లు కూడా ఏమాత్రం ప్రభావం చూపలేదు.

పారిస్‌లో ముగిసిన భారత క్రీడాకారుల పోరు

క్వార్టర్స్‌లో పోరాడి ఓడిన రెజ్లర్

నేడే ముగింపు వేడుకలు
రాత్రి 12.30 నుంచి



గట్టి పోటీతో..

పారిస్: పతకంపై ఆశలు రేపిన రెజ్లర్ రీతికా హుడా క్వార్టర్ ఫైనల్స్‌లో పరాజయం పాలైంది. మహిళల 76కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో టాప్ సీడ్ ఐపెరి మెడెట్ (కిర్గిస్థాన్)తో హోరాహోరీగా సాగిన ఈ పోరులో రీతిక మెరుగైన ఆటతీరుతో స్కోరును 1-1తో సమం చేసింది. అయితే కౌంట్ బ్యాక్ నిబంధన ప్రకారం ఐపెరిని విజేతగా ప్రకటించడంతో రీతికకు నిరాశే ఎదురైంది. అయినప్పటికీ రీతిక పతకంపై ఆశలు పెట్టుకుంది. ఎందుకంటే ఐపెరి తన సెమీస్ బౌట్‌లో గెలిస్తే రీతికకు రెపిచేజ్ రౌండ్‌లో ఆడే అవకాశం దక్కేది. కానీ యూఎస్ రెజ్లర్ బ్లేడ్స్ చేతిలో తను ఓడిపోవడంతో రీతిక ఎలిమినేట్ కాక తప్పలేదు. ఓవరాల్‌గా భారత అథ్లెట్లు ఐదు కాంస్యాలు, ఓ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ప్రీక్వార్టర్స్‌లో పూర్తి ఆధిపత్యం

రెజ్లర్ రీతిక మొదట ప్రీక్వార్టర్స్‌లో చెలరేగింది. హంగేరీకి చెందిన బెర్నాడెట్ నాగీపై 12-2 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీ పద్ధతిలో అద్భుత విజయం సాధించింది. తొలి రౌండ్‌లోనే ఆమె 4-0తో 'పట్టు' సాధించింది. రెండో రౌండ్‌లో నాగీ రెండు పాయింట్లు నెగ్గినా.. రీతిక పదేపదే తనను టేక్‌డౌన్ చేయడంతో 12-2తో తిరుగులేని ఆధిక్యం అందుకుంది. దీంతో రెండోరౌండ్ 29 సెకన్లలో ముగుస్తుందనగా రెఫరీ బౌట్‌ను నిలిపేశాడు. రెజ్లింగ్‌లో ఇద్దరి మధ్య పది పాయింట్ల తేడా ఉంటే వెంటనే బౌట్‌ను ఆపేసి టెక్నికల్ సుపీరియారిటీ ప్రకారం ఆధిక్యంలో ఉన్న అథ్లెట్‌ను విజేతగా ప్రకటిస్తారు. దీంతో భారత్ నుంచి 76 కిలోల విభాగంలో తొలిసారి క్వార్టర్స్ చేరిన రెజ్లర్‌గా రీతిక నిలిచింది.

ప్రీక్వార్టర్స్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో రీతిక క్వార్టర్స్ బరిలో నిలిచింది. అటు వరల్డ్ నెంబర్‌వన్ ఐపెరి మెడెట్ ప్రత్యర్థి కావడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. కానీ 22 ఏళ్ల రీతిక మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోకుండా నువ్వా- నేనా? అనే రీతిలో గట్టి పోటీనే ఇచ్చింది. పాయింట్లు కోల్పోకూడదనే పట్టుదల కనిపించడంతో ఎక్కువగా ఇద్దరూ డిఫెన్సివ్ ఆటకే పరిమితమయ్యారు. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించిన ఐపెరి కూడా రీతికపై పైచేయి సాధించలేకపోయింది. తొలి రౌండ్‌లో రీతిక పాయింట్ సాధించగా.. రెండో రౌండ్ ఐపెరి స్కోరును సమం చేసింది. అయితే రీతిక ఎక్కువగా డిఫెన్స్‌కే పరిమితమై ఎటాకింగ్‌కు దిగలేకపోయింది. అటు మరో పాయింట్ కోల్పోకుండా ఐపెరి తన అనుభవంతో రీతికను హెడ్ లాక్ పొజిషన్‌తో అడ్డుకుని ఫలితం సాధించింది.

స్కోరు సమమైనా ఎందుకలా?

క్వార్టర్స్ పోరు 1-1తో సమమైనా రీతిక ఓటమి చెందడం అభిమానులకు ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం ఇద్దరు రెజ్లర్లు సమాన పాయింట్లు సాధిస్తే కౌంట్ బ్యాక్‌ను అమలు చేస్తారు. అంటే.. ఈ ఇద్దరిలో చివరి పాయింట్ ఎవరు సాధిస్తే వారే విజేతగా నిలుస్తారు. ఈ బౌట్‌లో రీతిక మొదట పాయింట్ సాధించగా.. ఆ తర్వాత ఐపెరి స్కోరును సమం చేసింది. ఈ కారణంగా భారత రెజ్లర్‌కు ఓటమి తప్పలేదు. ఈ రూల్ తెలుసు కాబట్టే ఐపెరి వ్యూహాత్మకంగా ఆడి రీతికను అడ్డుకోగలిగింది.



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	37	27	24	88
అమెరికా	35	41	41	117
ఆస్ట్రేలియా	18	18	14	50
జపాన్	16	12	13	41
ఫ్రాన్స్	15	22	22	59
బ్రిటన్	14	20	25	59
కొరియా	13	8	8	29
నెదర్లాండ్స్	13	6	11	30
జర్మనీ	12	10	8	30
ఇటలీ	11	13	15	39
భారత్	0	1	5	6

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

పతక వీరులకు అపూర్వ స్వాగతం

స్వదేశం చేరిన హాకీ జట్టు

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకంతో అదరగొట్టిన భారత హాకీ జట్టుకు స్వదేశంలో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. శనివారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొన్న హర్మన్‌ప్రీత్ సింగ్ సేనపై పూలవర్షం కురిపించిన ఫ్యాన్స్.. డప్పులు మోగిస్తూ, డ్యాన్సులు చేస్తూ ఘనస్వాగతం పలికారు. కాంస్య పతక పోరులో భారత్ 2-1తో స్పెయిన్ ఓడించింది. టోక్యో క్రీడల్లో కూడా టీమిండియా కంచు మోత మోగించింది. అయితే, కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్ కీపర్ శ్రీజేష్.. షూటర్ మను భాకర్‌తో కలసి ముగింపోత్సవంలో పతాకధారిగా వ్యవహరించనున్నాడు. అమిత్ రోహిదాస్, రాజ్‌కుమార్ పాల్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, సంజయ్ కూడా శ్రీజేష్‌తో పాటు ఉండిపోయారు. వీరు కార్యక్రమం ముగిసిన తర్వాత మిగతా భారత అథ్లెట్లతో కలసి స్వదేశానికి చేరుకోనున్నారు. అపూర్వ స్వాగతం ఎంతో ఆనందం కలిగించిందని హర్మన్‌ప్రీత్ చెప్పాడు. భారత హాకీ మళ్లీ గాడినపడిందనే భావన ప్రజల్లో కలిగిందన్నాడు.



అఫ్ఘాన్ అథ్లెట్‌పై అనర్హత



తమ దేశంలో మహిళల దుర్భర పరిస్థితిని విశ్వ క్రీడా వేదికపై ఎలుగెత్తి చాటిన అఫ్ఘాన్ బ్రేక్ డ్యాన్సర్ మనీజా తలాష్‌పై అనర్హత వేటు పడింది. శుక్రవారం జరిగిన బ్రేకింగ్ ఈవెంట్ ప్రీ క్వాలిఫయర్ ఈవెంట్‌లో ఆమె నెదర్లాండ్స్ డ్యాన్సర్ ఇండియా సర్జో చేతిలో ఓడింది. ఆ తర్వాత 'అఫ్ఘాన్ మహిళలకు స్వేచ్ఛ కల్పించాలి' అనే స్లోగన్‌తో కూడిన బ్యానర్‌ను ధరించి కలకలం రేపింది. అయితే ఒలింపిక్ రూల్స్ ప్రకారం క్రీడల్లో రాజకీయ, మతపరమైన నినాదాలను ప్రదర్శించకూడదు. దీంతో క్రమశిక్షణ చర్య కింద తలాష్‌ను డిస్‌క్వాలిఫై చేసినట్టు ప్రపంచ డ్యాన్స్ స్పోర్ట్స్ సమాఖ్య ప్రకటించింది.



అదితి

గోల్ఫ్‌లో నిరాశ


మహిళల వ్యక్తిగత గోల్ఫ్ ఫైనల్లో భారత్ పోరు ముగిసింది. ఆఖరిదైన నాలుగో రౌండ్‌లో అదితి అశోక్ 29వ స్థానంలో నిలవగా.. మరో గోల్ఫర్ దీక్ష దాగర్ 49వ స్థానంతో నిరాశపరిచారు.

కొవిడ్‌తోనే కొట్టేశారు!



లైల్స్

టోక్యో ఒలింపిక్స్‌కు పారిస్ గేమ్స్‌కు ఎంత భేదమో! ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా కారణంగా టోక్యో క్రీడలు ఏడాదిపాటు వాయిదా పడ్డాయి. 2021లో ఆ క్రీడలను అత్యంత కఠినమైన ఆంక్షల నడుమ నిర్వహించారు. ఏ పోటీకి ఫ్యాన్స్‌ను అనుమతించలేదు. ఇకపోతే.. పారిస్‌లోనూ కొవిడ్ కేసులు బయటపడకపోలేదు. కాకపోతే ఆ వ్యాధి ఓ సాధారణ ఫ్లూ స్థాయికి మారడంతో అంతా లైట్‌గా తీసుకున్నారు. అమెరికా స్ప్రింట్ స్టార్ నోవా లైల్స్ కరోనాతోనే 200 మీ. పరుగులో తలపడి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఇంకా.. క్రీడా గ్రామంలో పలు కొవిడ్ కేసులు వెలుగు చూశాయి. కానీ నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలనే సూచన చేశారు తప్పితే ఆంక్షలేమీ విధించలేదు. కాగా..క్రీడా గ్రామంలో 40 మంది అథ్లెట్లకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. స్విమ్మింగ్‌లో రజత పతకం సాధించిన బ్రిటన్ స్టార్ ఆడమ్ పెటీకి కూడా గతవారం కొవిడ్ సోకింది. తమ మహిళా వాటర్ పోలో జట్టులో ఐదుగురు కొవిడ్ బారిన పడ్డారని ఆస్ట్రేలియా ప్రతినిధులు తెలిపారు. అయినా తమ జట్టు ప్రాక్టీస్‌కు అనుమతి లభించిందన్నారు. 'టోక్యోలో కొవిడ్‌ను తీవ్రమైనదిగా భావించాం. కానీ ఇప్పుడు అది సాధారణ ఫ్లూస్థాయికి మారింది. అందువల్ల ఈసారి ఆ వ్యాధికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక సూచనలు చేయలేదు' అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ చీఫ్ థామస్ బాచ్ చెప్పారు.



ఆడమ్ పెటీ



ఇమానె.. పసిడి సాధించె

తాజా ఒలింపిక్స్‌లో అల్జీరియా మహిళా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగ నిర్ధారణపై వచ్చిన విమర్శలు అన్నీఇన్నీ కావు. అసలు ఆమె మహిళే కాదని.. ఓ మగాడిని మహిళల పోటీల్లో ఎలా అనుమతించారంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీపైనా నెట్టింట తీవ్రంగా దాడులు చేశారు. కానీ ఇమానె మాత్రం తన దృష్టంతా లక్ష్యంపైనే ఉంచి ఏకంగా స్వర్ణ పతకమే అందుకుంది. శనివారం మహిళల 66కేజీల ఫైనల్‌లో తను యాంగ్ లియు (చైనా)ను 5-0తో ఓడించి విజేతగా అవతరించింది. అంతేకాదు.. ఇన్నాళ్ల తనలో గూడు కట్టుకున్న ఆవేదనను కూడా వెళ్లగక్కుతూ తాను మహిళనేనంటూ ఎలుగెత్తి చాటింది.



అలా సెలెబ్రేట్ చేసుకొని..

అలీషా న్యూమన్.. కెనడాకు చెందిన ఈ పోల్‌వాల్ట్ భామ పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కొల్లగొట్టింది. అయితే, ఈ 30 ఏళ్ల సుందరి.. పతకం గెలవడం కన్నా, విజయాన్ని సెలెబ్రేట్ చేసుకున్న తీరుతో పాపులర్ అయింది. మూడోస్థానంలో నిలిచి పతకం ఖాయం చేసుకున్న వెంటనే అలీషా.. ఆనందంలో ట్వెర్కింగ్ (మోకాళ్లపై వంగి నడుమును కదిలించడం) స్టయిల్లో సెలెబ్రేట్ చేసుకుంటూ ఫొటోకు పోజిచ్చింది. అసలే అందగత్తె.. అందులోనూ మత్తెక్కించే విధంగా పోజివ్వడంతో ఈ ఫొటో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సాధారణంగా బియాన్స్ నోల్స్, రిహన్నా, షకీరాలాంటి అంతర్జాతీయ పాప్ తారలు మ్యూజిక్ షోస్ చేసేటప్పుడు స్టేజ్‌పై ట్వెర్కింగ్ భంగిమలను ఇస్తుంటారు.

100 హర్డిల్స్ విజేత మసాయ్



మసాయ్ రస్సెల్

పారిస్: అమెరికాకు చెందిన మసాయ్ రస్సెల్.. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఈ ఫొటోఫినిష్‌లో మసాయ్ (12.33సె) సెకనులో వందో వంతు తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన సిరెనా సంబా మయేలా (12.34సె)ను అధిగమించి స్వర్ణం గెల్చుకుంది. జాస్మిన్ కమాచోక్విన్ (ప్యూర్టోరికో) 12.36 సెకన్లతో కాంస్యం సాధించింది. ఇక మహిళల జావెలిన్‌త్రో ఈవెంట్‌లో జపాన్‌కు చెందిన హరుకా కిటగూచి (65.80మీ) పసిడి పతకాన్ని అందుకుంది. వాన్ డిక్ (సౌతాఫ్రికా), ఓగ్రోడినికోవా (చెచియా)లకు రజతకాంస్యాలు లభించాయి.

యమిసికి షాట్‌పుట్ పసిడి: యమిసి ఓగన్‌లియే మహిళల షాట్‌పుట్ స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఆఖరి త్రోలో ఆమె ఇనుప గుండును 20 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచింది. 19.86 మీ. దూరంతో మాడిసన్ లి వెస్సే (న్యూజిలాండ్) రజతం, 19.32 మీ. దూరం విసిరి యవాన్ (చైనా) కాంస్యం సొంతం చేసుకొన్నారు.

వరల్డ్ రికార్డ్ హోల్డర్‌ను ఓడించి: పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ స్వర్ణాన్ని రాయ్ బెంజమిన్ (అమెరికా) గెలుచుకొన్నాడు. ఫైనల్లో బెంజమిన్ 46.46 సెకన్ల టైమింగ్‌తో.. వరల్డ్ రికార్డు సాధించిన కార్స్టెన్ వార్‌హోం (నెదర్లాండ్స్)ను వెనక్కినెట్టి పసిడి పట్టేశాడు. డూస్ శాంటోస్ (బ్రెజిల్) కాంస్యం దక్కించుకొన్నాడు. ఇథోపియా రన్నర్ తమిరత్ టోలా పురుషుల మారథాన్ స్వర్ణాన్ని ఎగరేసుకుపోయాడు. 2 గంటల 6 నిమిషాల 26 సెకన్ల టైమింగ్‌తో అతడు రేస్‌ను పూర్తి చేశాడు. బషీర్ అబ్ది (బెల్జియం) రజతం, బెన్సన్ కిప్రుటో (కెన్యా) కాంస్యం నెగ్గారు.

హాకీ విజేత నెదర్లాండ్స్: పురుషుల టైటిల్ నెగ్గిన నెదర్లాండ్స్ మహిళల హాకీ స్వర్ణాన్ని కూడా సొంతం చేసుకొంది. ఫైనల్లో నెదర్లాండ్స్ 1-1 (3-1)తో చైనాపై గెలిచింది. అర్జెంటీనా కాంస్యం అందుకుంది.

జోర్డాన్‌కు ట్రిపుల్ జంప్ స్వర్ణం: డిఫెండింగ్ చాంప్ పెడ్రొ పిచార్డో (పోలెండ్)ను ఓడించిన స్పెయిన్ అథ్లెట్ జోర్డాన్ డియాజ్ ట్రిపుల్ జంప్ స్వర్ణాన్ని కైవసం చేసుకొన్నాడు.

'ఆరే'సిన లాంగ్



ఒలింపిక్స్‌లో అత్యధికంగా ఆరు స్వర్ణాలు సాధించిన చైనా అథ్లెట్‌గా టేబుల్ టెన్నిస్ ప్లేయర్ మ లాంగ్ రికార్డు సృష్టించాడు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో చైనా 3-0తో స్వీడన్‌పై గెలిచింది. ఈ జట్టులో లాంగ్ సభ్యుడు. 2012 నుంచి అతడు ఒలింపిక్స్‌లో స్వర్ణాలు సాధిస్తూనే ఉన్నాడు. మహిళల టీటీ టీమ్‌లో స్వర్ణం చైనా సొంతమైంది.

పారిస్‌లో నేటి షెడ్యూల్

పురుషుల మారథాన్: ఉ. 11.30.
మహిళల వాలీబాల్: అమెరికా x ఇటలీ (సా. 4.30).
పురుషుల హ్యాండ్‌బాల్: జర్మనీ x డెన్మార్క్ (సా. 5).
పురుషుల బాస్కెట్‌బాల్: ఫ్రాన్స్ x అమెరికా (రాత్రి 7).
(అన్నీ ఫైనల్స్)



ఇదేనా పతకాల నాణ్యత?

ఒలింపిక్స్ పతకం అథ్లెట్లకు వెలకట్టలేని ఆభరణం. ఆ కష్టానికి తగ్గ ఫలితమైన మెడల్‌ను క్రీడాకారులు అపురూపంగా చూసుకుంటారు. అలాంటి పతకాలు నాణ్యంగా లేకపోతే అథ్లెట్లు పడే వేదన అంతా ఇంతాకాదు. యూఎస్ స్కేట్‌బోర్డర్ నియా హస్టన్ చేసిన పోస్ట్‌తో పారిస్ ఒలింపిక్స్ పతకాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 29 ఏళ్ల హస్టన్ పురుషుల స్ట్రీట్ స్కేట్‌బోర్డింగ్‌లో కాంస్యం గెలిచాడు. గతనెల 29న అతడు పతకం అందుకున్నాడు. కానీ కొద్దిరోజులకే అది రంగు మారడంతోపాటు అక్కడక్కడా సొట్టలు తేలిందంటూ అతను పతకాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన నిర్వాహకులు.. హస్టన్‌కు కొత్త పతకాన్ని ఇస్తామని తెలిపారు.

చెబెట్‌కు డబుల్



కెన్యా అథ్లెట్ బీట్రైస్ చెబెట్ పారిస్‌లో అరుదైన డబుల్ సాధించింది. మహిళల 10 వేల మీటర్ల రేస్‌లో చెబెట్ 30 నిమిషాల 43.25 సెకన్ల టైమింగ్‌తో టాప్ నిలిచింది. 5 వేల మీటర్ల ఈవెంట్‌లో కూడా చెబెట్ పసిడి సొంతం చేసుకొంది. నాడియా బటోసెలెట్టి (ఇటలీ) రజతం, సిఫాన్ హసన్ (నెదర్లాండ్స్) కాంస్యం దక్కించుకొన్నారు.

త్వరలో కిడాంబి శ్రీకాంత్ వివాహం!



హైదరాబాద్: స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ త్వరలో ఓ ఇంటివాడు కానున్నాడు. ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ మేనకోడలు శ్రావ్య వర్మ-శ్రీకాంత్ కొంతకాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ శనివారం వెల్లడించాడు. త్వరలో తాము అంతులేని కథను రాసేందుకు సిద్ధమవుతున్నట్టు సోషల్ మీడియాలో తెలిపాడు. శ్రావ్య వర్మ టాలీవుడ్‌లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తోంది.

వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు ముందుకురావాలి

- మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రధానిని కోరా
- సీఎంలతో భేటీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశాను
- నవంబరు 11న విశ్వరూప సభ: మంద కృష్ణ మాదిగ

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు రాష్ట్రాలు ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కోరారు. ఈ విషయంలో రాష్ట్రాలు స్పందించకపోతే సుప్రీం కోర్టు తీర్పును ఉల్లఘించినట్లవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసి ధన్యవాదాలు తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసేలా ఆయా రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ ఉన్న రాష్ట్రాల సీఎంలతో భేటీ నిర్వహించాలని విజ్ఞప్తి చేయగా...ప్రధాని సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్లుగా ఎంతోమంది సహకరించారని, వారిలో ఏపీ సీఎం చంద్రబాబు ముందు వరుసలో ఉంటారని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఏపీలో అమలు చేస్తామని ప్రకటించారని, దానికి కట్టుబడి కేబినెట్‌లో ఆమోదించారని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం వర్గీకరణను అమలు చేస్తామని శాసనసభలోనే ప్రకటించడం హర్షణీయమన్నారు. నవంబరు 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప సభకు వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరినీ ఆహ్వానించి కృతజ్ఞతలు చెబుతామని తెలిపారు.

'సుంకిశాల'ను కప్పి పుచ్చే ప్రయత్నమెందుకు?

- రాహుల్ గాంధీకి కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సుంకిశాల ప్రమాదాన్ని చిన్నదిగా కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు...? దీనికి బాధ్యులు ఎవరో చెప్పండి? అని రాహుల్ గాంధీని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంపై రాహుల్ గాంధీకి 'ఎక్స్' వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. కోట్ల రూపాయల నష్టం జరిగిన తర్వాత కూడా సుంకిశాల ప్రమాదాన్ని చిన్నదిగా చూపించే ప్రయత్నం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. లోపభూయిష్టంగా పనులు చేసిన కాంట్రాక్టింగ్ ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టకుండా తెలంగాణ ప్రభుత్వాన్ని ఎవరు, ఎందుకు ఆపుతున్నారో చెప్పాలని రాహుల్‌గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై నిష్పాక్షికంగా విచారణ జరిగేలా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ఈ ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని ప్రశ్నించారు.

న్యాయ విచారణ చేపట్టాల్సిందే: మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,450 కోట్ల నుంచి రూ. 2,215కోట్లకు ఎందుకు పెంచారని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిలదీశారు. ప్రాజెక్టు పనులు నాణ్యత లోపంతో కొనసాగుతున్నా ఎందుకు పర్యవేక్షించలేదని ప్రశ్నించారు. శనివారం, బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదఘటనపై కాంట్రాక్టు సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని, ఆ సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం న్యాయ విచారణ కోరాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ విమర్శలు

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ నాయకులు కేంద్ర బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. "ఓవైపు... బడ్జెట్‌లో వాళ్ల ఐడియాలని కాపీ కొట్టారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు బడ్జెట్ బాగాలేదని వాళ్లే విమర్శిస్తున్నారు. అంటే వాళ్ల ఐడియాలు బాగోలేవనా..?" అని ప్రశ్నించారు. శనివారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందంటున్న కాంగ్రెస్ నాయకులు, తెలంగాణకూ రూ. 40 వేల కోట్లు ఇప్పటికే ఇచ్చిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటినప్పటికీ... ఆరు నెలల్లో రూ.35 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని విశ్వేశ్వర్‌రెడ్డి వివరించారు. వక్ఫ్ బోర్డు బిల్లు అనేది ముస్లింలకు వ్యతిరేకమంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు వక్ఫ్ బోర్డులను గుప్పిట్లో పెట్టుకుని పేద ముస్లింలకు అందాల్సిన నిధులు అందనివ్వడంలేదని ఆరోపించారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడులు బాధాకరం

- సర్కారు చర్యలు చేపట్టకపోవడం దారుణం: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నా... ప్రభుత్వం కనీస నివారణ చర్యలు చేపట్టకపోవడం దారుణమని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఒక్కరోజే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాల్టీలో దివ్యాంగ చిన్నారిపై కుక్కల దాడి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. వంటి హృదయవిదారక ఘటనలు జరిగినా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయమన్నారు. చిన్నారులపై కుక్కల దాడులు నిత్యకృత్యం అవుతున్నాయని విమర్శించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటాపోటీ!

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. యూత్ కాంగ్రెస్ నాయకులు పలువురు ఈ పదవిని చేజిక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. గత నెలలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా 19 మంది పోటీ పడ్డారు. 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 11 మంది పోటీలో మిగిలారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, అర్వింద్, హరిప్రసాద్, మిట్టపల్లి వెంకటేష్, పొన్నం తరుణ్‌గౌడ్, సామ్రాట్ వంశీ, షేక్ ఖైజర్, శివచరణ్‌రెడ్డి, అంక్షరెడ్డి, థామస్, దీపక్ పోటీ చేస్తున్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ ఓటింగ్‌తో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవులకు ఎంపిక జరుగుతుంది. 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ ఫీజు రూ.50 చెల్లించి ఓటింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఆగస్టు 14 నుంచి సెప్టెంబరు 14 వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

గురుకుల విద్యార్థుల మరణాలు సర్కారు హత్యలే

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె. సంజయ్ ఆరోపించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి సంజయ్ తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏడు నెలల్లో గురుకులాల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారని, సుమారు 500 మంది ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారని చెప్పారు. తన నియోజకవర్గంలోనే ఆరుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ బారినపడ్డారని, అందులో ఇద్దరు చనిపోయారని తెలిపారు. ఈ మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలో సమీక్షలు జరపడం లేదని, విద్యార్థులు జబ్బు పడితే కనీస మందులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలను మూసివేసే కుట్ర జరుగుతోందనే సందేహం కలుగుతోందని ఎమ్మెల్యే సంజయ్ ఆరోపించారు.

రైల్వే లైన్ లేకనే ఉక్కు ఫ్యాక్టరీ రాలేదు

- మాజీ ఎంపీ వినోద్ కుమార్

హైదాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బయ్యారానికి ఉక్కు ఫ్యాక్టరీ రాకపోవడానికి కారణం అక్కడ రైల్వే లైన్ లేకపోవడమేనని మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాండురంగాపురం నుంచి మల్కాన్‌గిరి రైల్వే లైన్ గురించి తెలంగాణ ఓ కోణంలో ఆలోచిస్తే ప్రధాని నరేంద్ర మోదీ మరో కోణంలో ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు.

సుంకిశాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి

రక్షణ గోడ ఎందుకు కూలిందో తేల్చాలి.. ఇళ్ల కోసం ప్రతిపాదనలను రాష్ట్రం పంపలేదు

డిప్యూటీ సీఎంతో మాట్లాడాను.. ఆలస్యమైనా అనుమతి ఇవ్వాలని ప్రధానిని కోరా

వర్గీకరణపై సుప్రీం ఆదేశాలివ్వలేదు.. ఆలోచించమని చెప్పింది: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలని, ప్రాజెక్టులోని రక్షణ గోడ ఎందుకు కూలిందో, లోపం ఎక్కడ జరిగిందో తేల్చాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్'లో భాగంగా శనివారం ఢిల్లీలోని తన నివాసంలో మాతృమూర్తి పేరిట కిషన్ రెడ్డి ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవితంలో అమ్మ తర్వాతే అన్నీ అని, కాబట్టి అమ్మకు గుర్తుగా ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. అమ్మ మనల్ని పెంచి పెద్దచేసినట్టే మనం కూడా మొక్కను అంతే జాగ్రత్తగా పెంచి పెద్దది చేయాలన్నారు. రోజురోజుకూ ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులు తగ్గిపోతున్న తరుణంలో భవిష్యత్తు పెను సవాల్‌గా మారుతోందన్నారు. ఆ తర్వాత విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానాలు చెప్పారు. 'అప్పుడున్న పరిస్థితుల్లో సామాజిక అసమానతలను దృష్టిలో పెట్టుకుని దళిత వర్గానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారు. అంతేతప్ప ఆర్థిక అసమానతల కారణంగా రిజర్వేషన్లు ఇవ్వలేదు. దేశంలో నేటికీ దళితులపై సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉంది. అయినా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆలోచించమని మాత్రమే చెప్పింది తప్ప ఆదేశాలేమీ ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ క్రీమీలేయర్ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడున్న విధానమే కొనసాగుతుంద'ని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర కట్టుబడి ఉందన్నారు. 'దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రం ఇళ్లు మంజూరు చేసింది. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతోంది. కానీ నేటికీ కేంద్రానికి ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదు. నిన్నే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి శ్రీనివాసరెడ్డితో మాట్లాడాను. ఇళ్లకు సంబంధించి తెలంగాణ నుంచి ప్రతిపాదనలు రాలేదని, వెంటనే పంపించాలని సూచించాను. నిన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనూ ప్రధానికి విషయం చెప్పాను. తెలంగాణ నుంచి ప్రతిపాదనలు కాస్త ఆలస్యంగా వచ్చినా అనుమతి ఇవ్వాలని కోరాను. ఆయన తప్పకుండా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చార'ని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు విషయం అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పునకు సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ విలీనం వార్తలను మీడియాలోనే చూశానని, ఇప్పటివరకు అటువంటి చర్చలేమీ జరగలేదన్నారు.

కేటీఆర్‌ను జైలుకు పంపకపోతే యుద్ధమే

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ అరాచకాలెన్నో



- నన్ను, మా కార్యకర్తలను, సీఎం రేవంత్‌నూ వేధించారు
- రేవంత్‌పై నమ్మకం, గౌరముంది.. కేటీఆర్‌ను లోపలేస్తారు
- ఆ నమ్మకం పోతే రాష్ట్రంలో రాజకీయ యుద్ధం తప్పదు
- కేసీఆర్‌ను అరెస్టు చేస్తే బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో సానుభూతి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ
- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చర్చలనేది అంతా ఫేక్ ప్రచారం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నో అక్రమాలకు, అరాచకాలకు పాల్పడ్డారని, సీఎం రేవంత్ గనక కేటీఆర్‌ను జైలుకు పంపించకపోతే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం తప్పదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. "నన్ను, మా కార్యకర్తలను, రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ కార్యకర్తలను నాడు కేటీఆర్ ఎంత ఇబ్బంది పెట్టారో ఎవరూ మరచిపోరు. రేవంత్‌రెడ్డిపై నాకు ఇప్పటికీ గౌరవం ఉంది. ఏ రోజైనా ఆయన కేటీఆర్‌ను లోపల(జైల్లో) వేస్తారన్న నమ్మకం ఉంది. ఆ నమ్మకం పోయిన రోజు తెలంగాణలో రాజకీయ యుద్ధమే" అని సంజయ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటే బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో సానుభూతి వస్తుందని, అందుకే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిజాంను తలపించేలా తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ఒడ్డుకు పడ్డ చేపల్లాగా విలవిలలాడుతున్నారని సంజయ్ ఎద్దేవా చేశారు. శనివారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజాయితీగా పనిచేసే ఐఏఎస్, ఐపీఎస్‌లకు కీలక పోస్టింగులు ఇవ్వడం లేదని, బీఆర్ఎస్ కొంపముంచిన అధికారులనే సీఎం రేవంత్ చేరదీస్తున్నారని సంజయ్ అన్నారు. పైగా కీలక పోస్టుల్లో ఉన్న మంచి అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. అలాగైతే బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ సర్కారుకు తేడా ఏముందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ అని సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీని ఎదుర్కోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసివస్తాయని, ఆ రెండు పార్టీలను ఎదుర్కొనే సత్తా తమకు ఉందని చెప్పారు. కాగా, తమ్ముడి కోసమే రేవంత్ అమెరికా వెళ్లారనడం సరికాదని సంజయ్ ఈ సందర్భంగా అన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేసేప్పుడు హుందాగా వ్యవహరించాలన్నారు. ఢిల్లీలో బీజేపీ నేతలతో బీఆర్ఎస్ చర్చలు జరుపుతోందన్న ప్రచారమంతా ఫేక్ అని సంజయ్ ఈ సందర్భంగా అన్నారు. ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికే బీఆర్ఎస్ ఈ నాటకాలు ఆడుతోందన్నారు. "బీఆర్ఎస్ బహుశా బంగ్లాదేశ్ వెళ్లి అక్కడ ఎవరితోనైనా చర్చలు జరిపిందేమో. బీఆర్ఎస్ అంటే బంగ్లాదేశ్ రాష్ట్ర సమితి" అంటూ ఎద్దేవా చేశారు. ఒకవేళ కవితకు అనారోగ్యం దృష్ట్యా బెయిల్ వస్తే, బీజేపీనే బెయిల్ ఇప్పించిందని అంటారేమోనని సంజయ్ వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగిన ఘటనపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆగమేఘాలపై విచారణ జరిపింది గానీ, సుంకిశాలను ఎందుకు పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ విమర్శపై సంజయ్ స్పందించారు. "మేడిగడ్డపై ఫిర్యాదు వచ్చింది. సుంకిశాలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు" అని చెప్పారు.

వక్ఫ్ భూములను కబ్జా చేసిన మజ్లిస్

పంచాయతీలకు నిధులిచ్చే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని, ఏకగ్రీవ పంచాయతీలకు కూడా ప్రోత్సాహక నిధులివ్వలేదని సంజయ్ అన్నారు. కేంద్ర నిధులతోనే పంచాయతీలు నడుస్తున్నాయని, ఈ విషయాన్ని మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీలే చెబుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల భూముల కొనుగోలు బాధ్యతను కాంగ్రెస్ పార్టీ ఓ నేతకు అప్పగించిందని సంజయ్ ఆరోపించారు. మరోవైపు, గతంలో వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని సంజయ్ అన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే వాస్తవాలన్నీ బయటకు వస్తాయని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో బంగ్లాదేశీయుల సంఖ్యపై నివేదిక కోరినట్లు సంజయ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

బంరుకున్‌దౌల చెరువులోని కట్టడాల కూల్చివేత

- 5 భవనాలు, 30 ప్రహారీగోడలు కూల్చేసిన హైడ్రా
- అడ్డుకోబోయిన ఎమ్మెల్యే, ఇద్దరు కార్పొరేటర్ల అరెస్టు

రాజేంద్రనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పురాతనమైన బంరుకున్‌దౌల చెరువులోని ఆక్రమణలపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఉక్కుపాదం మోపింది. జాతీయ పోలీసు అకాడమీ సమీపంలోని ఈ బంరుకున్‌దౌల చెరువును ఆక్రమించి నిర్మిస్తున్న ఐదు బహుళ అంతస్తుల భవనాలను శనివారం నేలమట్టం చేసింది. 30 వరకు ప్రహరీ గోడలను కూల్చేసింది. అలాగే, ప్లాట్లుగా భూమిని విక్రయించేందుకు ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను తొలగించింది. బంరుకున్‌దౌల చెరువు ముందు భాగంలో ఉన్న ఓ బావి నిజాం నవాబులకు తాగునీరు అందించేదని ప్రచారంలో ఉంది. కానీ, ఈ చెరువు మొత్తం ఆక్రమణకు గురైందని జీహెచ్ఎంసీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా కూల్చివేతలు చేపట్టడమే కాకుండా చెరువు, ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి సుమారు 10 ఎకరాల భూమిని తమ ఆధీనంలోకి తీసుకుంది. కాగా, బంరుకున్‌దౌల చెరువులోని అక్రమ నిర్మాణల కూల్చివేతను అడ్డుకునేందుకు యత్నించిన ఎంఐఎం నేత, బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో పాటు రామ్నాస్‌పుర, దూద్‌బౌళి కార్పొరేటర్లు అబ్దుల్ ఖాదర్, సలీం తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. కూల్చివేత ప్రక్రియ అనంతరం వారిని విడుదల చేశారు.

బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలు కూల్చేస్తాం

చెరువుల బఫర్ జోన్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టిన నిర్మాణాలను చట్టపరంగా కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను చేపట్టేందుకు బిల్డర్లకు సహకరించే అధికారులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువు పరిసరాల్లో ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ఇళ్ల కొనుగోలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తక్కువ ధరకు ఆస్తి లభిస్తుందని నిబంధనలు తెలుసుకోకుండా ముందడుగు వేస్తే నష్టపోతారని తెలిపారు. చెరువుల బఫర్‌జోన్ అంశంలో అనుమానాల నివృత్తికి ప్రజలు హైడ్రా కార్యాలయంలో సంప్రదించవచ్చని చెప్పారు. 90001 13667 నెంబరు వాట్సాప్ చేసి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేయవచ్చని ఏవీ రంగనాథ్ సూచన చేశారు.

పరిహారానికి ముందే చకచకా పనులు

- తుది దశకు సీతారామ ప్రాజెక్టులోని ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం
- తుమ్మల భరోసాతో రైతుల సహకారం
- 15న సీఎం చేతుల మీదుగా సీతారామ పంప్‌హౌస్‌ల ప్రారంభం
- నేడు మోటార్ల ట్రయల్ రన్: ఉత్తమ్



నిర్మాణంలో ఉన్న ఏన్కూరు లింక్ కెనాల్

ఖమ్మం, హైదరాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూసేకరణ ప్రారంభం కాకుండానే ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టులోని ఏన్కూరు లింక్ కెనాల్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. రెండున్నర నెలల క్రితం ప్రారంభమైన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ లింక్ కెనాల్ ద్వారా సీతారామ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన గోదావరి జలాలను సాగర్ కాలువతో అనుసంధానం చేయనున్నారు. నిజానికి ఈ కాలువ పనులు చేపట్టేందుకు రైతుల నుంచి 172 ఎకరాలు సేకరించాల్సి ఉంది. తొలుత తమకు ఎంత పరిహారం ఇస్తారో నిర్ణయించిన తర్వాతే పనులు చేపట్టాలని కొందరు ఆందోళన చేశారు. కానీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారికి భరోసా ఇవ్వడంతో పరిహారం తేలకముందే వారంతా సహకరించారు. దీంతో ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో 9.7 కి.మీ.పొడవున 5.5 మీటర్ల వెడల్పు 15 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహించేలా నిర్మాణ పనులు చేపట్టారు. 16 కల్వర్టులు కూడా పూర్తిచేశారు. మధ్యలో గ్యాస్ పైపులైన్ ఉండడంతో అక్కడ 30మీటర్ల పొడవున భూగర్భంలో కెనాల్ నిర్మాణం చేపడుతున్నారు. కాగా, సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడు పంప్‌హౌస్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 15వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కు మార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవం కంటే ముందు ప్రాజెక్టులోని మూడు పంప్‌హౌస్‌లోని మోటార్లను ఆదివారం ట్రయల్ రన్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ నీటి పారుదల శాఖ అధికారులతో సచివాలయంలో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పంప్‌హౌస్‌ల ప్రారంభం రోజున వైరాలో భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. సీతారామ డీపీఆర్ సీడబ్ల్యూసీ ఆమోదం పొందిందని, మిగిలిన అనుమతులు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టులో ప్యాకేజీ-1, 2కు అవసరమైన భూసేకరణను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ప్రధాన పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీల కోసం కూడా టెండర్లు వేగవంతం చేయాలని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఒడిశా, ఏపీ, తెలంగాణ.. అనుసంధానం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. తొలుత ప్రతిపాదించిన మల్కాన్‌గిరి-భద్రాచలం రైల్వే లైన్ పొడవు 147.5 కిలోమీటర్లు కాగా, దాన్ని మరో 26.1 కిలోమీటర్లు పెంచి పాండురంగాపురం వరకు పొడిగించామని తెలిపారు. తద్వారా ఈ లైన్‌ను మెయిన్ రైల్ లైన్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. జునాగఢ్(ఒడిశా) - మల్కాన్‌గిరి మధ్య చేపట్టిన రైల్వే లైన్ ఇప్పటికే నిర్మాణంలో ఉన్నదని, ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించిన మల్కాన్‌గిరి-పాండురంగాపురం రైల్వే లైన్ పూర్తయితే ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌కు బాటలు పడతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య ప్రజల రాకపోకలు పెరుగుతాయని, వ్యవసాయం, వాణిజ్యం, విద్య, పర్యాటకం, ఆరోగ్య సంరక్షణ వంటి అనేక రంగాల్లో వృద్ధి సాధించడానికి దోహదపడుతుందని చెప్పారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అల్యూమినియం, స్టీల్ ఫ్యాక్టరీల ఉత్పత్తులను ఏపీలోని పోర్టులకు తరలించడానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఏపీలోని కృష్ణపట్నం, మచిలీపట్నం పోర్టులతోపాటు నూతనంగా నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టు నుంచీ సరుకు రవాణాను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. ఒడిశా నుంచి హైదరాబాద్, విజయవాడకు నేరుగా కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నేషనల్ వాటర్ వే-5తో భవిష్యత్తులో ఈ రైల్వే ప్రాజెక్టును అనుసంధానించి మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్‌ను అభివృద్ధి చేసే అవకాశం ఉందని వెల్లడించారు.



బొగ్గు రవాణాకు అనుకూలంగా: వైష్ణవ్

కొత్త రైల్వే ప్రాజెక్టుతో తెలుగు రాష్ట్రాలకు ఎంతో మేలు జరుగుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసన్‌సోల్ (బెంగాల్)- వరంగల్(తెలంగాణ)ను కలిపేలా సరికొత్త కారిడార్ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జునాగఢ్ - మల్కాన్‌గిరి, మల్కాన్‌గిరి - పాండురంగాపురం రైల్వే లైన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి (మొత్తం 290కిలోమీటర్లు) రూ.7,383 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లోని విద్యుత్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. తెలంగాణలోని సింగరేణి బొగ్గును ఎగుమతి చేయడానికీ దోహదపడుతుందని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా భద్రాచలం వద్ద గోదావరి నదిపై రైల్వే బ్రిడ్జి నిర్మిస్తామని వెల్లడించారు. సముద్ర తీర ప్రాంతాల్లో తుఫాన్లు ఏర్పడినప్పుడు ఇది ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కాగా, విశాఖ రైల్వే జోన్‌పై సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గత ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నీరు నిలిచే అవకాశం ఉన్నందున మరో స్థలం కేటాయింపుపై చర్చిస్తున్నామని చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తరచూ తమతో మాట్లాడుతున్నారని స్పష్టం చేశారు. హౌరా-చెన్నై కారిడార్ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించామని అన్నారు. విజయనగరం వరకు 3వ లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపామని, మొత్తంగా 4 లైన్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదం

ఏపీలోని తూర్పు గోదావరి, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంతోపాటు ఒడిశాలోని పలు జిల్లాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి పాండురంగాపురం- మల్కాన్‌గిరి రైల్వే లైన్ దోహదం చేస్తుందని, ఉత్తర, తూర్పు భారతదేశానికి అదనపు రైలు కారిడార్‌గా ఉపయోగపడుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. నూతన రైల్వే లైన్ మంజూరు నేపథ్యంలో రైల్‌నిలయంలో సీనియర్ అధికారులతో కలిసి అరుణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విస్తరణకు ఈ లైన్ తోడ్పడుతుందన్నారు. ఒడిశాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల గుండా సాగే రైల్వే లైన్‌తో బస్తర్ ప్రాంతం నుంచి తెలంగాణ చేరుకోవడానికి 124 కి.మీ దూరం తగ్గుతుందని వివరించారు.

పీడీ యాక్ట్ పెడతామన్నా.. అదే బరితెగింపు!

యథేచ్ఛగా ఇసుక దందా..ఒక వే బిల్లుతో నాలుగైదు ట్రిప్పుల తరలింపు

ములుగులో టన్ను ఇసుక ధర రూ.1300 పైనే.. అక్రమాలకు సహకరిస్తున్న టీజీఎండీసీ అధికారి



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక అక్రమార్కుల దందా ఆగడం లేదు. ఇసుక తరలించే వాహనదారులతో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఇటీవలే సమావేశమయ్యారు. ఇసుక రవాణాలో అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇంత చేసినా.. రాష్ట్రంలో ఇసుక దందాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. వర్షాల వల్ల ఇసుక రీచ్‌లు మూతపడడం, రీచ్‌ల నుంచి ఉన్న దారులు దెబ్బతినడం, గోదావరిలో వరద రావడం వంటి కారణాలతో నెల రోజులుగా ఇసుక తవ్వకాలు గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో రోజూవారీగా 60వేల టన్నుల ఇసుక అవసరం ఉండగా.. ప్రస్తుతం అందులో సగం కూడా అందుబాటులో లేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొంత మంది ఇసుకను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిలువరించాల్సిన అధికారులు.. ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక దందా జోరుగా సాగుతోంది. టీజీఎండీసీలోని ఓ కీలక అధికారి ఈ అక్రమాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మంజీరా నుంచి హైదరాబాద్‌లోని ఏయే సెంటర్లకు లారీలు వెళ్లాలన్నదీ ఆయనే నిర్ణయిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని బిచ్కుంద, బీర్కూర్ ఇసుక రీచ్‌లు అక్రమాలకు అడ్డాలుగా మారాయి. అక్కడ ట్రాక్టర్ ఇసుకకు వేబిల్లు రూ.900ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో రూ.5000కు విక్రయిస్తున్నారు. ఒక ట్రిప్ కోసం వేబిల్లు తీసుకుని రోజులో నాలుగు, అయిదు ట్రిప్పులు తరలిస్తున్నారు. మరోవైపు.. బాన్సువాడ సమీపంలని కప్పలవాగు, పెదవాగు పరిధిలోనూ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ములుగు జిల్లాలోని మంగపేట, వాజేడు, వెంకటాపురం, ఏటూరు నాగారం మండలాల పరిధిలోని ఇసుక రీచ్‌ల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ మొన్నటిదాకా టన్నుకు రూ.900వసూలు చేస్తుండగా.. ఇప్పుడు రూ.1300పైనే తీసుకుంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు. టీజీఎండీసీ పర్యవేక్షణ లేకపోవడం, తనిఖీలు చేపట్టకపోవడంతో ఇసుక దందాకు అడ్డుకట్ట పడే పరిస్థితి లేకుండా పోయింది. టీజీఎండీసీ ధరల ప్రకారం రీచ్ వద్ద టన్ను ఇసుక రూ.411మాత్రమే. కానీ, బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రూ.600 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. ఇక, హైదరాబాద్ లోనైతే టన్ను రూ.3000 నుంచి రూ.4000 మధ్య అమ్ముతున్నారు.

సమాచారం ఇస్తే కేసులు పెడతాం

ఇసుకను అక్రమంగా విక్రయించే వారిని ఇటీవల పిలిపించి హెచ్చరించాం. పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని చెప్పాం. అధిక ధరలకు ఇసుక అమ్మకాలు చేసే వారిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే అధికారులను ఉపేక్షించేది లేదు. ఖనిజాభివృద్ధి సంస్థకు ఫిర్యాదు చేస్తే కేసులు పెడతాం.

- ఈరవత్రి అనిల్ కుమార్, టీజీఎండీసీ చైర్మన్

ఫైలేరియా, నులిపురుగుల నివారణపై దృష్టి

» మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆయుష్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి (స్వతంత్ర) ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కార్యాలయం నుంచి పాల్గొని రాష్ట్రంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ తెలంగాణలో ఫైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలలో 14 ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 2600 మంది సిబ్బందిని భాగస్వామ్యం చేశామని, 2522 మంది మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో ఐవర్ మెక్టిన్ మాత్రలను అందజేస్తారని వివరించారు. అనంతరం ఫైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలపై రూపొందించిన అవగాహన కరపత్రాలను, బ్రోచర్లను ఆవిష్కరించారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రారంభంలో భాగంగా కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌తో పాటు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ఐవర్ మెక్టిన్ మాత్రలను వేసుకున్నారు.

మూడో విడత రుణ మాఫీకి నిధులు సిద్ధం!

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువుకల్లా రుణ మాఫీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర సర్కారు అందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంపై దృష్టిసారించింది. ఈమేరకు మూడో విడత రుణ మాఫీ కోసం నిధులను సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు అప్పు ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేసింది. మూడో విడతలో మరో 6 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ.6,000 కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మూడో విడత రుణ మాఫీని 15న అమలు చేయనున్నట్టు సర్కారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన నిధులను సమకూర్చుకుంటోంది. ఈ నెల 6న బహిరంగ మార్కెట్ నుంచి ప్రభుత్వం రూ.3,000 కోట్ల అప్పును సేకరించింది. తాజాగా మరో రూ.3,000 కోట్ల అప్పు కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఇండెంట్ పెట్టింది. 11 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 14 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 21 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్ల ఈ రుణాన్ని తీసుకోనుంది. ఈ నెల 13న ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ అప్పును తీసుకుంటుంది. దీంతో ఆగస్టు 15నాటికి రూ.6,000 కోట్లు సిద్ధంమవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేంద్ర సాయం కోసం ప్రాజెక్టుల వివరాలివ్వండి

» అధికారులకు నీటి పారుదల శాఖ లేఖలు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ), ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద సాయం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడానికి వీలుగా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని రాష్ట్రప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రాజెక్టుల సమగ్ర వివరాలు అందించాలని కోరుతూ 19 మంది చీఫ్ ఇంజనీర్లకు లేఖలు రాసింది. రాష్ట్రంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, సీతారామ, చిన్నకాళేశ్వరం, దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, రాజీవ్ భీమా వంటి 24 భారీ ప్రాజెక్టులు, 7 మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటికి కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని అన్ని డైరెక్టరేట్ల క్లియరెన్స్ లభిస్తే... టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) అనుమతి తీసుకున్నాక... కేంద్ర సహాయం ప్రత్యేకంగా పొందాలంటే ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ విధిగా తీసుకోవాలి.. దాంతో ఈ ప్రాజెక్టుల వివరాలన్నీ తీసుకొని, ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ అనంతరం ఏఐబీపీ-పీఎంకేఎస్‌వై సహాయం తీసుకోవాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దాంతో 19 మంది చీఫ్ ఇంజనీర్లకు ప్రాజెక్టుల సమగ్ర వివరాలు తక్షణం అందించాలని ప్రభుత్వం అధికారులను నిర్దేశించింది.

కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేయండి

» కేంద్రానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి.. సానుకూల స్పందన

ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ సెంటర్లను మంజూరు చేయాలని కేంద్రానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. శనివారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్ని రాష్ట్రాల మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో మహిళా శిశు సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, ఎదురవుతున్న సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 15 లక్షల మంది చిన్నారులకు, 3 లక్షలకు పైగా గర్భిణీ, బాలింతలకు సేవలందిస్తున్నట్లు వివరించారు. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త సెంటర్లు అవసరమని, వాటిని మంజూరు చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సీతక్క విజ్ఞప్తి కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి సానుకూలంగా స్పందించారు. కొత్త సెంటర్లను ఇచ్చే విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశాలకై ఈ నెల 12 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్‌సెట్-24 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినిలు ఆన్‌లైన్‌లో mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సీట్లు సాధించిన వారికి కాలేజీ హాస్టళ్లలోనే వసతి కల్పిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ఏమైనా సందేహాలుంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

దేశంలో మెడికల్ కాలేజీలు 735

» వాటిలో 1,12,312 ఎంబీబీఎస్ సీట్లు

» గత ఏడాది కంటే 29 కళాశాలలు, 3,272 సీట్లు పెరిగినట్టు కేంద్రం వెల్లడి

» 60 కళాశాలలతో 5వ స్థానంలో తెలంగాణ

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో దేశంలో కొత్తగా 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. వీటిలో అదనంగా 3,272 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 735 వైద్య విద్య కళాశాలలు అందుబాటులో ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. అందులో 1,12,312 సీట్లు ఉన్నాయని పేర్కొంది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల వివరాలను రాష్ట్రాల వారీగా పార్లమెంట్‌కు నివేదించింది. అత్యధిక వైద్య కళాశాలలు ఉన్న రాష్ట్రంగా తమిళనాడు నిలవగా.. ఎంబీబీఎస్ సీట్ల పరంగా కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. తమిళనాడులో గత ఏడాది 74 మెడికల్ కాలేజీలు ఉండగా తాజాగా ఆ సంఖ్య 77కు పెరిగింది. కర్ణాటకలో ఇప్పటికే 73 ఉండగా మరో మూడు ఏర్పాటయ్యాయి. 72 కాలేజీలతో ఉత్తరప్రదేశ్, 70 కాలేజీలతో మహారాష్ట్ర వరుసగా 3, 4 స్థానాల్లో నిలిచాయి. గత ఏడాది ఆ రెండూ రాష్ట్రాల్లో 68 కాలేజీల చొప్పున ఉండడంతో సమానంగా నిలిచాయి. ఈ ఏడాది వాటి స్థానాల్లో మార్పు వచ్చింది. నిరుడు నాలుగో స్థానంలో ఉన్న తెలంగాణ ఈ ఏడాది ఐదో స్థానానికి పడిపోయింది. తెలంగాణలో గత ఏడాది 56 మెడికల్ కాలేజీలు ఉండగా వాటి సంఖ్య 60కు చేరింది. గుజరాత్ 40, ఆంధ్రప్రదేశ్ 37, రాజస్థాన్ 37, పశ్చిమబెంగాల్ 36, కేరళ 34, మధ్యప్రదేశ్ 28 కాలేజీలతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. 5 దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు, కాలేజీలు ఉన్నాయి. గతేడాది 270 కాలేజీలు ఉండగా వాటి సంఖ్య 281కు పెరిగింది. ఇది దేశంలోని మొత్తం కాలేజీల్లో 38 శాతం. మొత్తం 44,270 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇది మొత్తం సీట్లలో 39 శాతం. కర్ణాటక రాష్ట్రంలో అత్యధికంగా 12,345 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఆ తర్వాత తమిళనాడులో 11,900, మహారాష్ట్రలో 10,945, ఉత్తరప్రదేశ్‌లో 10,525, తెలంగాణలో 8,690 ఉన్నాయి.

మళ్లీ రేవంత్‌తో భేటీ!

తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి

ఏపీలో ఐదేళ్లు విధ్వంసం జరిగిందని ఆవేదన



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అవసరమైతే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి భేటీ అవుతానని ప్రకటించారు. తెలంగాణలో త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని చెప్పారు. శనివారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర ముఖ్యనేతలతో సమావేశమయ్యారు.పార్టీ సభ్యత్వ నమోదు, కింది స్థాయి నుంచి నాయకత్వాన్ని తయారు చేయడం తదితర అంశాలపై చర్చించారు. పార్టీ బలోపేతంపై నాయకుల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2023లో ప్రత్యేక రాజకీయ పరిస్థితుల వల్ల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే పద్ధతిని లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించామన్నారు. ఇక్కడి మెజారిటీ ప్రజలు, పార్టీ అభిమానులు ఏపీకి వచ్చి ఎన్నికల్లో పనిచేయడంతోనే భారీ మెజారిటీతో గెలిచామని వివరించారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కూటమితో కలిసి 20 సీట్లు గెలిచామని, నాడు పార్టీకి 22 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. 2019 ఎన్నికల తర్వాత ఏపీలో ఐదేళ్ల పాటు టీడీపీ ఎన్నడూ లేనంతగా ఇబ్బందులు ఎదుర్కొందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా క్షేత్రస్థాయిలో పోరాడడం వల్లే తాజా ఎన్నికల్లో అఖండ విజయం సొంతమైందని చెప్పారు. తెలంగాణలో 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్నవారు ఉన్నారన్నారు. ఇక్కడ పార్టీని మళ్లీ శక్తిమంతం చేసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుపై శ్రద్ధ పెట్టాలన్నారు. దానివల్ల సుస్థిరమైన నాయకత్వం వస్తుందని చెప్పారు. తెలంగాణలో పార్టీకి పునర్వైభవం రావాలన్నారు. కార్యకర్తల నుంచి నాయకత్వాన్ని తయారు చేసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన విధానాలను రాజశేఖర్‌రెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి వరకు కొనసాగిస్తుండగా.. ఏపీలో మాత్రం గడిచిన ఐదేళ్లు విధ్వంసం జరిగిందని చంద్రబాబు చెప్పారు.

తెలంగాణకు స్టాన్‌ఫర్డ్!

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ ప్రతినిధులతో పలు అంశాలపై చర్చలు జరిపింది. ఆరోగ్య సంరక్షణలో ఆవిష్కరణలు, విద్య నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా సమాలోచనలు చేసింది. కొత్తగా నెలకొల్పనున్న స్కిల్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీల్లో భాగస్వామ్యం కావాలని, తెలంగాణలో కేంద్రం ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫర్డ్ బయో డిజైన్ అధికారులను సీఎం రేవంత్ ఆహ్వానించారు. ఉమ్మడి పరిశోధనలు నిర్వహిస్తూ ఆధునాతన పరిజ్ఞానాన్ని పంచుకోవాలని ప్రతిపాదించారు. సానుకూలంగా స్పందించిన స్టాన్‌ఫర్డ్ ప్రతినిధులు.. వైద్య పరికరాల విద్య, ఆవిష్కరణలకు మద్దతు ఉంటుందని తెలుపుతూ సీఎం రేవంత్‌కు లేఖ అందజేశారు. భారీ వైద్య పరికరాల పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర సర్కారు చొరవ ఎందరికో ఉపాధి చూపుతుందని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించడం అభినందనీయమన్నారు. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్టాన్‌ఫర్డ్ వంటి ప్రపంచ స్థాయి వర్సిటీ భాగస్వామ్యంతో ఆరోగ్య సంరక్షణ రంగంలో తెలంగాణ యువతకు ఆధునిక నైపుణ్యం, పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సీఎం తెలిపారు. ఇది తెలంగాణ యువత భవిష్యత్తుకు కొత్త బాటలు వేస్తుందని అన్నారు. పరిశ్రమలు, ఆవిష్కరణల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్నామని వివరించారు. తెలంగాణ-స్టాన్‌ఫర్డ్ భాగస్వామ్యం ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగానికి ఉపయోగకరం అని.. శాటిలైట్ సెంటర్ ఏర్పాటునూ పరిశీలించాలని కోరారు. స్టాన్‌ఫర్డ్ బయో డిజైన్ సెంటర్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే నైపుణ్యాభివృద్ధిలో తమ ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఇది తెలంగాణకే కాక యావత్ ప్రపంచానికి ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.



ప్రపంచ ప్రఖ్యాత బిజినెస్ కన్సల్టెంట్, రచయిత, ఉపన్యాసకర్త ప్రొఫెసర్ రామ్‌చరణ్‌తో సీఎం రేవంత్

మా లక్ష్యం నెరవేరుతుంది: శ్రీధర్‌బాబు

స్టాన్‌ఫర్డ్ సెంటర్‌తో.. స్కిల్, లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీల లక్ష్యం నెరవేరుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ పరిశ్రమల వృద్ధికి మరో ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ బృందం కాలిఫోర్నియా మౌంటైన్ వ్యూలో ఉన్న గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో టెక్నాలజీ వినియోగం, తెలంగాణలో సాంకేతిక సేవల విస్తృతి, ఏఐ సిటీ నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు తదితర ప్రాజెక్టుల్లో భాగస్వామ్యంపై గూగుల్ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. గూగుల్ సిబ్బందితో టెక్నాలజీ, ఏఐ, స్కిల్స్ తదితర అంశాలపై ముచ్చటించింది.

జొయిటిస్, మోనార్క్ విస్తరణ..

జంతు ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రముఖ సంస్థగా పేరుపొందిన జొయిటిస్.. హైదరాబాద్‌లో వచ్చే సెప్టెంబర్ నుంచి సామర్థ్య కేంద్రం (క్యాపబులిటీ సెంటర్)ను విస్తరించాలని నిర్ణయించింది. అమెరికాలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన సంస్థ ప్రతినిధుల బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. జొయిటిస్ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం.. కొత్త ఆవిష్కరణలు, వ్యాపార వృద్ధికి తెలంగాణలో అపార అవకాశాలున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడతాయన్నారు. భవిష్యత్ టెక్నాలజీలో జొయిటిస్ రంగప్రవేశం హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తెస్తుందని తెలిపారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. భారత్‌లో తమ సంస్థ విస్తరణకు హైదరాబాద్ అనువైనదని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం సంతోషంగా ఉందని జొయిటిస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్బాగ్ తెలిపారు. తెలంగాణలో ఉన్న ప్రపంచస్థాయి ప్రతిభావనరులను సద్వినియోగం చేసుకుంటామని జొయిటిస్ ఇండియా సెంటర్ ఉపాధ్యక్షుడు అనిల్ రాఘవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తమ పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సెంటర్‌ను విస్తరించే అంశంపై సీఎం రేవంత్ బృందానికి మోనార్క్ ట్రాక్టర్స్ ప్రతినిధులు లేఖ అందజేశారు. అమెరికాలో రేవంత్‌ను మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ప్రతినిధులు కలిశారు. అనంతరం హైదరాబాద్‌లో ఆర్అండ్‌డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అధునాతన, పర్యావరణ అనుకూల సంస్థలను ఆకర్షించడంపై దృష్టిసారించామని, మోనార్క్ ట్రాక్టర్స్‌ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. స్వయంప్రతిపత్తి, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని, ఆ విజన్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ భాగమై రాష్ట్రంలో తమ ఉనికిని విస్తరించుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో కార్యకలాపాలపై చర్చించేందుకు రేవంత్ బృందాన్ని కలవడం సంతోషంగా ఉందని మోనార్క్ ట్రాక్టర్స్ సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు.

కన్సల్టెంట్ రామ్‌చరణ్‌కు ప్రశంసలు

గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం ఉద్వేగభరితంగా ఉందని సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. కాలిఫోర్నియాలో ప్రపంచ ప్రఖ్యాత బిజినెస్ కన్సల్టెంట్, రచయిత, ఉపన్యాసకర్త ప్రొఫెసర్ రామ్‌చరణ్‌తో భేటీ పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక రంగంపై 30 పుస్తకాలకు పైగా రచించి, తన శిక్షణ ద్వారా ప్రపంచంలోని డజనుకు పైగా దిగ్గజ కంపెనీలకు సీఈవోలను అందించిన ఘనత రామ్ చరణ్‌కు దక్కుతుందని కొనియాడారు.

'పంజాగుట్ట' తరహాలో సీసీఎస్ ప్రక్షాళన

» కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు 81 మంది హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్!

» మరో 16 మందికి స్థానచలనం!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వరుస ఏసీబీ దాడులు, ఇటీవల అవినీతి ఆరోపణలతో ప్రతిష్ఠ మసకబారుతున్న సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ప్రక్షాళనకు నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై ర్యాంకు వరకు 81 మందిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మరో 16 మంది కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారులను సీసీఎస్ నుంచి వేరే విభాగాలకు బదిలీ చేశారు. ఇటీవల పంజాగుట్ట పోలీస్ స్టేషన్ తరహాలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఇంతమంది సిబ్బందిని మార్చడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. సంచలన కేసులను ఛేదించిన సీసీఎస్ ప్రతిష్ఠ ఇటీవల కొందరు అధికారుల తీరువల్ల మసకబారింది. సాహితీ ఇన్‌ఫ్రా కేసు దర్యాప్తులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఏసీపీని ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం, కొద్దిరోజులకే మరో ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ చిక్కడం సంచలనం సృష్టించాయి. దాంతో సీసీఎస్‌లో అవినీతి రాజ్యమేలుతున్నట్లు ఆరోపణలు రావడంతో సీపీ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అంతర్గత విచారణ జరిపించిన సీపీ.. పంజాగుట్ట తరహాలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై వరకు క్షేత్రస్థాయి సిబ్బందిని అక్కడి నుంచి మార్చారు. వారిలో అవినీతి ఆరోపణలు ఉన్న సిబ్బందితో పాటు, లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న వారూ ఉన్నట్లు తెలిసింది.

సిటీలో 48 మంది ఇన్‌స్పెక్టర్లు, 71 మంది ఎస్సైల బదిలీ

హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లో 48 ఇన్‌స్పెక్టర్లు, 71 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మరో 10 మంది ఎస్సైలను తాత్కాలికంగా సీసీఎస్‌కు అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆ మందులతో 'కాలం చెల్లినట్లే'!

రోగుల ప్రాణాలతో వైద్య శాఖ చెలగాటం

గడువు ముగిసిన ఔషధాలపై నిర్లక్ష్యం

సకాలంలో వాటిని వెనక్కి పంపని వైనం

ఎక్స్‌పైరీ మందులతో రూ.390 కోట్ల నష్టం

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో కాలం చెల్లిన మందులు నిల్వ ఉంటున్నాయి. వైద్య సిబ్బంది అలాంటి ఔషధాలను సకాలంలో గుర్తించి వెనక్కి పంపడం లేదు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం రోగుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. కొన్నిసార్లు వైద్య సిబ్బంది కాలం చెల్లిన మందులనే రోగులకు ఇస్తున్నారు. తాజాగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ రోగికి గడువు మీరిన సెలైన్ ఎక్కించారు. ఇదే ఆస్పత్రిలో మరికొన్ని కాలం చెల్లిన మందులు ఉన్నట్లు తేలింది. ఒక్క ఖానాపూర్‌లోనే కాదు.. చాలా ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో గడువు మీరిన మందులను గుర్తించడం లేదు. కాలం చెల్లిన మందుల విషయంలో ఏం చేయాలన్న దానిపై స్పష్టమైన మార్గదర్శకాలూ లేవని వైద్యవర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి గడువు తీరిపోయే ఔషధాలను 3 నెలల ముందే గుర్తించి, వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ వేగంగా వినియోగంలోకి రాని మందులు ఆస్పత్రిలో ఉంటే.. వెంటనే వాటిని సెంట్రల్ మెడిసిన్ స్టోర్లకు పంపాలి. అక్కడి నుంచి తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ)కు పంపుతారు. అయితే కొన్ని కంపెనీలు ఇలాంటి ఔషధాలను తిరిగి తీసుకోవడం లేదని, ఆర్డర్ పెట్టి.. ఎందుకు తిప్పి పంపుతున్నారని ప్రశ్నిస్తున్నాయని సమాచారం. ఇక, కాలం చెల్లిన మందులను ఏం చేయాలో తెలియక చాలా ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది వాటిని మురుగు కాల్వల్లో పడేయడం, ఆస్పత్రుల ప్రాంగణంలోనే గొయ్యి తవ్వి పూడ్చిపెట్టడం చేస్తున్నారు. వాస్తవానికి కాలం చెల్లిన మందుల విషయంలో మూణ్నెల్లకోసారి సమీక్ష నిర్వహించాలి. వాటిని ఏం చేయాలన్న దానిపై కమిటీ వేసి, స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి.

సీఎంఎస్ కేంద్రాల నిల్వ సౌకర్యాల్లో లోపాలు

ఔషధాలను నిల్వ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 12 సెంట్రల్ మెడిసిన్ స్టోర్లు (సీఎంఎస్) ఉన్నాయి. టీజీఎంఎస్ఐడీసీ కొనుగోలు చేసిన ఔషధాలు కంపెనీల నుంచి నేరుగా సీఎంఎస్‌లకు చేరుకుంటాయి. అక్కడి నుంచి సమీప ఆస్పత్రులకు పంపుతుంటారు. అయితే రాష్ట్రంలోని కొన్ని సీఎంఎస్ కేంద్రాల్లో ఔషధాలను నిల్వ చేసేందుకు అవసరమైన కనీస సౌకర్యాలు లేవని సమాచారం. హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ సీఎంఎస్‌ల్లో ఔషధాల నిల్వ సౌకర్యాల్లో లోపాలున్నాయని, దాంతో ఔషధ నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని కాగ్ నివేదికలో కూడా వెల్లడైంది. కాగా, గతంలో గడువు మీరడానికి దగ్గరలో ఉన్న ఔషధాలను కొనుగోలు చేసి, వాటిని ఆస్పత్రులకు పంపి, అనంతరం ఎవరికీ తెలియకుండా వాటిని నాశనం చేసిన సంఘటనలు కూడా జరిగాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అడ్డగోలుగా ఔషధాలను కొనుగోలు చేసి, వాటిని వినియోగించకపోవడం వల్ల 2016-22 మధ్య కాలంలో ప్రభుత్వానికి రూ.390 కోట్ల నష్టం జరిగినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది.

వచ్చే ఏడాది నుంచి రేషన్ సన్న బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంఘం నిర్ణయించింది. చౌక ధర దుకాణాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఏటా 24 లక్షల టన్నుల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా, సగంపైగా దారి మళ్లుతోందని గుర్తించింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు.. ప్రతి ఒక్కరూ తినడానికి అనువుగా ఉండేలా చౌక ధర దుకాణాల ద్వారా సన్నబియ్యంఅందజేయాలని పేర్కొంది. రేషన్ కార్డులతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో ఇవ్వనున్నారు. కుటుంబం సమగ్ర ఆరోగ్య వివరాల (హెల్త్ ప్రొఫైల్)తో రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డులు జారీ చేయాలని సూచించింది. ఆరోగ్య శ్రీ ప్రయోజనం కోసం కొందరు తెల్ల కార్డులు తీసుకుంటున్నారని.. వేర్వేరుగా జారీ చేస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడింది. మంత్రివర్గ ఉప సంఘం సమావేశం శనివారం సచివాలయంలో పౌర సరఫరాలు, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల మంత్రులు దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పట్టణాల్లో రూ.2 లక్షల్లోపు, గ్రామాల్లో రూ.లక్షన్నర వార్షికాదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు లేదా చెల్క 7.5 ఎకరాల లోపు ఉన్నవారికే తెల్ల కార్డులివ్వాలని ప్రతిపాదించింది. పెండింగ్‌లో పది లక్షల దరఖాస్తులున్నట్లు పేర్కొంది. ఏపీ, తెలంగాణల్లోనూ కార్డులున్న వారికి ఆప్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ అర్హతలపై విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తక్షణమే లేఖలు రాసి సూచనలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో కార్యదర్శి డీఎస్ చౌహాన్‌కు మంత్రి ఉత్తమ్ సూచించారు. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారెవరూ తెల్ల కార్డు అవకాశం కోల్పోకుండా అధ్యయనం జరగాలనేదే ఉద్దేశంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్డుల జారీకి సంబంధించి డాక్టర్ ఎన్.సి.సక్సేనా, సుప్రీంకోర్టు స్పెషల్ కమిషనర్‌గా పనిచేసిన హర్షమందర్ కమిటీ, పట్టణ ప్రాంతాల్లో కార్డుల జారీకి సంబంధించి హషీమ్ కమిటీ ముసాయిదా నిబంధనలపై అధ్యయనం చేయాలని అధికారులను మంత్రివర్గ ఉప సంఘం ఆదేశించింది. రాష్ట్రంలో 65 లేదా ఆపైన వయసుండి, ఏ ఆదాయ వనరులు లేనివారికి అన్నపూర్ణ కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు ప్రస్తావించారు. అర్హులందరికీ తెల్లకార్డులు జారీ చేస్తామన్న ఉత్తమ్.. సక్సేనా కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సక్సేనా, హషీమ్ కమిటీ సిఫారసుల ప్రకారం.. ఒంటరి మహిళలతో పాటు సామాజికంగా వెనుకబాటుకు గురైన వర్గాలకు, ఆదివాసీ గిరిజను (చెంచులు, కోలామ్స్, తోటి, కొండరెడ్లు)లకు, భూమి లేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు, ప్రత్యేక వైకల్యం ఉన్నవారికి అన్నపూర్ణ అంత్యోదయ కార్డులు ఇవ్వాలి. ఇప్పటికే జారీ చేసిన కార్డుల్లో కొత్త సభ్యుల (16,36,687) చేర్పునకు వచ్చిన 11,33,881 దరఖాస్తులను ఆమోదిస్తే రూ.495 కోట్లు, కొత్త కార్డులకు వచ్చిన 10 లక్షల దరఖాస్తుల (31.60 లక్షలమందికి సంబంధించి)ను ఆమోదిస్తే ఏటా రూ.956 కోట్ల భారం పడనుంది.

80 శాతం కుటుంబాలకు తెల్ల కార్డులు

రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం కుటుంబాలు 83,03,612 కాగా.. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 1,03,95,629గా తేలాయి. తాజాగా 1,11,23,323కు పెరిగాయి. ఈ ప్రకారం 80.88 శాతం కుటుంబాలకు (89,96,579) తెల్ల కార్డులు ఉన్నాయి. దేశంలో రేషన్ కార్డులు పొందడానికి వార్షికాదాయం అత్యధికంగా ఉన్న రాష్ట్రం కేరళ అని.. అక్కడ రూ.3 లక్షల లోపు ఉన్నవారిని బీపీఎల్‌గా గుర్తించి, కార్డులు ఇస్తున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం గుర్తించింది.

కాలం చెల్లిన మందుల వినియోగంపై కలెక్టర్ సీరియస్

» ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రి ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్సుపై సస్పెన్షన్ వేటు

» సూపరింటెండెంట్ సహా ఐదుగురికి మెమోల జారీ

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఖానాపూర్, ఆగస్టు 10: 'కాలం చెల్లిన సెలైన్‌తో రోగికి చికిత్స' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అజారుద్దీన్ అనే వ్యక్తికి కాలం చెల్లిన సెలైన్ బాటిల్‌ను ఎక్కించిన ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురికి మెమోలను జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న సునీతను, స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న చంద్రకళను సస్పెండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీ మాధవ్, ఫార్మాసిస్టులు శ్రీనివాసాచారి, ఎం. విజయకుమార్, వెంకటేశ్, కళ్యాణికి మెమోలను జారీ చేశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



విద్యుదుత్పత్తిపై అధికారులతో సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

జల విద్యుత్ కేంద్రాలకు మరమ్మతులు చేయలేదెందుకు?

» వరద వస్తున్నా పూర్తి ఉత్పత్తి లేదు


» అధికారుల నిర్లక్ష్యంతో భారీగా నష్టం

» నిర్లక్ష్యంగా ఉన్నవారిని కొనసాగించాల్సిన అవసరం లేదు: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో జల విద్యుత్ కేంద్రాలున్న ప్రాజెక్టులకు భారీగా వరద వస్తున్నా పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చే యలేకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. పాడైన యూనిట్లకు సకాలంలో మరమ్మతు చేయకపోవడంవల్లే భారీగా నష్టం జరిగింది. ఇంత నిర్లక్ష్యంగా ఉన్నవారిని కొనసాగించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జలవిద్యుత్ కేంద్రాల్లో సత్వరం మరమ్మతులు నిర్వహించి వాటి ఉత్పత్తి సామర్థ్యానికి తగ్గట్లుగా పునరుద్ధరించాలని ఆదేశించారు. శనివారం ఆయన ప్రజాభవన్‌లో జెన్‌కో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జలాశయాల వద్ద 2,441.8 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాలుండగా... వాటిలో 300.8 మెగావాట్ల కేంద్రాలు పాడైపోవడం పట్ల భట్టి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల తదితర జలవిద్యుత్ కేంద్రాలకు మరమ్మతుల విషయంలో గతంలో సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడంతో వరదలు వస్తున్నా పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేసుకోలేకపోతున్నామంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం చేస్తే సహించే ప్రసక్తేలేదని హెచ్చరించారు. అలాగే జల విద్యుత్ కేంద్రాల పని తీరు, ఉత్పాదకతపై వారానికోసారి తనకు నివేదికలు ఇవ్వాలని, విద్యుత్ కేంద్రాల్లో సమస్యలు వస్తే తక్షణమే ఇంధన శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. విద్యుత్ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే చీఫ్ ఇంజనీర్ల నుంచి రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకొని చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కనీసం 17 రోజుల విద్యుదుత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలుండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



నిర్మల్ జిల్లా రువ్వి గ్రామంలో గల్ఫ్ బాధితుడి కుటుంబ సభ్యులు



గల్ఫ్ బాధితుడు

రాథోడ్ నాందేవ్ కుటుంబానికి ఎమ్మెల్యే, కలెక్టర్ భరోసా!

- గల్ఫ్ నుంచి స్వదేశానికి రప్పిస్తామని వెల్లడి
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ముథోల్, ఆగస్టు 10: ఉపాధి కోసం ఎడారి దేశం కువైట్‌కు వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి, యజమాని వేధింపులకు గురవుతూ అనారోగ్యం బారిన పడిన నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ కుటుంబానికి ఎమ్మెల్యే, కలెక్టర్ భరోసా కల్పించారు. బాధితుడిని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడని, అతన్ని తిరిగి రప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశారు. రాథోడ్ నాందేవ్ కువైట్‌లో యజమాని వేధింపులు ఎక్కువ కావడంతో తనను ఆదుకోవాలంటూ బాధితుడి ఆవేదనతో కూడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరలైంది. పడరాని పాట్లు పడుతున్న తనను సీఎం రేవంత్ రెడ్డితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదుకుని స్వదేశానికి రప్పించే విధంగా చూడాలని వీడియో ద్వారా వేడుకున్నాడు. ఈ ఉదంతంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిర్మల్ వాసి ఆడు జీవితం' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి నిర్మల్ జిల్లా కలెక్టర్ స్పందించారు. బాధితుడిని క్షేమంగా తిరిగి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు.. బాధిత కుటుంబంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు, నాయకులతో మాట్లాడారు. అధైర్య పడవద్దని బాధితుడి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి రప్పించేందుకు సంబంధిత అధికారులతో, కేంద్ర మంత్రి సంజయ్‌తో మాట్లాడానని ఎమ్మెల్యే తెలిపారు.

కుక్కల బెడద నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

- మంత్రి దామోదరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడదను నివారించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శనివారం ఆయన లేఖ రాశారు. ప్రతిరోజూ ఎదో ఒక ప్రాంతంలో వీధి కుక్కలు విజృంభించి చిన్నారులను, వృద్ధులను గాయపరుస్తున్నాయన్నారు. కుక్కలు దాడి చేసిన ఘటనల్లో పలువురు మృత్యువాతపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హన్మకొండ ఎంజీఎం ఆస్పత్రిలో పసికందును కుక్కలు పీక్కుతిన్న సంఘటన హృదయవిదారకమని, ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై రేపు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. కవితను మార్చి 15న ఈడీ, ఏప్రిల్ 11న సీబీఐలు అరెస్టు చేశాయి. కవిత తొలుత తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ కావాలని పిటిషన్ దాఖలు చేయగా ట్రయల్ కోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత సీబీఐ, ఈడీ కేసుల్లో సాధారణ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా మళ్లీ నిరాశే ఎదురైంది. ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేశారు. అక్కడ కూడా బెయిల్ దక్కలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గురువారం సుప్రీంకోర్టులో క్రిమినల్ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. శుక్రవారం రిజిస్ట్రీ వెరిఫై చేసింది. జస్టిస్ గవాయ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ముందుకు కేసు రానున్నట్టు తెలిపింది. సీబీఐ కేసులో ఈ నెల 21 వరకు, ఈడీ కేసులో ఈ నెల 13 వరకు ట్రయల్ కోర్టు కవితకు జ్యుడీషియల్ కస్టడీని విధించింది. దీనిపై ఆమె చేసిన అప్పీలునే కోర్టు విచారణ జరపనుంది.



శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డును కూల్చివేయిస్తున్న అధికారులు

పెద్దాపూర్ గురుకులంలో దిద్దుబాటు చర్యలు

- పిచ్చి మొక్కలు, ముళ్ల పొదల తొలగింపు
- పనులు చేస్తుండగా బయటపడుతున్న పాములు
- గురుకులాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 10: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఎట్టకేలకు అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. 15 రోజుల వ్యవధిలో గురుకులంలో ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించడంతో పాఠశాలలోని శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు, భవనాలు, పాత కట్టడాలను కూల్చివేశారు. తరగతి గదుల వెనుకవైపు ఉన్న పాడు బడ్డ బావులను పూడ్చి వేశారు. ప్రహరీ వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను తొలగించారు. పాఠశాల ఆవరణలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా విషపూరిత పాములు సంచరిస్తుండడాన్ని గుర్తించారు. కాగా, అస్వస్థకు గురైన విద్యార్థులు మోక్షిత్, హేమంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నిజామాబాద్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ముంబై సైబర్ క్రైం పోలీసు పేరుతో వసూళ్లు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కేసుల పేరుతో అమాయకుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నిందితుడ్ని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నంకు చెందిన షేక్ ఖలీల్ అమాయకులకు ఫోన్లు చేసి ముంబై సైబర్ క్రైం పోలీసుగా పరిచయం చేసుకునేవాడు. డ్రగ్స్, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్నారని వారిని బెదిరించేవాడు. కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపాలని బెదిరించి వసూలు చేసేవాడు. ఖలీల్ తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢిల్లీ, తమిళనాడు, అండమాన్ నికోబార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అమాయకుల్ని బురిడీ కొట్టించి పెద్ద మొత్తంలో వసూలు చేశాడు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుడికి ఇదే తరహాలో ఫోన్ చేసి రూ. 3.5 లక్షలు వసూలు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఖమ్మం సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు జరిపిన అధికారులు నిందితుడ్ని విశాఖపట్నంలో అరెస్ట్ చేశారు. ప్రాథమిక విచారణలో నిందితుడికి సంబంధించిన బ్యాంకు ఖాతాలకు దేశవ్యాప్తంగా జరిగిన 33 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ప్రభుత్వ శాఖల బకాయిలు 72 వేల కోట్లు

ఏళ్ల తరబడి చెల్లింపులకు నోచుకోని తీరు.. విద్యుత్తు, ఇరిగేషన్ బిల్లులే 57 వేల కోట్లు

- ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులూ పెండింగే
- స్కాలర్‌షిప్పులు, దోభీఘాట్ల సొమ్మూ అంతే..
- కొన్ని బిల్లులైనా చెల్లించాలన్న డిమాండ్లు
- ప్రభుత్వ సానుకూల స్పందనకై నిరీక్షణ

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఎన్నికల్లో గెలుపొంది, సర్కారు కొలువుదీరింది. తమ బిల్లులు వస్తాయని ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, కాలేజీల యాజమాన్యాలు ఇలా అనేక వర్గాల వారు ఆశగా ఎదురుచూశారు. రూ.వేల కోట్ల బిల్లులకు మోక్షం లభిస్తుందని ఆశ పడ్డారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన వెంటనే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టింది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని, బిల్లులన్నీ క్లియర్ చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులన్నింటినీ క్లియర్ చేస్తామని, డీఏలు ఇస్తామని, పీఆర్సీ అమలు చేస్తామనీ పేర్కొన్నారు. ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిలైతే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల పూర్తిస్థాయి బడ్జెట్‌నూ ప్రవేశపెట్టారు. కానీ, వివిధ ప్రభుత్వ శాఖలకు రూ.వేల కోట్లలో పెండింగ్‌లో ఉన్న బిల్లులపై మాత్రం దృష్టి సారించలేదు. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, కాంట్రాక్టర్లకు రావాల్సిన సొమ్ములు, విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా ఒకటేమిటి? అన్ని శాఖల బిల్లులూ పెండింగ్‌లోనే ఉన్నాయి. మొత్తంగా అన్ని శాఖలకు సంబంధించి దాదాపు రూ.72 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రభుత్వం రెండో విడత రైతుల రుణమాఫీ కూడా చేసినందున ఇక తమ బిల్లులపై దృష్టి పెడుతుందని, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అవుతాయని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ 'బిల్లుల పెండింగ్' సమస్య ఈనాటిది కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పెద్ద గుదిబండగా తయారైంది. అప్పటి ప్రభుత్వం బిల్లుల క్లియరెన్స్‌ను గాలికొదిలేసింది. కనీసం రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల బిల్లులను కూడా క్లియర్ చేయని ఘటనలున్నాయి. ఇది చాలా జటిలమైన సమస్య అయినప్పటికీ.. బిల్లులను క్లియర్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ, ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలు పూర్తయినా.. బిల్లులపై ఇంకా దృష్టి సారించలేదు. మొత్తం రూ.72 వేల కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉండగా.. విద్యుత్తు, ఇరిగేషన్ శాఖల బిల్లులే 57,399 కోట్లవరకు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సర్కారు ఇంత భారీ మొత్తంలో నిధులు సమకూర్చలేని పరిస్థితి ఉంటే.. ముఖ్యమైన బిల్లుల్ని అయినా ముందుగా క్లియర్ చేయాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

సాగునీరు, విద్యుత్తు శాఖల బిల్లులే ఎక్కువ..

పెండింగ్ బిల్లుల్లో ప్రధానంగా విద్యుత్తు, సాగునీటి పారుదల శాఖలకు సంబంధించినవే రూ.57 వేల కోట్లకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్తు పంపిణీ సంస్థల(డిస్కమ్‌ల)కు ప్రభుత్వ శాఖలు/ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.43,770 కోట్లు కాగా.. సాగునీటి ప్రాజెక్టుల కాంట్రాక్టు పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.13,629.18 కోట్ల వరకు ఉన్నాయి. రెండు శాఖలకు కలిపి మొత్తం రూ.57,399.18 కోట్లు చెల్లించాల్సి ఉంది. నీటి పారుదల ప్రాజెక్టుల్లో ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డికి రూ.5243.18 కోట్లు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.4123.85 కోట్లు, డిండికి రూ.369.64 కోట్లు, కల్వకుర్తికి రూ.313.2 కోట్లు, నెట్టెంపాడుకు రూ.244.3 కోట్లు, ఎల్లంపల్లికి రూ.446.87 కోట్లు, దేవాదులకురూ.238.76 కోట్లు, సీతారామ/సీతమ్మ మల్టీపర్పస్ ప్రాజెక్టుకు రూ.934.57 కోట్లు, ఇలా అన్ని ప్రాజెక్టులకు కలిపి రూ.13629.34 కోట్లను చెల్లించాల్సి ఉంది.

ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిల కుప్ప

రాష్ట్రంలోని పేద విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్పులు, ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బిల్లులూ పెండింగ్‌లో ఉండడం వారిని తీరని ఆవేదనకు గురిచేస్తోంది. ఏళ్ల తరబడి ఇవి క్లియర్ కాకపోవడంతో కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను ఇచ్చే సందర్భాల్లో కాలేజీ యాజమాన్యాలు సతాయిస్తున్నాయి. ఫీజు రీ-యింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలే రూ.4,769 కోట్ల వరకు ఉన్నాయి. గత మూడేళ్ల నుంచి ఈ రీ-యింబర్స్‌మెంట్ బిల్లులు క్లియర్ కావడం లేదు. 2021-22లో రూ.326 కోట్లు, 2022-23లో రూ.1,830 కోట్లు, 2023-24లో రూ.2,250 కోట్లతో పాటు ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి 2020-21లో రూ.250 కోట్లు, ఇక మెస్ చార్జీల్లలకు సంబంధించి రూ.500 కోట్లు కలిపి రూ.5,156 కోట్ల బకాయిలున్నాయి. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాత బకాయిల కింద రూ.387 కోట్లను చెల్లించింది. ఇవి పోను.. ఇంకా సుమారు రూ.4,769 కోట్ల బకాయిలున్నాయి. విద్యార్థులకు ఏటా చెల్లించే స్కాలర్‌షిప్పుల బిల్లులు మరో రూ.500 కోట్ల వరకు ఉన్నాయి. ఇలా మొత్తం రూ.5,269 కోట్ల మేర పెండింగ్ పడిపోయాయి. ఇవి కాకుండా ప్రస్తుత విద్యా సంవత్సరానికి మరో రూ.2,250 కోట్లు కావాలి.

శాఖలవారీగా పెండింగ్ బిల్లులు(రూ.కోట్లలో)	
విద్యుత్తు	43,770
ఇరిగేషన్	13,629
ఫీజులు, స్కాలర్‌షిప్పులు	5269
పురపాలక, పట్టణాభివృద్ధి	4137
ఉద్యోగులు	2000
పంచాయతీరాజ్	1700
రోడ్లు-భవనాలు	1000
మొత్తం	72,055

ఉద్యోగులకు ఉపశమనమెప్పుడో!?

ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి చెప్పనలవిగా మారింది. వివిధ రకాల సప్లిమెంటరీ బిల్లులు రెండున్నరేళ్లుగా క్లియర్ కావడం లేదు. కనీసం ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత ఇచ్చే ఆర్థిక ప్రయోజనాల బిల్లులు కూడా క్లియర్ కాక.. అవస్థలు పడుతున్నారు. ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా(టీజీజీఎల్ఐ), తెలంగాణ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్(టీజీజీపీఎఫ్)కు సంబంధించిన పార్ట్ ఫైనల్, గ్రాట్యుటీ, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్, గృహ, వాహన రుణాల బిల్లులు క్లియర్ కావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దాదాపు 10 వేల బిల్లులకు పైగా పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిని క్లియర్ చేయాలంటే కనీసం రూ.2 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. ఇక రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖల కింద పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు క్లియర్ కాక లబోదిబోమంటున్నారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోనే రూ.1000 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. బీటీ రోడ్ల రెన్యువల్ పనులు, ప్యాచ్ వర్క్‌లు, కొత్త రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు రెండేళ్లుగా చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. గ్రామీణ రోడ్ల పనులకు సంబంధించి రూ.1200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ బిల్లులే రూ.1700 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మున్సిపాలిటీలలో దోబీఘాట్ల నిర్మాణ బిల్లులను కూడా చెల్లించకపోవడం గమనార్హం. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో అన్ని రకాల బిల్లులు కలిపి 4137.85 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎగువన తగ్గిన వరద

- ఆల్మట్టి, నారాయణపూర్‌కు గణనీయంగా తగ్గిన ప్రవాహాలు
- శ్రీశైలం, సాగర్‌కు మాత్రం భారీగానే
- మూడో రోజూ సాగర్ గేట్లు బార్లా..
- పర్యాటకుల రద్దీ.. లాంచీ సేవలకు బ్రేక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కృష్ణా బేసిన్ పరిధిలోని ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద గణనీయంగా పడిపోయింది. శుక్రవారం ఆల్మట్టి ప్రాజెక్టుకు 2.06 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం 87 వేలకు తగ్గింది. ఇక నారాయణపూర్‌కు 1.50 లక్షల ఇన్‌ఫ్లో ఉండగా.. సగానికి తగ్గి 75 వేలకు చేరింది. దాంతో రెండు జలాశయాల్లోనూ నిల్వను పెంచుకునేందుకు ఔట్ ఫ్లోను భారీగా తగ్గించారు. ప్రస్తుతం ఆల్మట్టిలో 129.72 టీఎంసీలకు.. 118.27 టీఎంసీలు, నారాయణపూర్‌లో 37.64 టీఎంసీలకు.. 36.09 టీఎంసీల నిల్వలున్నాయి. ఇక జూరాల, తుంగభద్ర, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి ఔట్‌ఫ్లో గణనీయంగా ఉండటంతో శ్రీశైలానికి 3.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. దాంతో రెండు వైపులా జలవిద్యుత్ ఉత్పాదన చేసి, గేట్ల ద్వారా 4.37 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. శ్రీశైలంలో 215.80 టీఎంసీలకు 200 పైగా టీఎంసీలున్నాయి. ఇక నాగార్జున సాగర్‌కు భారీగానే వరద చేరుతోంది. ప్రస్తుతం 4,14,128 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. మొత్తం 26 గేట్లు ఎత్తి 3,12,756 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన, కాల్వల ద్వారా కలిపి.. 3,55,549 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో 312.50 టీఎంసీలకు 306.10 టీఎంసీలున్నాయి. సాగర్ దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు 3,29,189 క్యూసెక్కులు వస్తుండగా.. ఔట్‌ఫ్లో 3,16,504 క్యూసెక్కులుగా నమోదైంది. వర్షాలు లేకపోవడంతో గోదావరి బేసిన్‌లోని సింగూరు, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు చెప్పుకోదగ్గ ప్రవాహాలు రావట్లేదు.

సాగర్‌కు పోటెత్తిన పర్యాటకులు..

వరుస సెలవులు కావడంతో నాగార్జునసాగర్‌కు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వరుసగా మూడో రోజూ ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తే ఉంచడంతో తిలకించడానికి బారులు తీరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా సాగర్‌ను సందర్శించారు. అయితే ఔట్ ఫ్లో ఎక్కువ ఉండటంతో లాంచీలు జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు వెళ్లకుండా అధికారులు నిలిపేశారు.



నాగార్జునసాగర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

లాంగ్ వీకెండ్‌కు పోదాం చలో చలో..!

- సుదీర్ఘ వారాంతంతో యాత్రలకు సిద్ధమైన హైదరాబాదీవాసులు
- ఈ ఆగస్టు 15 వారాంతం కోసం సొంత ఊళ్లకు వెళ్తున్న జనం..



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15తో మొదలయ్యే ఎక్స్‌టెండెడ్ లాంగ్ వీకెండ్ కోసం హైదరాబాద్‌వాసులు సిద్ధమైపోయారు. దీంతో పాటు నెలాఖరులో వచ్చే మరో సుదీర్ఘ వీకెండ్ కోసం యాత్రా ప్రేమికులు రెడీ అవుతున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో బుకింగ్‌ల పరంగా తాము ఈ వీకెండ్‌తో పోలిస్తే రాబోయే వీకెండ్ కోసం 29% వృద్ధిని చూశామని రెడ్‌బస్ చెబుతోంది. ఎస్‌ఓటీసీ, థామస్‌కుక్ లాంటి ట్రావెల్ ఏజెన్సీలు ఎంక్వైరీలు బాగున్నాయంటున్నాయి. అయితే దేశీయంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ఖర్చుతోనే దాదాపుగా ఇతర దేశాలకూ వెళ్లి వచ్చేలా ప్రణాళిక చేసుకున్న వారు కాస్త నిరాశపడేలా విమాన టికెట్ల ధరలు పెరిగాయి. సాధారణ గమ్యస్థానాలకు కనీసం 10శాతం పెరిగితే టూరిస్టులు ఇష్టపడే గోవాకు 40శాతానికి పైగా, కశ్మీర్‌లాంటి ఆకర్షణీయ హిల్ స్టేషన్స్‌కు 80శాతం వరకూ విమాన చార్జీలు ఈ లాంగ్ వీకెండ్‌కు పెరిగాయని పలు ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నాయి. కాగా గురువారం ఆగస్టు 15, శుక్రవారం వరలక్ష్మి వ్రతం (కొందరికి ఆప్షనల్ హాలీడే లేదంటే సెలవు పెట్టుకోవాలి), ఐటీ ఉద్యోగులకు శనివారం సెలవు (ఇతరులు సెలవు తీసుకుంటే), ఆదివారం తర్వాత రక్షాబంధన్ సోమవారం రావడంతో ఆగస్టు 19 వరకూ సెలవులను ఆస్వాదించవచ్చు. కొందరు ఆగస్టు 20న పార్సీ న్యూ ఇయర్ కాబట్టి ఆప్షనల్ హాలీడే తీసుకునే అవకాశమూ చూస్తున్నారు. దాదాపు ఐదు రోజులు సెలవులు ఉండటంతో సాఫ్ట్‌వేర్ తదితర రంగాలల్లోని యువత టూర్‌లకు సిద్ధమైంది. దాదాపు ఐదు రోజులు సెలవు వస్తే ఎందుకు ఇక్కడ ఉంటామంటున్నారు ఆంధ్రాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నికేష్, తరుణ్. బస్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ రెడ్‌బస్ అధ్యయనం ఇదే చెబుతుంది. ఆగస్టు 17 నుంచి 19 వరకు ట్రావెల్ బుకింగ్ పరంగా వృద్ధి ఇప్పటికే గణనీయంగా కనిపిస్తోందని ఈ సంస్థ పేర్కొంది. తెలుగురాష్ట్రాల్లో బుకింగ్స్ పరంగా 29% వృద్ధి తమ ప్లాట్‌ఫామ్‌పై ఉన్నట్టు తెలిపింది. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి రూట్లలో హైదరాబాద్ నుంచి డిమాండ్ అధికంగా ఉందని, బెంగళూరు, పుణెలకు డిమాండ్ అధికంగా ఉందని పేర్కొంది. ఆగస్టు 24 నుంచి 26 వరకూ మరో లాంగ్ వీకెండ్ రావడంతో కొందరు మినీకేషన్స్ ప్రణాళిక చేసుకుంటున్నారు.

డిమాండ్ బాగుంది....

సుదీర్ఘ వారాంతంరావడంతో ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ఈసారి చాలా మంది నగరం విడిచి వెళ్లబోతున్నారంటున్నాయి పలు ట్రావెల్ ఏజెన్సీలు. గతంతో పోలిస్తే ఈ లాంగ్ వీకెండ్ కోసం బుకింగ్‌ల పరంగా 60% వృద్ధి కనిపిస్తున్నాయంటున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఐజిగో... బాలీ, అజర్‌బైజన్, థాయ్‌లాండ్, సింగపూర్ లాంటి ప్రాంతాలకు బుకింగ్ 60-70% పెరిగాయంటోంది. ఎస్‌ఓటీసీ, థామస్‌కుక్ లాంటి సంస్థలు ఆగస్టు 15తో ప్రారంభమయ్యే లాంగ్ ఎక్స్‌టెండెడ్ వీకెండ్ కోసం బుకింగ్‌లు బాగా జరుగుతున్నాయని తెలిపాయి. నగరం నుంచి బుకింగ్‌లు గత మే నెలలో వచ్చిన లాంగ్ వీకెండ్‌తో పోలిస్తే 20%-30% బుకింగ్‌లు అధికంగా జరిగే అవకాశాలున్నాయని థామస్‌కుక్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎక్కువ మంది ఈ లాంగ్ వీకెండ్ కోసం కేరళ, సిమ్లా, ధర్మశాల, కూర్గ్, మహాబలేశ్వరం లాంటి ప్రాంతాల కోసం అడుగుతున్నారని చెబుతున్నారు. కేరళ, కశ్మీర్, సిమ్లా, నైనిటాల్‌లాంటి ప్రాంతాలకు వెళ్తున్నారని, కొందరు అస్సాం, మేఘాలయ, ధర్మశాల వంటి చోట్లకు వెళ్తున్నారని ఎస్‌ఓటీసీ ప్రతినిధులు చెబుతున్నారు. దుబాయ్ పర్యాటక సంస్థ ఆఫర్లతో నగరవాసులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది.

మల్లారెడ్డి వర్సిటీలో విద్యార్థుల ఆందోళన

- విద్యార్థి మృతిని నిరసిస్తూ అద్దాలు, సామగ్రి ధ్వంసం
- ఆస్పత్రికి తరలించడంలో జాప్యం చేశారని ఆగ్రహం
- సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం: వీసీ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లడంలో వర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, ఆ కారణంగానే అతడు మృతి చెందాడంటూ మల్లారెడ్డి వర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీలో మూడు రోజుల క్రితం ఎ.అరుణ్ కుమార్ అనే విద్యార్థి తరగతి గదిలోనే కుప్పకూలగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే మరణించిన విషయం తెలిసిందే. అయితే, వర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడంటూ అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. విద్యార్థి సంఘాలతో కలిసి క్యాంపస్‌లోని కాలేజీ భవనం ఎదుట బైఠాయించారు. దీనిపై స్పందించేందుకు తొలుత వర్సిటీ అధికారులు నిరాకరించడంతో ఆగ్రహించిన విద్యార్థులు.. భవనం అద్దాలు, సామగ్రిని ధ్వంసం చేశారు. కాలేజీ నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని, విద్యార్థులతో మాట్లాడారు. అరుణ్‌కుమార్ అస్వస్థతకు గురైన విషయాన్ని జూనియర్ లెక్చరర్లు, హెచ్‌వోడీకి చెప్పినా పట్టించుకోలేదని, 40నిమిషాలు వృథా చేశారని విద్యార్థులు ఆరోపించారు. ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించేందుకు యత్నించినా అనుమతించలేదని, చివరకు అంబులెన్స్‌ను రప్పించి ఆస్పత్రికి తరలించారని తెలిపారు. అరుణ్‌కుమార్‌ను అరగంట ముందు తీసుకొస్తే ప్రాణాలు దక్కేవని వైద్యులు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో అంబులెన్స్‌తోపాటు ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి తదితరులు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తామని హామీ ఇచ్చారు. తరగతి గదిలో విద్యార్థి చనిపోవడం బాధాకరమని, ఈ విషయమై విచారణ చేపట్టి.. సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్సిటీలో శాశ్వతంగా ఉండేలా అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



మల్లారెడ్డి యూనివర్సిటీలోని అగ్రికల్చర్ కాలేజీ ఎదుట సామగ్రిని దహనం చేస్తున్న విద్యార్థులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 11 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- బీఎస్సీ (నర్సింగ్), బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్), బీపీటీ(బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.



నిమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ

బీఎస్సీ నర్సింగ్

ఈ ప్రోగ్రామ్‌ను మహిళలకు ఉద్దేశించారు. వివాహితులు కూడా అర్హులే. ఇందులో మొత్తం 100 సీట్లు ఉన్నాయి. సంస్థ ఉద్యోగులకు 5 సీట్లు ప్రత్యేకించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా బైపీసీ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. స్టేట్ ఓపెన్ స్కూల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. డిసెంబరు 31 నాటికి అభ్యర్థులకు 17 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

స్టయిపెండ్: మొదటి ఏడాది నెలకు రూ.5,000; రెండో ఏడాది నెలకు రూ.6,000; మూడో ఏడాది నెలకు రూ.7,000; నాలుగో ఏడాది నెలకు రూ.8,000 చెల్లిస్తారు. సంస్థ ఉద్యోగులు స్టయిపెండ్‌కు అనర్హులు.

బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్)

కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఈ ప్రోగ్రామ్‌లో 11 స్పెషలైజేషన్లు, 100 సీట్లు ఉన్నాయి. అనెస్థీషియా టెక్నాలజీ 10, డయాలసిస్ థెరపీ టెక్నాలజీ 20, కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ 12, ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్ టెక్నాలజీ 8, రేడియోగ్రఫీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ 10, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ 12, న్యూరో టెక్నాలజీ 6, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 4, రేడియేషన్ థెరపీ టెక్నాలజీ 4, రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ 10, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ 4 సీట్లు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో సంస్థ నిబంధనల ప్రకారం స్టయిపెండ్ చెల్లిస్తారు.

అర్హత: ఇంటర్ (బైపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్‌తోపాటు బయాలజీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులతో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు కూడా అర్హులే. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

బీపీటీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ)

కోర్సు వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ఇందులో మొత్తం 50 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అర్హులు. ఒకేషనల్ ఫిజియోథెరపీతోపాటు బ్రిడ్జ్ కోర్సు(బయోలాజికల్ అండ్ ఫిజికల్ సైన్సెస్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 27
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌నకు సెప్టెంబరు 18న; బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్) ప్రోగ్రామ్‌నకు అక్టోబరు 10న; బీపీటీ ప్రోగ్రామ్‌నకు సెప్టెంబరు 12న
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌నకు అక్టోబరు 1న; బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్) ప్రోగ్రామ్‌నకు అక్టోబరు 19న; బీపీటీ ప్రోగ్రామ్‌నకు సెప్టెంబరు 21న
- **తరగతులు ప్రారంభం:** బీఎస్సీ నర్సింగ్‌కు డిసెంబరు 9 నుంచి, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్‌కు నవంబరు 1 నుంచి, బీపీటీకి అక్టోబరు 17 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ మెడికల్ & డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ(కన్వీనర్) కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద మొత్తం 3,856 ఎంబీబీఎస్ సీట్లు, 1,540 బీడీఎస్ సీట్లు ఉన్నాయి. స్విమ్స్ నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్(తిరుపతి)లోని ఎంబీబీఎస్ సీట్లను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే అలాట్ చేస్తారు. నీట్ యూజీ 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. అన్ని కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుచేస్తారు. విజయవాడలోని సిద్దార్థ మెడికల్ కాలేజీలో సీట్లను ఆంధ్ర, రాయలసీమ అభ్యర్థులకే కేటాయిస్తారు. ఎంబీబీఎస్ డిగ్రీ వ్యవధి నాలుగున్నరేళ్లు. ఎంసీఐ/ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మరో ఏడాది కంపల్సరీ మెడికల్ రొటేటరీ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. బీడీఎస్ డిగ్రీ వ్యవధి నాలుగేళ్లు. మరో ఏడాది పెయిడ్ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్

కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్ల వివరాలు

ఏయూ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలు


- సిద్దార్థ మెడికల్ కాలేజ్, విజయవాడ - 149
- ఆంధ్ర మెడికల్ కాలేజ్, విశాఖపట్నం - 213
- రంగరాయ మెడికల్ కాలేజ్, కాకినాడ - 213
- గుంటూరు మెడికల్ కాలేజ్, గుంటూరు - 213
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్(రిమ్స్), శ్రీకాకుళం - 128
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్(రిమ్స్), ఒంగోలు - 102
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, విజయనగరం - 64
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, ఏలూరు - 64
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మచిలీపట్నం - 64
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, రాజమహేంద్రవరం - 64
- గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, విజయవాడ - 34

ఏయూ పరిధిలోని ప్రైవేట్ కళాశాలలు

- అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఏలూరు - 125
- కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, గుంటూరు - 75
- డా. పిన్నమనేని సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, గన్నవరం - 75
- జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, రాజమండ్రి - 125
- ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, గుంటూరు - 100
- కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, అమలాపురం - 75
- గ్రేట్ ఈస్ట్రన్ మెడికల్ స్కూల్ అండ్ హాస్పిటల్, రాగోలు - 75
- మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నెల్లిమర్ల - 100
- ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విశాఖపట్నం - 75
- గాయత్రీ విద్యా పరిషత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ, విశాఖపట్నం - 100
- నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, జూపూడి - 75
- డా.సుధా అండ్ నాగేశ్వరరావు సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్, గన్నవరం - 50
- గీతం డెంటల్ కాలేజ్, రుషికొండ - 50
- సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్, ఏలూరు - 50
- విష్ణు డెంటల్ కాలేజ్, భీమవరం - 50
- శ్రీ సాయి డెంటల్ కాలేజ్, శ్రీకాకుళం - 50
- జీఎస్ఎల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, రాజమహేంద్రవరం - 50
- అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, విశాఖపట్నం - 50
- సిబర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, గుంటూరు - 50
- కిమ్స్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, అమలాపురం - 50
- కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, గుంటూరు - 25
- లెనోరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, రాజమహేంద్రవరం - 50
- నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, ఇబ్రహీంపట్నం - 50

ఎస్వీయూ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలు

- ఎస్వీ మెడికల్ కాలేజ్, తిరుపతి - 204
- కర్నూలు మెడికల్ కాలేజ్, కర్నూలు - 213
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, అనంతపురం - 128
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్(రిమ్స్), కడప - 149
- ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, నెల్లూరు - 149
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, నంద్యాల - 64
- గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, కడప - 85



ఎస్వీయూ పరిధిలోని ప్రైవేట్ కళాశాలలు

- నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు - 125
- పీఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, కుప్పం - 75
- శాంతిరామ్ మెడికల్ కాలేజ్, కర్నూలు - 75
- అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, చిత్తూరు - 75
- విశ్వభారతి మెడికల్ కాలేజ్, కర్నూలు - 75
- శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, తిరుపతి - 75
- ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కడప - 50
- శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమన్, తిరుపతి - 126
- సీకేఎస్ తహేజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, తిరుపతి - 50
- జీ. పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, కర్నూలు - 25
- నారాయణ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, నెల్లూరు - 50

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు; ఓసీ దివ్యాంగులకు 45 శాతం మార్కులు ఉండాలి.

నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకుగాను ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720 నుంచి 162 మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ, బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు 161 నుంచి 127 మధ్య; ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల దివ్యాంగులకు 161-144 మధ్య స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు.

వయసు: 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి. అంతకన్నా తక్కువ వయసు ఉన్నవారిని కౌన్సెలింగ్‌కు అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **అప్లికేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2950; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2360
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్

ఢిల్లీలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) ఫౌండేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ స్కీమ్‌ను ప్రకటించింది. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ, పీజీ(జియాలజీ/జియో ఫిజిక్స్) ప్రోగ్రామ్‌లలో చేరిన అభ్యర్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. మొత్తం 2000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో సగాన్ని మహిళలకు ప్రత్యేకించారు. జోన్‌ల వారీగా జనరల్, ఓబీసీ, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు నిర్దేశించిన ప్రకారం స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారు. తెలుగు రాష్ట్రాలను సౌత్ జోన్ కింద చేర్చారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.48,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ మొత్తాన్ని అకడమిక్ ఇయర్ పూర్తయ్యాక అభ్యర్థి బ్యాంక్ ఖాతాకు జమచేస్తారు. అభ్యర్థులు ఏటా రెన్యువల్ చేసుకోవాలి. అభ్యర్థులు తమ కెరీర్‌లో ఒకసారి మాత్రమే ఈ స్కీమ్‌ను వినియోగించుకొనే వీలుంది.

జనరల్ అభ్యర్థులకు: దేశవ్యాప్తంగా మొత్తం 500 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో ఇంజనీరింగ్‌కు 300, ఎంబీబీఎస్‌కు 50, ఎంబీఏకు 50, పీజీకి 100 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు. సౌత్ జోన్‌కు మొత్తం 100 స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారు.

ఓబీసీ అభ్యర్థులకు: దేశవ్యాప్తంగా మొత్తం 500 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో ఇంజనీరింగ్‌కు 300, ఎంబీబీఎస్‌కు 50, ఎంబీఏకు 50, పీజీకి 100 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు. సౌత్ జోన్‌కు మొత్తం 100 స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు: దేశవ్యాప్తంగా మొత్తం 1000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో ఇంజనీరింగ్‌కు 500, ఎంబీబీఎస్‌కు 90, ఎంబీఏకు 140, పీజీకి 270 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు. సౌత్ జోన్‌కు మొత్తం 200 స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారు.

అర్హత: ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ అభ్యర్థులకు ఇంటర్ స్థాయిలో; ఎంబీఏ, పీజీ(జియాలజీ/ జియో ఫిజిక్స్) అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో ప్రథమశ్రేణి మార్కులు ఉండాలి. అభ్యర్థులు 2024లో రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో ప్రథమ సంవత్సర ప్రవేశం పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షిక ఆదాయం జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రెండు లక్షలు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నాలుగున్నర లక్షలు మించకూడదు. అభ్యర్థులు ప్రోగ్రామ్ పూర్తయ్యేవరకూ ఏటా సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండేలా చూసుకోవాలి.

ఎంపిక: అకడమిక్ మెరిట్ అంటే ప్రోగ్రామ్‌ను అనుసరించి ఇంటర్/డిగ్రీ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులకు సమాన మార్కులు ఉన్న పక్షంలో వారి కుటుంబ వార్షిక ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని తక్కువ ఆదాయం ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 18
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; కులం, ఆదాయం ధృవీకరణ పత్రాలు; అభ్యర్థి బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ కార్డ్; యూనివర్సిటీ/కళాశాల ఐడీ కార్డ్, ప్రవేశం పొందిన రశీదు.
- **వెబ్‌సైట్:** www.ongcscholar.org



లిటిల్స్



కప్ప-ముత్యం

అనగనగా ఒకఅడవిలో కొలనులో ఉండే కప్పకు అదే చోట ఉండే హంసతో మంచి స్నేహం కుదిరింది. కొన్ని రోజుల్లోనే అవి రెండూ ప్రాణ స్నేహితులయ్యాయి. ఒకసారి కప్ప కొలనులోని తామరాకు మీద తేలుతూ, హంస ఒడ్డున నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నాయి.

ఈలోగా ఎక్కడినుండి చూసాడో ఒక వేటగాడు చెట్టు చాటునుండి వచ్చి హంస మీదకు వల విసిరాడు. ఆ వలనుండి తప్పించుకోలేక పాపం హంస విలవిల్లాడింది, కప్ప ఆ వేటగాడిని చూసి, దయచేసి నా నేస్తాన్ని వదిలిపెట్టు అని ప్రాధేయపడింది. దానికి వేటగాడు

నేను వదలను దీన్ని 'సంతలో అమ్మితే చాలా డబ్బు వస్తుంది' అన్నాడు అది విన్న కప్ప నీకు డబ్బే కదా కావలసింది?' అంటూ నీటిలో మునిగి ఒక ముత్యంతో తిరిగి వచ్చి వేటగాడితో ఇలా అన్నది. 'ఈ ముత్యం తీసుకో. దీన్ని అమ్ముకున్నా, నీకు చాలా సొమ్ము వస్తుంది ఇది తీసుకుని నా స్నేహితురాలిని విడిచిపెట్టు' ఆ ముత్యం తీసుకుని, వేటగాడు హంసను వదిలేసి వెళ్లిపోయాడు. అతను ఇంటికి వెళ్లి జరిగినదంతా తన భార్యతో చెప్పాడు ఆమె అంతా విని, 'ఆ కప్ప దగ్గర ఇంకా చాలా



ముత్యాలు ఉండి ఉంటాయి. ఇవాళే వెళ్లి, అవన్నీ తీసుకురా అన్నది. ఆ మర్నాడు వేటగాడు కొలను దగ్గరకు వెళ్లి, కప్పతో 'ఏయ్ నీ దగ్గర ఉన్న ముత్యాలన్నీ నాకు ఇచ్చెయ్ లేదంటే హంసను తీసుకెళ్లిపోతాను అని బెదిరించాడు. దానికి కప్ప ఏదీ నీ దగ్గరున్న ముత్యం ఓసారిలా ఇవ్వు, దాన్ని చూసి, అచ్చం అలాంటి ముత్యాలే వెతికి తీసుకొస్తాను'అని ముత్యం తీసుకుని చటుక్కున నీళ్లలో దూకింది పోతూపోతూ, నా నేస్తం ఎపుడో దాక్కుంది. మేము నీకు దొరకము. అత్యాశతో నీ వద్ద ఉన్న ఒక్క ముత్యం కూడా పోగొట్టుకున్నావు' అన్నది. అనవసరంగా మంచి ముత్యాన్ని వదులుకున్నాను కదా అని వేటగాడు బాధ పడ్డాడు. అంత ఉపాయంతో తన ప్రాణాలు కాపాడిన కప్పకు కృతజ్ఞతలు చెప్పింది హంస. అప్పటినుండి ఆ రెంటి స్నేహం మరింత బలపడింది.



దారి కనుక్కోండి



జంతువులు ఎన్ని ?



సరైన నీడను జత పరచండి



10 తేడాలను కనుక్కోండి

డైలీ సుడోకు - 381

		4	3		
					2
5				6	
	6				5
3					
		1	4		

సుడోకు - 380 సమాధానం

3	2	1	4
4	1	2	3
1	4	3	2
2	3	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.